గురువారం
23-1-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 122
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

హెజ్బుల్లా కమాండర్ దారుణహత్య

బీరుట్: హెజ్బుల్లా సీనియర్ కమాండర్ షేక్ ముహమ్మద్ అలీ హమాదీ దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఆయనను కాల్చి చంపారు. తూర్పు లెబనాన్‌లో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు స్థానిక మీడియా కథనాలు ప్రచురించింది. ముహమ్మద్ అలీ హెజ్బుల్లా అల్-బఖా రీజియన్‌కు కమాండర్‌గా వ్యవహరించాడు. తన నివాసం బయటే ఉన్న ఆయనపై రెండు వాహనాల్లో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా అప్పటికే కన్నుమూసినట్టు వైద్యులు వెల్లడించారు. ముహమ్మద్ మృతికి కారణాలు మాత్రం తెలియాల్సి ఉంది.

ప్రభుత్వ సంకల్పానికి సహకరించండి

- ప్రపంచస్థాయి ప్రమాణాలతో హైదరాబాద్ అభివృద్ధి
- డ్రైపోర్టు నిర్మించి వేర్‌హౌస్ హబ్‌గా తీర్చిదిద్దుతాం
- దావోస్ రౌండ్ టేబుల్ సమావేశంలో రేవంత్ రెడ్డి

దావోస్‌లో ఒకే వేదికపై చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, ఫడ్నవీస్

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రపంచ స్థాయి ప్రమాణాలతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలనే తెలంగాణ ప్రభుత్వ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. స్విడ్జర్లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, హీరో మోటార్ కార్ప్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ ను అత్యంత వేగవంతమైన, పర్యావరణ అనుకూల నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి రావాలని అన్నారు. తెలంగాణలో నాలుగు కోట్ల మంది ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు సహకరించాలని ఆహ్వానిస్తున్నామన్నారు. తక్కువ ఖర్చుతో ప్రజలు వేగంగా ప్రయాణించాలన్నది తమ ప్రభుత్వ ఆకాంక్ష అని పేర్కొన్నారు. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం సమకూర్చు తుందన్నారు. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నామని తెలిపారు. పర్యావరణహితంగా హైదరాబాద్ ను నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దాలనేది అభిమతం అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రత్యేక దృష్టిని సారించామని చెప్పారు. వీటిపై రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు రద్దు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ డ్రైపోర్టును నిర్మించి వేర్‌హౌస్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్రానికి తీరప్రాంతం లేని లోటును పూడ్చడానికి ఈ డ్రైపోర్టును మచిలీపట్నం పోర్టుకు రోడ్డు, రైల్వే మార్గాలతో అనుసంధానం చేస్తామన్నారు. హైదరాబాద్ నగరంలో 1.2 కోట్లకు పైగా జనాభా ఉందని, దాదాపు 100 కిలోమీటర్లకు పైగా కొత్తగా మెట్రో లైన్లను నిర్మిస్తున్నట్టు వివరించారు. ప్రస్తుతం హైదరాబాద్ చుట్టూ 160 కి.మీ మేరకు ఔటర్ రింగ్ రోడ్డు ఉండగా, దాని వెలుపల 360 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. వీటిని కలుపుతూ రేడియల్ రోడ్లు కూడా నిర్మిస్తామని చెప్పారు. వీటికి అనుబంధంగా రింగ్ రైల్వే లైను నిర్మించాలనే ఆలోచనతో ఉన్నామన్నారు.

ఏఐ డేటా సెంటర్... ప్రభుత్వంతో 'కంట్రోల్ ఎస్' ఒప్పందం

తెలంగాణలో అత్యాధునిక ఏఐ డేటాసెంటర్ క్లస్టర్‌ను నెలకొల్పేందుకు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ కంపెనీ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది.

దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా ఈ ఒప్పందం కుదిరింది. ఈ కంపెనీ రూ.10 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. 400 మెగావాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ నెలకొల్పుతుంది. దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఈ డేటా సెంటర్ మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఐటీ సేవల సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. తెలంగాణలో ఐటీ సేవల ప్రమాణాలు మరింత వృద్ధి సాధిస్తాయని కంట్రోల్ ఎస్

- మిగతా 2 లో

ప్రతి ఎకరాకు సాగునీరు

- నారాయణపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తాం
- అర్హులందరికీ రేషన్ కార్డు: మంత్రులు ఉత్తమ్, పొన్నం

విశాలాంధ్ర-హైదరాబాద్: నారాయణపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గంగాధర మండలం నారాయణపూర్‌లో బుధవారం గ్రామ సభ ఏర్పాటు చేశారు. తొలుత నారాయణపూర్ రిజర్వాయర్‌ను వీరు సందర్శించారు. అనంతరం గ్రామసభలో మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి తక్కువ ఆయకట్టుకు నీరిచ్చిందని విమర్శించారు. తమ ప్రభుత్వం తక్కువ ఖర్చుతో పెద్దఎత్తున ఆయకట్టుకు నీరు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నదని తెలిపారు. అత్యంత ప్రాధాన్యత ప్రాజెక్టుల జాబితాలో నారాయణపూర్ రిజర్వాయర్‌ను చేరుస్తామని చెప్పారు. ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి అవసరమైన రూ.70 కోట్లు విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఏడాదిలోగా ప్రాజెక్టు పూర్తి చేసి పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీళ్లు అందిస్తామన్నారు. రిజర్వాయర్ ముంపు విషయంలో నారాయణపూర్ ప్రజలకు న్యాయం చేస్తామని అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల్లో వెలుగును నింపేందుకు తమ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని చెప్పారు. అర్హులైన వారందరికీ రేషన్‌కార్డు అందజేస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈనెల 26న మరో నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టామని వివరించారు.

జనవరిలోనే ఎల్లంపల్లి జలాలు విడుదల...

గతంలో లేనివిధంగా జనవరిలోనే నారాయణపూర్ జలాశయానికి ఎల్లంపల్లి నీటిని జనవరిలోనే విడుదల చేశామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మెట్ట ప్రాంతంగా ఉన్న చొప్పదండి నియోజకవర్గంలో జలయజ్ఞంలో భాగంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నారాయణపూర్ జలాశయానికి శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామన్నారు. అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రపోజ్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జీల నియామక ఉత్తర్వుల జారీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు నూతన న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం జారీ చేసిన నియామక ఉత్తర్వులను బుధవారం కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఇద్దరు న్యాయమూర్తులు... జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు , తెలంగాణ హైకోర్టుకు నలుగురు న్యాయమూర్తులు జస్టిస్ రేణుక ఎర్రా, జస్టిస్ నర్సింగరావు నందికొండ, జస్టిస్ తిరుమలదేవి ఎడ, జస్టిస్ మధుసూదనరావు

- మిగతా 2 లో

గగన్‌యాన్ మిషన్‌లో పురోగతి

బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ మిషన్‌లో దశలవారీగా పురోగతి సాధిస్తోంది. మానవరహిత గగన్‌యాన్ (జీ౧) కోసం క్రూ మాడ్యూల్‌ను సిద్ధం చేసింది. లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ విజయవంతంగా పూర్తి కావడంతో క్రూ మాడ్యూల్‌ను బెంగళూరులోని ఇస్రో లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్ (ఎల్‌పీఎస్‌సీ) నుంచి ఆంధ్రప్రదేశ్, శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రానికి పంపింది. ఈ మేరకు ఇస్రో బుధవారం ఒక

- మిగతా 2 లో

ఐదుగురు కామాంధులకు మరణ శిక్ష

రాయ్‌పూర్: పదహారేళ్ల బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడి...ఆపై హత్య చేసి, ఆమె ఇద్దరు కుటుంబ సభ్యులను కూడా హత్య చేసిన ఐదుగురు వ్యక్తులకు చత్తీస్‌గఢ్‌లోని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు మరణశిక్ష విధించింది. ఇదే కేసులో మరొకరికి కోర్టు జీవితఖైదు విధించింది. 2021లో ఈ సంఘటన జరిగింది. కోర్బా జిల్లాలోని ఫాస్ట్ ట్రాక్ కోర్టు అదనపు సెషన్స్ జడ్జి భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ)లోని సెక్షన్లు 302 (హత్య), 376 (2)జి (సామూహిక అత్యాచారం), ఇతర సెక్షన్లు, ఎస్సీఎస్టీ అట్రాసిటీ

- మిగతా 2 లో

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు

జాబితాల్లో పొరపాట్లు సరిచేయండి: కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని, ఎవరూ ఆందళన చెంద వద్దని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రజలకు భరోసా ఇచ్చారు. అర్హుల జాబితాలో పేర్లు నమోదుకాని వారందరి దరఖాస్తులు స్వీకరించి పథకాలు అందిస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలో రెండో రోజు బుధవారం నిర్వహించిన వార్డు, గ్రామసభల్లో ఆయన పాల్గొని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియని పర్యవేక్షించారు. ప్రతి పేద కుంటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు, తెల్ల రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రామసభల్లో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులపై సర్వే నిర్వహించిన అధికారులు అర్హుల జాబితాను ప్రకటించారన్నారు. పూర్తిస్థాయిలో అర్హులను జాబితాలో చేర్చకపోవడంతో ఆందోళనకు గురౌవుతున్నారని చెప్పారు. జాబితాలో జగిరిన పొరపాట్లను సరిచేయాలని సూచించారు. అర్హుడికి అన్యాయం జరిగినా ఉపేక్షించేదిలేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, తహసీల్దార్ పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులు, కౌన్సిలర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మావోయిస్టు హైటెక్ శిక్షణా శిబిరం ధ్వంసం

బీజాపూర్‌లో భద్రతా బలగాల ఆపరేషన్

విశాలాంధ్ర-చింతూరు : మావోయిస్టులు లక్ష్యంగా భద్రతా బలగాలు కూంబింగ్ కొనసాగిస్తున్నాయి. ఒడిశా-చత్తీస్‌గఢ్ సరిహద్దులోని గరియాబంద్ జిల్లా కులరీఘాట్ అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి నుంచి జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మరణించిన విషయం తెలిసిందే. ఈ భారీ ఎన్‌కౌంటర్‌తో చత్తీస్‌గఢ్‌లో తీవ్ర అలజడి కొనసాగుతోంది. తాజాగా బీజాపూర్ జిల్లాలో కటకం సుదర్శన్ పేరుతో గల హైటెక్ శిక్షణా శిబిరాన్ని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. బీజాపూర్-తెలంగాణ సరిహద్దులో ఉన్న భట్టిగూడ దట్టమైన అడవులలో మావోయిస్టులు ఈ శిబిరాన్ని నిర్మించారు. మంగళవారం కోబ్రా బెటాలియన్ సైనికులు ఈ శిబిరంపై దాడి చేసి పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

శిబిరంలో హైటెక్ సౌకర్యాలు

మావోయిస్టులు చాలా వ్యూహాత్మకమైన ప్రదేశంలో ఈ శిబిరాన్ని

- మిగతా 2 లో

ఘోర రైలు ప్రమాదం

12 మంది దుర్మరణం

- పుష్పక్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలంటూ పుకార్లు
- చైన్ లాగి కిందకు దిగిన ప్రయాణికులు
- ఎదురుగా వచ్చి ఢీకొన్న కర్నాటక ఎక్స్‌ప్రెస్
- రూ.5 లక్షల పరిహారం ప్రకటించిన మహారాష్ట్ర ప్రభుత్వం

ముంబై: మహారాష్ట్రలోని జలగావ్ జిల్లాలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. లక్నో నుంచి ముంబై, ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినల్‌కు పుష్పక్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు వ్యాపించినట్లు పుకార్లు రావడంతో ప్రయాణికులు కంగారు పడ్డారు. చైను లాగి కిందకు దూకి పట్టాలు దాటేందుకు ప్రయత్నించారు. ఇంతలో ప్రయాణికులపైకి కర్నాటక ఎక్స్‌ప్రెస్ దూసుకొచ్చింది. దీంతో 12 మంది దుర్మరణం చెందారు. అనేక మందికి గాయాలయ్యాయి. బుధవారం సాయంత్రం 5 గంటలకు జలగావ్‌లోని పంచోరా సమీపంలో, పూనేకు 450కిమీల దూరంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లక్నో నుంచి ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినల్‌కు పుష్పక్ ఎక్స్‌ప్రెస్ వస్తుండగా ఈ దుర్ఘటన సంభవించినట్లు కేంద్ర రైల్వే అధికార ప్రతినిధి స్వప్నిల్ నీలా తెలిపారు. 'పుష్పక్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

- మిగతా 2 లో

రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే

24 నుంచి రాష్ట్ర మంతటా కమిటీ పర్యటన: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రేవంత్ ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలు, హామీలు అమలు చేయకపోవడంతోనే అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. రైతు ఆత్మహత్యలపై వేసిన తమ కమిటీకి ఎలాంటి రాజకీయ దురుద్దేశ్యం లేదని, కేవలం రైతాంగానికి అండగా నిలబడాలన్నదే తమ ఆలోచనని పేర్కొన్నారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో బుధవారం అధ్యయన కమిటీ తొలి సమావేశం జరిగింది. అనంతరం మీడియాతో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఒరే అయ్యా, నాయనా, అవి నా భూముల్రా బాబూ!

బీజేపీకి మణిపూర్ జేడీయూ ఝలక్

- బీరెన్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించినట్లు ప్రకటన
- నిజం కాదన్న అధినాయకత్వం... పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిపై వేటు

ఇంఫాల్: మణిపూర్ రాష్ట్ర రాజకీయాల్లో బుధవారం కీలక పరిణామం చోటు చేసుకొంది. రాష్ట్రంలోని ఎన్ బీరెన్ సింగ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి జేడీ (యూ) తన మద్దతు ఉపసంహరించుకున్నట్లు జేడీ (యూ) రాష్ట్ర అధ్యక్షుడు క్షేత్రమయుం బీరేన్ సింగ్ ప్రకటించారు. ఈ మేరకు ఆ రాష్ట్ర గవర్నర్ అజయ్ కుమార్ భల్లాకు లేఖ ద్వారా సమాచారం అందించారు. అయితే కొద్దిసేపటికే జేడీయూ అధినాయకత్వం అలాంటిదేమీ లేదంటూ వివరణ ఇచ్చుకుంది. ఆ వార్తల్లో ఎంతమాత్రం నిజం లేదని జేడీయూ జాతీయ ప్రతినిధి రాజీవ్ రంజన్ ప్రసాద్ వివరణ ఇచ్చారు. పార్టీ జాతీయ నాయకత్వాన్ని సంప్రదించకుండా మణిపూర్ జేడీయూ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు క్షేత్రమయుం బీరేన్ సింగ్ సొంతంగా ప్రకటన చేసినట్లు చెప్పారు. బీరేన్‌సింగ్‌ను క్రమశిక్షణారాహిత్యం కింద పదవి నుంచి తొలగించినట్లు వెల్లడించారు. అంతకుముందు మణిపూర్‌లోని బీజేపీ ప్రభుత్వానికి జేడీయూ మద్దతు ఉపసంహరించుకున్నట్టు బీరేన్ సింగ్ అధికారిక

- మిగతా 2 లో

దలేవాల్‌కు చికిత్సలో నిర్లక్ష్యం

జూనియర్ డాక్టర్లతో వైద్యం: రైతు నాయకుల ఆరోపణ

చండీగఢ్: రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ వైద్యసాయాన్ని స్వీకరించారు. అయితే ఆయనకు వైద్యం అందించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రైతు నాయకులు ఆరోపించారు. అనుభవమున్న వైద్యునికి బదులు ఐవీ-డ్రిప్ పెట్టడం చేతకాని ట్రైనీ డాక్టర్‌లతో దలేవాల్‌కు చికిత్స ఇప్పిస్తున్నారని రైతు నేత కాకా సింగ్ కోట్రా ఆగ్రహం వ్యక్తం చేశారు. జూనియర్ వైద్యుడికి ఐవీ పెట్టడం రాకపోవడంతో దలేవాల్ చేతుల నుంచి రక్తం కారిందని, దీంతో ప్రైవేటు డాక్టర్లతో ఆయనకు వైద్యం ఇప్పించాల్సి వచ్చిందని చెప్పారు. సీనియర్లు నిద్రపోతుండటంతో తాను వచ్చినట్లు జూనియర్ డాక్టర్ తమతో చెప్పారన్నారు. రైతుల కోసం వైద్య శాఖ వద్ద వైద్యులు లేకపోతే ప్రైవేటు వైద్యులను తామే పిలిపించుకొని దలేవాల్‌కు వైద్యం చేయిస్తామన్నారు. దలేవాల్‌కు వైద్యం అందించే విషయంలో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు రైతు నాయకులు ఆరోపిస్తుండటంతో సివిల్ సర్జన్ డాక్టర్ జగ్‌పాలిందర్ సింగ్ నాయకత్వంలోని బృందం ఖనౌరి సరిహద్దు వద్దకు చేరుకొని దలేవాల్ ఆరోగ్య పరిస్థితిని

- మిగతా 2 లో

రాయల్ నేవీ తిరుగుబాటు

దాదాపు 150 మంది బ్రిటిష్ అధీనంలోని భారత నౌకాదళ సిబ్బంది మద్రాసులోని హెచ్.ఎం.ఐ.ఎస్. నౌకా స్థావరంలో 1946 ఫిబ్రవరి 19న తిరుగుబాటు చేశారు. తిరుగుబాటు చేసినవారు నినాదాలు చేస్తూ, బ్రిటిష్ అధికారుల మీద దాడిచేస్తూ వీధుల్లో తిరిగారు. ఈ తిరుగుబాటులో సైనికులు, పోలీసులు, పౌరులు కూడా పాల్గొన్నారు. మొదట ఈ తిరుగుబాటు ఛాయలు బొంబాయిలో కనిపించాయి.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

ట్రంప్ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధం

కోర్టుకెళ్లిన 22 రాష్ట్రాలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పగ్గాలను చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ దూకుడు ప్రదర్శిస్తూ కొన్ని కీలక ఉత్తర్వులను చకచకా జారీ చేశారు. వలసదారుల పిల్లలకు జన్మతో వచ్చే అమెరికా పౌరసత్వం రద్దు చేస్తూ ట్రంప్ ఉత్తర్వులు ఇచ్చారు. వీటిని డెమొక్రాట్లు, భారత్ సంతతికి చెందిన శాసనసభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. ట్రంప్ పరిపాలన తీరుపై 22 రాష్ట్రాలు అభ్యంతరం తెలిపాయి. అధ్యక్షుడి ఉత్తర్వులను వ్యతిరేకించాయి. వందేళ్ల నాటి ప్రక్రియకు స్వస్తి పలికే ట్రంప్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ 22 రాష్ట్రాలు కోర్టుకు వెళ్లాయి. ట్రంప్ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమంటూ రెండు వ్యాజ్యాలు దాఖలు చేశాయి. తాజా ఉత్తర్వులు అమల్లోకి రాకుండా చేయాలని అందులో కోరాయి. అమెరికా రాజ్యాంగంలో 14వ సవరణ ప్రకారం అమెరికాలో పుట్టిన వలసవాదుల పిల్లలకు జన్మతోనే ఆ దేశ పౌరసత్వం లభిస్తుంది. అయితే దీనిని రద్దు చేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. దీనిపై కోర్టుకు వెళ్లిన రాష్ట్రాల్లో న్యూజెర్సీ, కాలిఫోర్నియా, కొలరాడో, కనెక్టికట్, దలావరే, మాచెస్టస్, మిచిగన్, హవాయి, మెయిన్, మేరీల్యాండ్, మిన్నెసోటా,నెవాడా, న్యూ మెక్సికో, న్యూయార్క్, నార్త్ కరోలినా, విస్కోన్సిన్, రోడే ఐలాండ్, వెర్మోంట్ ఉన్నాయి. అరిజోనా, ఇల్లినాయిస్, ఓరెగాన్, వాషింగ్టన్ కూడా ఫెడరల్ కోర్టులో ట్రంప్ ఉత్తర్వులను సవాల్ చేశాయి. ట్రంప్ తీరును కాలిఫోర్నియా అటార్నీ జనరల్ తప్పుపట్టారు. ఆయన ఉత్తర్వులను రద్దు చేయాలని తమ వ్యాజంలో కోరారు. కలం గీతతో 14వ సవరణను అధ్యక్షుడు కొట్టివేయలేరని న్యూజెర్సీ అటార్నీ జనరల్ మ్యాట్ ప్లాట్కిన్ పేర్కొన్నారు. 'అమెరికా గడ్డ మీద పుట్టినవారు అమెరికన్లే అవుతారు. దీనిపై వాదనకు ప్రసక్తే లేదు' అని కనెక్టికట్ అటార్నీ జనరల్ విలియం టాంగ్ అన్నారు. ఈయన తొలి చైనా-అమెరికన్ అటార్నీ జనరల్. చైనా సంతతికి చెందిన అమెరికన్‌గా తాజా వ్యాజ్యం తనకు వ్యక్తిగతమైదని ఆయనన్నారు.

న్యాయ పోరాటానికి సిద్ధం: శ్వేతసౌధం

22 రాష్ట్రాలు కోర్టుకు వెళ్లడంపై శ్వేతసౌధం స్పందించింది. న్యాయ పోరాటానికి సిద్ధమని ప్రకటించింది. ట్రంప్ నాయకత్వంతో కలిసి పనిచేస్తారా లేక ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా పనిచేస్తారా నిర్ణయించుకోండి అంటూ 22 రాష్ట్రాలకు శ్వేతసౌధం డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ హారిసన్ ఫీల్డ్ సవాల్ విసిరారు. కాగా, అమెరికాలో సుమారు 50 లక్షల (1.47 శాతం) మంది భారతీయులు ఉన్నారు. వీరిలో మూడో వంతు మంది అమెరికాలో పుట్టినవారే ఉన్నారు.

ఫిబ్రవరి నుంచి చైనాపై 10 శాతం సుంకం

వాషింగ్టన్: చైనాపై 10శాతం సుంకం అమలు చేసే యోచనలో ట్రంప్ సర్కార్ ఉంది. మెక్సికో, కెనాడాకు ఫెంటనైల్ సరఫరా కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. చైనాపై సుంకం విధించే అంశాన్ని ట్రంప్ స్వయంగా విలేకరులతో చెప్పారు. ఓరాకిల్ సీటీవో లారీ ఎల్లిసన్, సాఫ్ట్‌బ్యాంక్ సీఈవో మాసాయోషి సాన్, ఓపెన్ ఏఐ సీఈవో శ్యామ్ ఆల్ట్‌మ్యాన్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చైనాపై సుంకం విధించేందుకు ఫిబ్రవరి 1వ తేదీని పరిగణిస్తున్నట్లు ఓ ప్రశ్నకు ట్రంప్ సమాధానం ఇచ్చారు. గతవారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశంలో సుంకాల గురించి పెద్దగా మాట్లాడలేదన్నారు. ఉక్రెయిన్‌లో యుద్ధం ఆపేందుకు జిన్‌పింగ్ జోక్యాన్ని కోరారా అని ఒక విలేకరి ప్రశ్నించగా చైనా ఈ విషయంలో పెద్దగా చేసినదేమీ లేదంటూ ట్రంప్ సమాధానమిచ్చారు.

శ్వేతసౌధం వెబ్‌సైట్ నుంచి రాజ్యాంగం మాయం

వాషింగ్టన్: శ్వేతసౌధం అధికారిక వెబ్‌సైట్‌లో అమెరికా రాజ్యాంగం ప్రతి మాయమైంది. ఇది వివాదాస్పదంగా మారింది. ట్రంప్ అధ్యక్ష పగ్గాలు చేపట్టిన తర్వాత శ్వేతసౌధం అధికారిక వెబ్‌సైట్‌లో మార్పులు, చేర్పులు మొదలయ్యాయి. రాజ్యాంగ పేజీ కనిపించకపోవడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వెబ్‌సైట్‌లో రాజ్యాంగం పేజీకి వెళితే '404 ఎర్రర్' అని వస్తుండటం సామాజిక మాధ్యమాల్లో వివాదాస్పదమైంది. దీంతో ట్రంప్ యంత్రాంగంపై ప్రశ్నలు వస్తున్నాయి. వెబ్‌సైట్ హోంపేజీలో ట్రంప్ చిత్రంతో పాటు పెద్ద అక్షరాల్లో 'అమెరికా ఈజ్ బ్యాక్' అన్న సందేశం కనిపిస్తోంది. 'మీ కోసం ప్రతి రోజు... చివరి శ్వాస వరకు పోరాడుతా. శక్తిమంతమైన, సురక్షిత, సుభిక్ష అమెరికాను సాధించే వరకు విశ్రమించను. ఇది అమెరికాకు స్వర్ణయుగం' అని ఉంది. అధ్యక్షుడి కొత్త ఉత్తర్వులు, పరిపాలన ప్రాధాన్యతల లింకు కూడా ఉంది. అయితే రాజ్యాంగం పేజి మాత్రం లేదు. అక్కడ '404 ఎర్రర్... పేజ్ నాట్ ఫౌండ్' అని ఉండటం చర్చకు దారితీసింది. ఇంకొన్ని పేజీల్లోనూ ఇదే తరహా సందేశం ఉండటం వివాదానికి తెరతీసింది. అధికారిక వెబ్‌సైట్ స్పానిష్ వర్షన్‌ను ట్రంప్ యంత్రాంగం తొలగించింది. కాగా, మార్పులు, చేర్పుల క్రమంలో ఇలాంటి పరిణామాలు జరుగుతున్నాయని, త్వరలోనే సమాచారం మొత్తం అందుబాటులోకి వస్తుందని శ్వేతసౌధం ప్రిన్సిపల్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ హారిసన్ వెల్లడించారు.

మావోయిస్టు హైటెక్ శిక్షణా శిబిరం ధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించారు. ఇక్కడ తమ సభ్యులకు ఆయుధ శిక్షణ ఇవ్వడమే కాకుండా కొత్త సభ్యులను కూడా చేర్చుకున్నారు. శిబిరంలో శాశ్వత బ్యారక్‌లు, గుడిసెలు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు ఉన్నాయి. అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయం ఏమిటంటే, మావోయిస్టులు ఇక్కడ శిక్షణ కోసం పొడవైన చెట్లను కూడా సిద్ధం చేశారు. తమ శిబిరాల్లోకి చొరబడే భద్రతా బలగాలను మట్టుబెట్టేందుకు ఈ చెట్లను ఉపయోగించారు. కాగా ఈ శిబిరంలో ఉన్న మావోయిస్టుల స్మారక చిహ్నాన్ని కూడా భద్రతా బలగాలు కూల్చివేశాయి. మావోయిస్టుల కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా భద్రతా బలగాలు ఈ ఆపరేషన్ చేపట్టాయి. ఇందులో భాగంగా భద్రతా బలగాలు చాలా జాగ్రత్తలు తీసుకున్నాయి. తద్వారా ఏ పౌరునికీ హాని కలగదని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. మావోయిస్టులు మళ్లీ క్రియాశీలంగా మారకుండా భద్రతా బలగాలు ఈ ప్రాంతంలో నిరంతరం గస్తీ నిర్వహిస్తాయి. ఇది కాకుండా, మావోయిస్టులచే తప్పుదారి పట్టకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించడానికి పోలీసు యంత్రాంగం కూడా ప్రచారం చేపట్టింది. బీజాపూర్‌లోని మావోయిస్టుల అత్యాధునిక శిక్షణా శిబిరాన్ని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకోవడం ఒక పెద్ద సంఘటనగా భావిస్తున్నారు.

దలేవాల్‌కు చికిత్సలో నిర్లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

సమీక్షించింది. కాకా సింగ్ ఆరోపణలను తోసిపుచ్చింది. దలేవాల్ ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం కోసం ప్రత్యేక వైద్యుల బృందాన్ని నియమించినట్లు డాక్టర్ సింగ్ చెప్పారు. వైద్యుల సూచనల మేరకు గాలి, వెలుతురు వచ్చే విధంగా ట్రాక్టర్ ట్రాలీపై ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన కొత్త గదిలోకి దలేవాల్‌ను బుధవారం మార్చినట్లు చెప్పారు.

స్వాగతిస్తున్నాం: సుప్రీం

దలేవాల్ వైద్యాన్ని స్వీకరించడం సానుకూల పరిణామమని సుప్రీంకోర్టు జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం పేర్కొంది. కేంద్రం ఆహ్వానం మేరకు ఫిబ్రవరి 14వ తేదీన చండీగఢ్‌లో సమావేశానికి రైతులు అంగీకరించినట్లు కోర్టుకు పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మిందర్ సింగ్ తెలిపారు. దలేవాల్‌తో పాటు దీక్ష చేపట్టిన మరో 110 మంది రైతు నాయకులు కూడా దీక్ష విరమించారన్నారు. దలేవాల్ వైద్యం తీసుకుంటుండటంతో ఆయన ఆరోగ్యం మెరుగవుతుందని ఆకాంక్షించిన సుప్రీం ధర్మాసనం... చర్చలు జరగాల్సిన తేదీకి రెండు రోజుల ముందుగానే ఆయన చండీగఢ్‌కు చేరుకోవాలని సూచించింది. అంతకంటే ముందు పీజీఐ చండీగఢ్ వైద్య నిపుణుల సూచనలు తీసుకోవాలని పేర్కొంది. దలేవాల్ వైద్యాన్ని స్వీకరించడం, ఆయనను ఖనౌరీ సరిహద్దుకు 50మీటరల దూరంలోని తాత్కాలిక ఆసుపత్రికి తరలించడంపై పంజాబ్ ప్రభుత్వం వాంగ్మూలాన్ని సుప్రీంకోర్టు రికార్డు చేసింది. పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీపై ధిక్కచరణ చర్యలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి చివరిలో చేపడతామని తెలిపింది. కేంద్రంతో జరగబోయే చర్చల్లో భాగస్వాములంతా పాల్గొని దేశానికి ప్రయోజకరమైన నిర్ణయాలు తీసుకుంటారని ఆకాంక్షిస్తున్నట్లు జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు.

రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ ఆదిలాబాద్ బ్యాంకులో ఆత్మహత్య చేసుకున్న రైతు విషాద ఘటనే కమిటీ వేయడానికి కారణమని చెప్పారు. తమ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశం మేరకు ఏర్పాటైన కమిటీ ఈ నెల 24 నుంచి పూర్వ ఆదిలాబాద్ జిల్లా నుంచి పని ప్రారంభిస్తుందన్నారు. నెల రోజులపాటు అన్ని జిల్లాలలో రైతులను కలిసి రుణమాఫీ ఎంత మేర జరిగింది... కరెంటు సరఫరా ... సాగు పరిస్థితి... మద్దతు ధర దొరకుతుందా... బోనస్ ... కొనుగోలు కేంద్రాలు... రైతు వేదికలు పనిచేస్తున్నాయా తదితర అంశాలను అధ్యయనం చేస్తుందన్నారు. రైతాంగం ఆత్మహత్యలకు కారణాలను అధ్యయనం చేసి నివేదికను రూపొందిస్తుందన్నారు. ఆ నివేదికను కేసీఆర్ తో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తుందన్నారు. రైతు డిక్లరేషన్ పేరిట రాహుల్ గాంధీ నాయకత్వంలో వరంగల్ వేదికగా రైతులకు కాంగ్రెస్ ఎన్నో హామీలను ఇచ్చిందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ, 15 వేల రైతు భరోసా, మద్దతు ధర, బోనస్, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు హామీలను నమ్మి రైతులు ఆ పార్టీకి అధికారాన్ని అప్పగించారన్నారు. అయితే ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ దారుణంగా విఫలమైందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా ప్రతిపక్షాలపై అక్రమకేసులు బనాయించడం, సోషల్ మీడియా పోస్టులకు భయపడి అరెస్టుల చేసే తాపత్రయం సీఎం రేవంత్ దన్నారు. హైకోర్టు తీర్పునకు అనుగుణంగా త్వరలోనే నల్లగొండలో రైతు ధర్నా నిర్వహిస్తామన్నారు.

గగన్‌యాన్ మిషన్‌లో పురోగతి

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటనలో తెలిపింది. క్రూ మాడ్యూల్‌లో మూడు యాక్సిస్ కంట్రోల్స్ 'పిట్చ్, యా, రోల్' ఉన్నాయని పేర్కొంది. వ్యోమనౌకలో ప్రొపల్షన్ కోసం వినియోగించే రాకెట్ మోటార్లలో 100 ఎన్ థ్రస్టర్లు ఉన్నట్లు తెలిపింది. క్రూ మాడ్యూల్ అప్‌రైటింగ్ సిస్టమ్ (సీఎంయూఎస్)ను విక్రమ్ సారాభాయి అంతరిక్ష కేంద్రం (వీఎస్ఎస్సీ) డిజైన్ చేసినట్లు వెల్లడించింది. క్రూ మాడ్యూల్‌కు ఏవియోనిక్స్ ప్యాకేజి అసెంబ్లీ, ఎలక్ట్రికల్ హార్నెసింగ్ వంటివి వీఎస్ఎస్సీలో జరుగుతాయని ఇస్రో పేర్కొంది. అన్నీ పూర్తి అయ్యాక తుదిగా ఆర్బిటల్ మాడ్యూల్ ఇంటిగ్రేషన్ కోసం దానిని బెంగళూరులోని యూఆర్ రావు ఉపగ్రహం కేంద్రానికి చేరవేస్తారని ఇస్రో ప్రకటన వెల్లడించింది.

దావోస్ జోష్ !

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దావోస్ పర్యటన ఉత్తేజపూరితంగా సాగుతోంది. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో భాగంగా దావోస్ వెళ్లిన చంద్రబాబు మూడో రోజూ బిజీబిజీగా గడిపారు. రాష్ట్రానికి పెట్టుబడుల్ని ఆకర్షించేందుకు ప్రముఖ సంస్థల అధిపతులతో వరుస భేటీలు నిర్వహించారు. పెట్టుబడులు పెట్టడానికి ఏపీలో ఉన్న అవకాశాలను సమగ్రంగా వివరించారు. దీనిలో భాగంగా మైక్రోసాఫ్ట్ అధినేత, ప్రపంచ ఐటీ దిగ్గజం బిల్‌గేట్స్‌తో చంద్రబాబు, రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ దావోస్ ప్రొమెనేడ్ మైక్రోసాఫ్ట్ కేఫ్‌లో భేటీ అయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నపుడు తమపై నమ్మకంతో మైక్రోసాఫ్ట్ ఐటీ కేంద్రాన్ని నెలకొల్పడంతో హైదరాబాద్ రూపురేఖలు మారిపోయిన విషయాన్ని బిల్‌గేట్స్‌కు చంద్రబాబు గుర్తుచేశారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఏపీలో ఐటీ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని సీఎం కోరారు. 'ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేయబోతున్న వరల్డ్ క్లాస్ ఏఐ యూనివర్సిటీ సలహామండలిలో భాగస్వామ్యం వహించండి. మీ అమూల్యమైన సలహాలు మా రాష్ట్రంలో ఐటీ అభివృద్ధికి దోహదం చేస్తాయి. ఏపీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ హెల్త్ ఇన్నోవేషన్ అండ్ డయాగ్నోస్టిక్స్ ఏర్పాటు చేయడానికి బిల్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ తరపున రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం వహించండి' అని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ ఎకోసిస్టమ్ నడపడానికి ఆఫ్రికాలో హెల్త్ డ్యాష్‌బోర్డ్‌ల తరహాలో సామాజిక వ్యవస్థాపకతలో ఫౌండేషన్ తరపున నైపుణ్య సహకారాన్ని అందించి... దక్షిణ భారతంలో బిల్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ కార్యకలాపాలకు ఏపీని గేట్‌వేగా నిలపాలని కోరారు. మీ సహకారంతో స్థానిక ఉత్పత్తులపై ప్రపంచ ఆవిష్కరణలు అమలు చేసేలా ఏపీ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి లోకేశ్ తెలిపారు. దూరదృష్టి గల నేత చంద్రబాబును చాలాకాలం తర్వాత కలవడం ఆనందంగా ఉందని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సహచరులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని బిల్‌గేట్స్ చెప్పారు. దీనికిముందు సర్వర్‌ల కోసం సొంత చిప్‌లు రూపొందిస్తున్న గూగుల్ క్లౌడ్ కంపెనీని విశాఖపట్నంలో డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాల్సిందిగా సీఎం ఆ కంపెనీ సీఈవో థామస్ కురియన్‌ను కోరారు. సర్వర్ నిర్వహణ సేవల విషయంలో ఏపీని ప్రధాన కేంద్రంగా చేసుకోవాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం పూర్తిగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు.

పెట్రోనాస్ ప్రెసిడెంట్‌తో చర్చలు

పెట్రోనాస్ ప్రెసిడెంట్, గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ముహమ్మద్ తౌఫిక్‌తో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. 'పెట్రోనాస్' మలేసియాకు చెందిన ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కంపెనీ. ప్రస్తుతం గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, గ్రీన్ మాలిక్యులస్‌కు సంబంధించి భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. 2030 కల్లా ఏడాదికి 5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు సంబంధించి కాకినాడ ప్లాంటులో రూ.13 వేల కోట్ల నుంచి రూ.15 వేల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. పెట్రోకెమికల్ హబ్‌గా అవతరిస్తున్న మూలపేటలోనూ, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌లోనూ పెట్టుబడులు పెట్టాల్సిందిగా ముహమ్మద్ తౌఫిక్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

ఏపీలో స్మార్ట్ కంటైనర్ టెర్మినల్

ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్ కంటైనర్ టెర్మినల్ ఏర్పాటుకు ముందుకు రావాలని ప్రపంచంలో కంటైనర్ టెర్మినల్‌లో ప్రతిష్ఠాత్మక సంస్థ డీపీ వరల్డ్‌ను ముఖ్యమంత్రి కోరారు. ఈమేరకు డీపీ వరల్డ్ సెంట్రల్ ఏసియా, ఆఫ్రికా మేనేజింగ్ డైరెక్టర్ రిజ్వాన్ సూమర్‌తో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. భారతదేశంలో డీపీ వరల్డ్‌కు ఐదు కంటైనర్ టెర్మినల్స్ ఉన్నప్పటికీ ఏపీలో ఇప్పటివరకు ఒక్కటీ లేదని, ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, కృష్ణపట్నం, మూలపేటలో స్మార్ట్ కంటైనర్ టెర్మినల్ ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. దీనిపై ఆలోచన చేయాలని రిజ్వాన్ సుమూర్‌ను ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న సీ పోర్టుల్లోనూ, ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్‌పైనా పెట్టుబడులు పెట్టేందుకు ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

పెప్సీకో అధిపతులతో సమావేశం

పెప్సీకో ఇంటర్నేషనల్ బెవరేజస్ సీఈవో యూజీన్ విల్లెంసెన్, పెప్సీకో ఫౌండేషన్ ఛైర్మన్ స్టీఫెన్ కెహోతో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చలు జరిపారు. పెప్సీకో ప్రపంచంలో రెండో అతిపెద్ద ఫుడ్ బెవరేజెస్. ఇప్పటికే ఏపీలోని శ్రీసిటీలో బాటిలింగ్ ప్లాంట్ నిర్వహిస్తున్న పెప్సికో బెవరేజస్... విశాఖపట్నాన్ని గ్లోబల్ డెలివరీ సెంటర్‌గా చేసుకుని పెప్సీకో డిజిటల్ హబ్‌ను ఏర్పాటు చేయవచ్చని ముఖ్యమంత్రి సూచించారు. గ్లోబల్ బిజినెస్ సర్వీస్ సెంటర్‌ను విశాఖకు విస్తరించాల్సిందిగా కోరారు. కుర్‌కురే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుతో పాటు పెప్సీకో తమ సరఫరా చైన్ ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ఏపీసీఎన్ఎఫ్‌తో భాగస్వామ్యం కావాలని సూచించారు.

బహ్రెయిన్ ప్రధాని కార్యాలయం ప్రతినిధి హమద్ అల్ మహ్మూద్, ముంతాలకత్ సీఈవో అబ్దుల్లా బిన్ ఖలీఫా అల్ ఖలీఫాతోనూ ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీలను వివరించిన ముఖ్యమంత్రి... స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసం ఏపీకి రావాలని ఆహ్వానించారు.

ఒకే వేదికపై ముగ్గురు ముఖ్యమంత్రులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దావోస్‌లో అరుదైన ఘటన చోటుచేసుకుంది. ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైన సీఎం చంద్రబాబు మూడోరోజు పర్యటనలో భాగంగా బుధవారం జరిగిన కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్ సమావేశానికి హాజరయ్యారు. ఇదే సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పాల్గొన్నారు. దేశం ఒక యూనిట్‌గా పెట్టుబడులు రాబట్టేలా కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశంలో పాల్గొన్నారు. గ్రీన్ ఎనర్జీ, ఏఐ, రక్షణ రంగంలో పెట్టుబడులకు సంబంధించిన అంశాలు సమావేశంలో చర్చకు వచ్చాయి. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అయినప్పటికీ చంద్రబాబు శిష్యుడు కావడం, మహారాష్ట్ర ముఖ్యమంత్రి కూటమి భాగస్వామ్యపక్షమైన బీజేపీ సీఎం కావడంతో ముగ్గురూ ఆప్యాయంగా పలుకరించుకున్నారు.

ప్రభుత్వ సంకల్పానికి సహకరించండి

(మొదటిపేజీ తరువాయి)

సీఈవో శ్రీధర్ పిన్నపురెడ్డి అన్నారు.

హెచ్‌సీఎల్ కొత్త టెక్ సెంటర్...

ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సీఎల్ హైదరాబాద్‌లో కొత్త టెక్ సెంటర్‌ను ప్రారంభించనుంది. దావోస్‌లో రేవంత్ రెడ్డి, మంత్రి డి.శ్రీధర్ బాబు, హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో, ఎండీ సి.విజయకుమార్‌తో చర్చలు జరిపారు. హెచ్‌సీఎల్ కొత్త సెంటర్‌లో లైఫ్ సైన్సెస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సేవలకు ప్రాధాన్యమిస్తుంది. అత్యాధునిక క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్‌లను అందిస్తుంది. హైటెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్ ఏర్పాటవుతుంది. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి గోల్డ్ సర్టిఫికేషన్ అందుకుంది. దాదాపు ఐదు వేల మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు లభిస్తాయి. ఈ కొత్త సెంటర్ మరింత అత్యాధునిక సామర్థ్యాన్ని అందుబాటులోకి తెస్తుందని విజయకుమార్ అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో ఐటీ హబ్ గా హైదరాబాద్ తన స్థానాన్ని మరోసారి పదిలం చేసుకుందని సీఎం అభిప్రాయపడ్డారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు ఐటీ పరిశ్రమను విస్తరించాలని హెచ్‌సీఎల్ టెక్ ప్రతినిధులను మంత్రి శ్రీధర్‌బాబు కోరారు.

ఘోర రైలు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

వ్యాపించినట్లు పుకార్లు రావడంతో కంగారు పడిన ప్రయాణికులు కొందరు తమ ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నంలో చైను లాగి రైల్లో నుంచి కిందకు దూకారు. అదే సమయంలో పక్కనే పట్టాలపైకి ఎదురుగా కర్నాటక ఎక్స్‌ప్రెస్ రావడంతో ఈ దుర్ఘటన జరిగింది' అని స్వప్నిల్ చెప్పారు. కర్నాటక ఎక్స్‌ప్రెస్ ఢీకొని 12 మంది చనిపోయారు. చాలా మంది గాయపడ్డారు కాబట్టి మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆయనన్నారు. బ్రేక్ జామింగ్ లేక యాక్సిల్ వేడెక్కడం వల్ల మంటలు వచ్చివుండవచ్చని రైల్వే సీనియర్ అధికారి చెప్పారు. కర్నాటక ఎక్స్‌ప్రెస్ వచ్చినప్పుడు దాదాపు 40 మంది పుష్పక్ ఎక్స్‌ప్రెస్‌లో నుంచి దిగినట్లు తెలిసిందన్నారు. క్షతగాత్రులు ఎక్కువగా ఉండటంతో మృతులు పెరగవచ్చన్నారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పోలీసులు, రైల్వే అధికారులు ఘటన స్థలానికి హుటాహుటిన చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. 11 మంది చనిపోయారని, ఆరుగురికి గాయాలయ్యాయని, ఎవరికి ప్రాణాపాయ పరిస్థితి లేదని జలగావ్ ఎస్పీ మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

కాగా, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని మహారాష్ట్ర మంత్రి గులాబ్రావ్ పాటిల్ తెలిపారు. రైలు ప్రమాదంలో గాయపడిన వారి కోసం జలగావ్ జనరల్ ఆసుపత్రి, సమీప ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏర్పాట్లు చేసినట్లు, ఎనిమిది అంబులెన్సులు పంపినట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నారు. దావోస్ పర్యటనలో ఉన్న ఆయన ఈ దుర్ఘటనపై 'ఎక్స్'లో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రి గరీశ్ మహారాజ్, ఎస్పీ, కలెక్టర్ ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితులను సమీక్షించినట్లు తెలిపారు. సహాయ చర్యలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. బాధిత కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం ప్రకటించారు.

క్షతగాత్రుల వైద్య ఖర్చులను మహారాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని దావోస్ నుంచి ఫడ్నవీస్ ప్రకటన చేశారు. కాగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

హైకోర్టు జడ్జీల నియామక ఉత్తర్వుల జారీ

(మొదటిపేజీ తరువాయి)

నియమితులయ్యారు. తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు న్యాయమూర్తులను ఎంపిక చేసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన నాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలో కొలీజియం ఇటీవల నూదిల్లీలో సమావేశమై వీరి పేర్లను సిఫార్సు చేసింది. వీరి నియమాకానికి సంబంధించి..బుధవారం రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఏపీ హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉండగా... ప్రస్తుతం 28 మంది న్యాయమూర్తులే ఉన్నారు. నూతన నియామకాలతో ఆ సంఖ్య 30కి చేరుతుంది. మరో ఏడుగురు న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాగా, ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తులుగా నియమితులైన జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ (కర్నూలు) ప్రస్తుతం ఏపీ జ్యుడీషియల్ అకాడమి డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

బీజేపీకి మణిపూర్ జేడీయూ ఝలక్

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటన విడుదల చేశారు. బీజేపీకి తమ మద్దతు ఉండదని, జేడీయూ ఏకైక ఎమ్మెల్యే అబ్దుల్ నాసిర్ ఇక నుంచి ప్రతిపక్షంలో కూర్చుంటారని తెలిపారు. ఈక్రమంలోనే రాజకీయంగా ఊహాగానాలు మొదలయ్యాయి. ఇప్పటికిప్పుడు మణిపూర్ ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేకపోయినప్పటికీ కేంద్రంతో పాటు బీహార్ లోనూ బీజేపీతో కలిసి నడుస్తున్న నితీశ్... ఇక్కడ తీసుకున్న నిర్ణయం ప్రభావం భవిష్యత్తులో ఉండొచ్చన్న అభిప్రాయం వ్యక్తమైంది. వాస్తవానికి మేఘాలయలో అధికారంలో ఉన్న కాన్రాడ్ సంగ్మా నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ పార్టీ ఇటీవల మణిపూర్ లోని బీరెన్ సింగ్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంది. ఇది జరిగిన నెల రోజులైంది. మణిపూర్‌లో 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూ ఆరు సీట్లు గెలుచుకుంది. ఇందులో ఐదుగురు ఇప్పటికే బీజేపీలోకి ఫిరాయించారు. అయినా ఇన్నాళ్లు మిగిలిన ఒక్క ఎమ్మెల్యే కూడా ప్రభుత్వానికి మద్దతుగా ఉన్నారు. 2022లో మణిపూర్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో జేడీయూ 6 సీట్లు గెలుచుకుంది. కానీ ఎన్నికలు జరిగిన కొన్ని నెలల తర్వాత ఐదుగురు ఎమ్మెల్యేలు బీజేపీలోకి ఫిరాయించారు. అప్పుడు జేడీయూ ఇండియా కూటమిలో ఉంది. కాగా పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై విచారణ స్పీకర్ ట్రిబ్యునల్ వద్ద పెండింగ్‌లో ఉంది. 60 మంది సభ్యుల మణిపూర్ అసెంబ్లీలో ప్రస్తుతం బీజేపీకి 37 మంది ఎమ్మెల్యేలు ఉండగా... నాగా పీపుల్స్ ఫ్రంట్‌కు చెందిన ఐదుగురు, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు కూడా మద్దతుగా ఉన్నారు. మొత్తంగా ఎన్డీయే ప్రభుత్వానికి 45 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది. దీంతో జెడీయూ మద్దతు ఉన్నా లేకపోయినా మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమీ లేదు. కానీ కేంద్రంలో బీజేపీకి జేడీయూ గట్టి మద్దతుదారుగా ఉంది. ఈ ఏడాది చివరిలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

ఈ ఎన్నికల్లో మళ్లీ అధికారం చేపట్టేందుకు సీఎం నితీశ్‌కుమార్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. దీంతో మణిపూర్‌లో మద్దతు ఉపసంహరణ విషయం రాజకీయవర్గాల్లో సంచలనంగా మారింది. ఈ క్రమంలో జేడీయూ అధిష్టానం వివరణ ఇచ్చుకుంది.

ఐదుగురు కామాంధులకు మరణ శిక్ష

(మొదటిపేజీ తరువాయి)

చట్టం, పిల్లలపై లైంగిక నేరాల నిరోధక చట్టం (పోక్సో)లోని నిబంధనల కింద మమతా భోజ్వానీ సంత్రామ్ మజ్వార్ (49), అబ్దుల్ జబ్బర్ (34), అనిల్ కుమార్ సారథి (24), పరదేశి రామ్ (39), ఆనంద్ రామ్ పనికా (29) లను దోషులుగా నిర్ధారించి, వారికి మరణశిక్ష విధించినట్లు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీల్ కుమార్ మిశ్రా బుధవారం తెలిపారు. మరో నిందితుడు ఉమా శంకర్ యాదవ్ (26)కు కోర్టు జీవిత ఖైదు విధించిందని ఆయన తెలిపారు. ఈ కేసులో న్యాయమూర్తి జనవరి 15న తీర్పు వెలువరిస్తూ... నిందితుల చర్య అమానవీయం, క్రూరమైన, వికృతమైన, హేయమైన చర్యగా కోర్టు పేర్కొంది. దోషులు జనవరి 29, 2021న బాలికపై అత్యాచారం చేసి, రాళ్లతో కొట్టి, ఆపై ఆమెను కోర్బా జిల్లాలోని లెమ్రు పోలీస్ స్టేషన్ పరిధిలోని గఢుప్రోడా గ్రామం సమీపంలోని అడవిలో పడవేశారు. బాలిక తండ్రి (సుమారు 60 ఏళ్లు), ఆమెతో ఉన్న అతని నాలుగేళ్ల మనవరాలిని కూడా చంపారు. కొన్ని రోజుల తర్వాత మృతుడి కుమారుడు లెమ్రు తమ వారు తప్పిపోయినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ సంఘటన వెలుగుచూసింది. ఆ తర్వాత ఈ కేసుపై విచారణ జరిపిన పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. బాధితురాలి కుటుంబాన్ని పశువుల్ని చూసుకునేందుకు నియమించుకున్న ప్రధాన నిందితుడు మంజ్‌వార్... బాలికను తన రెండవ భార్యగా చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడైనట్లు మిశ్రా చెప్పారు. బాలిక, బాలిక కుటుంబం దీనిని తీవ్రంగా వ్యతిరేకించడంతో మంజ్వార్, అతని ఐదుగురు సహచరులు కలిస ఆమెపై అత్యాచారం చేసి చంపారు. ఆమె ఇద్దరు కుటుంబ సభ్యులను కూడా హత్య చేశారని పోలీసులు తేల్చారు. బాధితులు పహాడీ కోర్వా గిరిజన సమాజానికి చెందినవారు. నిందితుల ఈ అమానవీయ , క్రూరమైన చర్య చాలా వికృతమైనది, హేయమైనదని కోర్టు తన తీర్పులో పేర్కొంది. వారు తమ కామాన్ని తీర్చుకోవడానికి ముగ్గురు అమాయక వ్యక్తులను చంపారు. ఇది యావత్ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని కోర్టు పేర్కొంది. నిందితులు బాలికపై అత్యాచారం చేసి చంపడంతో పాటు ఆమె ఇద్దరు కుటుంబ సభ్యులను కూడా చంపారని... అందువల్ల మరణశిక్ష విధించడం తప్ప వేరే మార్గం లేదని కోర్టు స్పష్టం చేసిందని మిశ్రా తెలిపారు.

సంజయ్ రాయ్‌కు మరణశిక్ష కోసం హైకోర్టుకు: సీబీఐ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతాలోని ఆర్జీ కార్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్‌కు సీల్దా కోర్టు విధించిన శిక్షపై సీబీఐ అప్పీల్‌కు వెళ్లనుంది. విధుల్లో ఉన్న వైద్యురాలిపై పాశవికంగా దాడికి పాల్పడిన ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పుపై కలకత్తా హైకోర్టులో అప్పీల్ చేసేందుకు సిద్ధమైంది. ఈ కేసు అత్యంత అరుదైన నేరం కేటగిరీలోకి వస్తుందని, మరణశిక్షకు అర్హమైనదేనంటూ సీబీఐకి న్యాయసలహా అందడంతో... దోషికి మరణదండన విధించాలని హైకోర్టును కోరనుంది. కింది కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ సవివరమైన వాదనలతో శుక్రవారం నాటికి అప్పీల్ దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు సీబీఐ అధికారులు పేర్కొన్నారు.

సమాజంలో సమతుల్యం కోసం పాత్రికేయులు పాటుపడాలి : ఎస్పీ

విశాలాంధ్ర – కొత్తగూడెం క్రైమ్ : ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండే మీడియాలో పనిచేసే పాత్రికేయులు నిజాయితీగా ఉండి సమాజ సమతుల్యం కోసం పాటుపడాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు కోరారు. విశాలాంధ్ర – 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను బుధవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ నేటి సమాజంలో అనేక ప్రజా సమస్యలు నెలకొన్నాయని వాటిని పరిష్కారం కోసం నిబద్ధతగల జర్నలిజంతో ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. విశాలాంధ్ర జాతీయ పత్రిక ప్రజల పక్షం నిలిచి స్పష్టమైన నియమాలు, ఆశయాలతో ఏడున్నర దశాబ్దాల నుంచి అప్రతిహతంగా మనుగడ సాగించటం సామాన్య విషయం కాదన్నారు. విశాలాంధ్ర కథనాలు, పత్రిక ఆశయాల పరంపరపై, నిర్వహణ అంశాలపై చర్చించారు. సమాజంలో మీడియా పాత్రను ఎస్పీ కొనియాడారు. తమ వృత్తి పట్ల నిజాయితీగా బాధ్యతగా ఉండే జర్నలిస్టుల పట్ల ప్రజల్లో ఎప్పటికి గౌరవం ఉంటుందన్నారు. పాత్రికేయులు ప్రతి సమస్యను ఆవేశంతో లేదా తొందర పాటుతో కాకుండా సంయమనం పాటించి వాస్తవాలను నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకురావాలన్నారు. పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా విశాలాంధ్ర జిల్లా బ్యూరో ఇన్చార్జి ఎంఏ. వాహెద్ ను ఎస్పీ రోహిత్ రాజు అడిగి తెలుసుకున్నారు. చాలా ఓపికగా అనేక అంశాలపై ఆయన చర్చించారు. నిజాయితీగా ప్రజల పక్షం నిలిచే పాత్రికేయుల కోసం తమ వంతు సహకారాలు అందిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. పోలీస్ అధికారులు, పిఆర్ ఓ శ్రీనివాస్, పాత్రికేయులు ఎం ఏ. వాహెద్, దాదాజీ, ఎండి ఖాజా హుస్సేన్, ఎండి. ఆసిఫ్‌లు పాల్గొన్నారు.

క్యాన్సర్ పేషంట్‌కి ఎల్‌ఓసి అందజేత

విశాలాంధ్ర – కారేపల్లి : సింగరేణి మండల పరిధిలోని కమలాపురం గ్రామానికి చెందిన పెరంపల్లి వెంకయ్య గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. కుటుంబ సభ్యులు ఎంపీ రఘురాంరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన ఎంపీ ప్రభుత్వం నుండి రెండు లక్షల 50 వేల రూపాయలు ఎల్‌వోసిని మంజూరు చేయించారు. బుధవారం ఖమ్మంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎంపీ రఘురాం రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లెల నాగేశ్వరావు, గుగులోత్ శ్రీను, దేగల ఉపేందర్, తోగర శ్రీను, క్యాంప్ కార్యాలయం భాధ్యులు కొప్పెర చంద్రశేఖర్, పిఏ లక్ష్మణ్ ఉన్నారు.

సింగరేణిలో నకిలీ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికేట్ల దందా

విశాలాంధ్ర – కొత్తగూడెం : సింగరేణి సంస్థలో నకిలీ సర్టిఫికెట్ల దందా కొనసాగుతున్నట్లు ఒక ఉదంతం బయటపడింది. దీంతో అప్రమత్తమైన కొత్తగూడెం ఏరియా జీఎం బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్తగూడెం ఏరియాలోని పద్మావతి ఖని పరిధిలో నకిలీ ఎక్స్పీరియన్స్ సర్టిఫికేట్ పొందినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీని పై పూర్తి స్థాయిలో విచారణ జరుపగా అది నకిలీ సర్టిఫికేట్ అని నిర్ధారణ అయిందన్నారు. ఈ సర్టిఫికెట్లు మైనింగ్ డిగ్రీ, డిప్లొమా అభ్యర్థులు స్టాట్యూటరీ పరీక్షల సర్టిఫికేట్లు పొందేందుకు ఈ నకిలీలను ఉపయోగిస్తున్నట్లు జియం చెప్పారు. పద్మావతి ఖని పివికె–5 ఇంక్లైన్ గని మేనేజర్ పేరు, ఆఫీసు సీలు, స్టాంప్‌తోపాటు మేనేజర్ ఫోర్జరీ సంతకంతో ఒక నకిలీ సర్టిఫికెట్ను గుర్తించామన్నారు. కాలేజీలో చదివే విద్యార్థుల అవసరాన్ని పసిగట్టి కొంతమంది బ్రోకర్లు ఈ నకిలీ సర్టిఫికెట్ల దందాకు తెరలేపినట్లుగా తెలుస్తోందన్నారు. ఈ విషయంపై కొత్తగూడెం టు టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయటం జరిగినదని జియం తెలిపారు.

సమస్యలను వెలికితీయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

విశాలాంధ్ర బ్యూరో – కొమరం భీం : సమస్యలను వెలికితీయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా డిపిఆర్ఓ సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా సముకృత కలెక్టరేట్‌లో 2025 నూతన సంవత్సర విశాలాంధ్ర క్యాలెండర్, డైరీలను డిపిఆర్ఓ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న జర్నలిస్టులను అభినందించారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ తమ సమస్యలను పక్కనపెట్టి ప్రజా సమస్యలపై పోరాడడం గర్వించదగ్గ విషయం అన్నారు. స్వాతంత్ర్యం సిద్దించాక విశాలాంధ్ర దినపత్రిక ప్రారంభించి నేటి వరకు ప్రజల అభిమానాలను పొందుతూ మంచి కథనాలతో అందరికీ పత్రిక అందుబాటులో ఉండడం గొప్ప విషయమన్నారు. సమాజంలో అవినీతిని రూపుమాపేందుకు జర్నలిస్టులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఈర్ల సతీష్, సిర్పూర్ నియోజకవర్గ ఇన్చార్జి కనుకుట్ల శ్రీనివాస్, పాత్రికేయులు బుచ్చిబాబు, ప్రేమ్, ఏ.ఐ.వై.ఎఫ్ ప్రధాన కార్యదర్శి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో – మెదక్ : మనిషి ప్రాణం చాలా విలువైందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. రోడ్డు భద్రత అందరి సమిష్టి బాధ్యత అన్నారు. బుధవారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో మెదక్ పట్టణం జూనియర్ కళాశాల నుండి రాందాస్ చౌరస్తా వరకు వివిధ పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించగా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలన్నారు. మోటార్ సైకిల్ మీద ప్రయాణించే ప్రతి ఒక్కరు తప్పకుండ హెల్మెట్‌ను ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, ఓవర్ స్పీడింగ్, ఓవర్ టేకింగ్ చెయ్యరాదనిచెప్పారు. రోడ్ భద్రత నియమాలు ట్రాఫిక్ సిగ్నల్స్ గురించి వివిధ పాఠ్యాంశంగా చేర్చారని చెప్పారు. జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్. వెంకటస్వామి, ఆర్ అండ్ బి ఈఈ సర్దార్ సింగ్, డీఎస్పీ ప్రసన్నకుమార్, ఇన్స్పెక్టర్ నాగరాజు, ఎంవీఐ విజయలక్ష్మి, ఎం.ఈ.ఓ నీలకంఠం, ఎఎంవీఐలు శ్రీలేఖ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇల్లందు పురపాలకను అభివృద్ధి చేస్తాం : మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర – ఇల్లందు : రాష్ట్రంలోనే ఇల్లందు పురపాలక సంఘాన్ని ఇంకా అభివృద్ధి చేసి శిఖరాగ్రాన నిలిచేలా చేస్తానని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్థానిక ప్రజలకు భరోసా ఇచ్చారు. బుధవారం ఇల్లందు పట్టణంలో రూ. 40 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి మంత్రి పొంగులేటి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గం చివరి కౌన్సిల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఐదేళ్ల కాలంలో ఇల్లందు మున్సిపల్ పాలకవర్గం ఇల్లందు ప్రజలకు ఎనలేని సేవలు చేయడం జరిగిందని కొనియాడారు. అదేవిధంగా మూడుసార్లు రాష్ట్రస్థాయిలో, రెండుసార్లు జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డులు పొందడం పాలకవర్గం చేసిన కృషికి నిదర్శనాలని మంత్రి అభినందించారు. ఏ మున్సిపాలిటీలో 16 మంది మహిళా కౌన్సిలర్ అయినప్పటికీ నిత్యం వార్డుల్లో ఉండే సమస్యలపై పోరాటం చేసి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేశారన్నారు. ప్రస్తుత పాలకవర్గం వచ్చే ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులతో తిరిగి తమ స్థానాల్లో ప్రజల ఆశీస్సులతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేసారు. చివరి కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు చెప్పిన ప్రతి సమస్యను, పట్టణంలో మధ్యలో నిలిచిన అభివృద్ధి పనులను నూటికి నూరు శాతం కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. పట్టణంలోని 24 వార్డులలో కౌన్సిల్ సభ్యుల అభ్యర్థుల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు జిల్లా ఎస్పీ, కలెక్టర్ చొరవ తీసుకోవాలన్నారు. సింగరేణి ప్రాంతమైన ఇల్లెందులో మరో 76 జీవోను తీసుకొచ్చి ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తామన్నారు. అనంతరం ఐదేళ్లపాటు ప్రజలకు సేవలు అందించిన పాలకవర్గాన్ని శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పిజిఐడిసి చైర్మన్ మువ్వ విజయ్ బాబు, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్, పిఓ రాహుల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, డిఎఫ్ఓ

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో – కొత్తగూడెం : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల అమలులో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభల రెండవ రోజు బుధవారం కలెక్టర్ లక్ష్మీదేవి పల్లి మండలం అనిశెట్టిపల్లి గ్రామసభలో పాల్గొన్నారు. గ్రామసభ తీరు, దరఖాస్తు ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామ సభలో మండల ప్రత్యేక అధికారి, సెక్రటరీ నాలుగు సంక్షేమ పథకాల అర్హుల జాబితాను సభకు చదివి వినిపించారు. అర్హుల జాబితాలో వచ్చిన అభ్యంతరాలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు గ్రామీణాభివృద్ధికి దోహదపడతాయన్నారు. ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఈ గ్రామ సభలు ఎంతో పారదర్శకంగా ఉంటాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అర్హులకు జాబితాలో పేరు రానివారు ఆందోళన చేయాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ సభలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పీవీ చలపతిరావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సబ్బండ జాతికి అండగా సీపీఐ జెండా

విశాలాంధ్ర (మహబూబాబాద్) తొర్రూర్: సబ్బండ జాతికి సిపిఐ జెండా అండగా నిలిచి, హక్కుల సాధనకొరకు పోరాడి సాధించిన ఏకైక పార్టీ సిపిఐ పార్టీని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి అన్నారు. గురువారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని స్థానిక విశ్రాంతి భవనంలో ఏర్పాటుచేసిన సిపిఐ మండల ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్యఅతిథిలుగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయ సారధి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు తమ్మెర శ్వేశ్వరరావులు పాల్గొని మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ పోరాట నేత తీగల సత్యనారాయణరావు మాజీ ఎమ్మెల్యే విగ్రహావిష్కరణ సిపిఐ ఆఫీస్ జంక్షన్ మూడు కోట్ల సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, మహబూబాద్ ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రనాయక్, ఎంపీ బలరాం నాయక్ పాల్గొననున్నారన్నారు. అమరజీవి వీర తెలంగాణ సాయుధ పోరాట యోధులు తీగల సత్యనారాయణరావు వరంగల్ జిల్లా మహబూబాద్ తాలూకాలో జన్మించి ఉస్మానియా యూనివర్సిటీలో నాగపూర్ యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించి ఎల్.ఎల్.బి పట్టా పొందారని, మానుకోటలో న్యాయవాది వృత్తిని చేపట్టి ఆనాటి భూస్వాములు పేదరైతుల్ని ఇబ్బందులకు గురి చేసే వారు భూమిని ఆక్రమిస్తున్న రుణంలో వారి పక్షాన నిలబడి ఉచితంగా కేసులు వాదించి న్యాయం చేస్తూ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం తాలూకా ఆర్గనైజర్‌గా పని చేస్తూ మహబూబాద్ తాలూకాలో భూస్వాములకు వ్యతిరేకంగా నిలబడి, రావి నారాయణరెడ్డి, ముద్దు మోహిని, బద్దం ఎల్లారెడ్డి పిలుపునందుకొని సెప్టెంబర్ 11న ఈ తాలూకా దళాలను నిర్మించి భూసాములను రజాకాలను తరిమి కొట్టడంలో కీలకపాత్ర పోషించారన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఓమ బిక్షపతి, సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన కిరణ్ కుమార్,బూరుగు యాదగిరి, మందపురి శ్యామ్, ముద్రబోయిన వెంకన్న, గణపురం లక్ష్మణ్, గూడేలి ఎల్లయ్య, సైరెట్ నరసింహా రెడ్డి, యాకయ్య, చంద్రయ్య, మల్లయ్య, వెంకన్న, సైదులు, అనీలు పాల్గొన్నారు.

పేదలందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు

విశాలాంధ్ర – నేరేడుచర్ల : అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పదో వార్డు కౌన్సిలర్ నూకల సుగుణమ్మ అధ్యక్షతన జరిగిన ప్రజాపాలన, వార్డు సభలు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారంటీలు అమలు కార్యక్రమాల భాగంగా పదో వార్డులో అర్హులైన రేషన్ కార్డుదారులు, ఇందిరమ్మ ఇండ్లకు అర్హులు ఇండ్ల స్థలం లేని వారి జాబితా ప్రకటించినప్పటికీ, అర్హులై ఉండి జాబితాలో పేరు లేని వారు మరల వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 26 నుండి రైతు భరోసా మొదలవుతుందన్నారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో నేరేడుచర్ల మున్సిపాలిటీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొనతం చిన్న వెంకటరెడ్డి, నూకల సందీప్ రెడ్డి, ఎస్సై రవీందర్, తాళ్ల సురేష్ రెడ్డి, కమిషనర్ ఏ అశోక్ రెడ్డి, మచ్చ శ్రీను, నాగండ్ల శ్రీధర్, ధూళిపాల ధనుంజయ నాయుడు, సట్టు శ్రీను, చిలక రాజు శ్రీను పాల్గొన్నారు.

ఎప్పుడైనా దరఖాస్తులు సమర్పించవచ్చు : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి–పెద్దపల్లి,సింగరేణి : అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ పథకాలు అమలు అవుతాయని, ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలు ఎప్పుడైనా దరఖాస్తులు సమర్పించవచ్చు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.

బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష పాలకుర్తి మండల కేంద్రం, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 38వ డివిజన్ (సంజయ్ గాంధీనగర్)లోని నూతన ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై నిర్వహించిన గ్రామ, వార్డు సభలలో పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, ప్రస్తుతం తయారు చేసిన జాబితా ప్రాథమిక జాబితా మాత్రమేనని, ఇందులో మార్పులు చేర్పులు ఉంటాయని, ప్రాథమికంగా ప్రకటించిన జాబితాలో ఒకటి రెండు మిస్ అయినా ఎటువంటి ఆందోళన అవసరం లేదని, దరఖాస్తు అందిస్తే వారం పది రోజులలో వాటిని విచారించి పథకాల లబ్ధి చేకూరుస్తామన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ, పాలకుర్తి తాహసిల్దార్ జ్యోతి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ విలువలను కాపాడుతున్న యూనియన్ టీయూడబ్ల్యూజే : ఎస్పీ

విశాలాంధ్ర – కొత్తగూడెం క్రైమ్ : జర్నలిస్టు విలువలను కాపాడుతున్న యూనియన్‌గా టీయూడబ్ల్యూజే (ఐజేయు) మరింత ముందుకు సాగాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఐజేయు డైరీని ఆవిష్కరించారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై టియుడబ్ల్యూ జే ఐజేయు యూనియన్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. జర్నలిస్టు విలువలను కాపాడేందుకు మరింత చైతన్యవంతమైన కార్యక్రమాలను సామాజిక బాధ్యతగా నిర్వహిస్తున్న ఈ యూనియన్ బృందాన్ని అభినందించారు. జిల్లాలోని జర్నలిస్టులకు సంబంధించి లా అండ్ ఆర్డర్ సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ ఎర్ర ఈశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏర్పుల సుధాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బి. శంకర్, దశరథ రజువా పాల్గొన్నారు.

అర్హతలున్నా జాబితాల్లో పేర్లు గల్లంతు

విశాలాంధ్ర – ముదిగొండ : ఇందిరమ్మ గ్రామసభల్లో అధికారులపై లబ్ధిదారుల నిరసనలతో రభస చలరేగింది. మండల పరిధిలోని పండ్రేగుపల్లి, వెంకటాపురం, ముత్తారం, గోకినేపల్లి, న్యూలక్ష్మీపురం గ్రామపంచాయతీలలో మంగళవారం, బుధవారం నిర్వహించిన గ్రామసభలో పెద్దఎత్తున రభస చోటుచేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకం గురించి క్షేత్రస్థాయిలో విచారణ జరపడానికి మండలం పరిధిలో గ్రామాలలో ఏర్పాటు చేసిన గ్రామసభ రసాభాసగా మారాయి. గ్రామసభలో, ఆయా పథకాల లబ్ధిదారుల జాబితా ప్రకటించిన తర్వాత అన్ని అర్హతలు ఉన్న తమకు ఆ జాబితాలో చోటు దక్కలేదని తమ అన్యాయం జరిగిపోయింది అంటూ అనేకమంది గ్రామస్తులు అధికారులను నిలదీసి నిరసనలు వ్యక్తం చేయటం కొన్నిచోట్ల బాహాబాహికి దిగడం వంటివి చోటుచేసుకుంటున్నాయి. అసలైన అర్హులను పక్కనబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సర్వేను సరైన విధంగా నిర్వహించలేదని, గ్రామంలో చాలా మంది ఇళ్లులేక అవస్థలు పడుతున్నారని ప్రజలు నిలదీశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇండ్లు, రేషన్ కార్డులు, జాబితాల్లో తమ పేర్లు లేకపోవడంతో గ్రామస్థులు అధికారులను నిలదీస్తున్నారు. పలువురు లబ్ధిదారులు గ్రామ సభలో ఉన్న అధికారులతో మాట్లాడుతుండగా ,వారు ఆ సమయంలో అక్కడి నుంచి వెళ్లిపోవడంపై గ్రామ ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలతో మాట్లాడే అంత ఓపిక అధికారులకు లేకపోతే గ్రామసభ ఎందుకు ఏర్పాటు చేశారని మీడియా ముందు వాపోయారు.

ఆన్‌లైన్ లాట్టో టికెట్ పంపిణీలో స్పేస్‌మంత్ర సొల్యూషన్స్ భాగస్వామ్యం

విశాలాంధ్ర – హైదరాబాద్: ఎమ్ ఓ ఎస్ యుటిలిటీ లిమిటెడ్ దాని అనుబంధ సంస్థ ఎమ్ ఓ ఎస్ లాగ్ కనెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా, రితి స్పోర్ట్స్ గ్రూప్ అనుబంధ సంస్థ అయిన స్పేస్‌మంత్ర సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో సేవా ఒప్పందాన్ని అధికారికంగా సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. ఈ ఆవిష్కరణ 2023లో జాబితా చేయబడిన వేగంగా అభివృద్ధి చెందుతున్న ఫిన్‌టెక్ కంపెనీ అయిన ఎమ్ ఓ ఎస్ యుటిలిటీ లిమిటెడ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించిందన్నారు. ఈ ఒప్పందం భారతదేశం అంతటా ఆన్‌లైన్ లాట్టో టిక్కెట్ల మార్కెటింగ్ మరియు అమ్మకాలను నడిపించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ ఒప్పందం ప్రకారం, ఎమ్ ఓ ఎస్ లాట్ కనెక్ట్ ఆన్‌లైన్ లాట్టో టిక్కెట్ల అమ్మకానికి మాస్టర్ మార్కెటింగ్ ఏజెంట్‌గా వ్యవహరిస్తుందన్నారు. ఈ ప్రాజెక్ట్ 'డిజిటల్ ఇండియా' దార్శనికతకు అనుగుణంగా ఉంటుందన్నారు. పట్టణ గ్రామీణ ప్రాంతాలలో పారదర్శకతను ప్రోత్సహిస్తుందని, ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుందన్నారు.

నైపుణ్యం గల అధ్యాపకులతోనే అత్యుత్తమ ఫలితాలు

హైదరాబాద్: నైపుణ్యం గల అధ్యాపకులతోనే అత్యుత్తమ ఫలితాలు సాధ్యమని, హంగూ, ఆర్భాటంతో కూడిన సౌకర్యాలతో కాదని మాస్టర్ మైండ్స్ సహా వ్యవస్థాపకుడు సీఏ మోహన్ మట్టుపల్లి తెలిపారు. ఇటీవల 'బ్యాక్‌బెంచింగ్ విత్ వివేక్' యూట్యూబ్ చానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. మాస్టర్ మైండ్స్ విద్యార్థి సీఏ ఫైనల్స్‌లో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించారన్నారు. టాప్ ర్యాంక్స్ ఫ్యాన్సీ బిల్డింగ్స్ నుంచి రావని, అసాధారణమైన ఉపాధ్యాయుల నుంచి వస్తాయని తెలిపారు. మాస్టర్ మైండ్స్ ప్రముఖ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌గా.. ప్రతి సంవత్సరం వేలాది మంది సీఏ/సీఎంఏ అభ్యర్థుల కలలను సాకారం చేస్తుందన్నారు.

23న 'అడ్వాంటేజ్ అస్సాం 2.0' రోడ్డు షో

హైదరాబాద్: అస్సాం గువాహటిలో ఫిబ్రవరి 25, 26వ తేదీలలో 'అడ్వాంటేజ్ అస్సాం 2.0' పేరుతో జరగనున్న పెట్టుబడులు, మౌలిక సదుపాయాల సదస్సుకు పెట్టుబడిదారులను సమాయత్తం చేసేందుకు హైదరాబాద్‌లో ఈనెల 23వ తేదీన రోడ్డు షో నిర్వహించనున్నారు. ఈ రోడ్డు షో ఈవెంట్ హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో జరగనుంది. ఈ ఈవెంట్‌కు అస్సాం ప్రభుత్వ విద్య, ట్రైబ్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ రనోజ్ పెగు, అస్సాం ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి బీ కల్యాణ్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి కేఎస్ గోపీనాథ్ నారాయణన్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ కమిషనర్ ఓఇనం ఎస్ సింగ్ హాజరుకానున్నారు. అస్సాం సామర్థ్యంపై జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెద్దఎత్తున పెట్టుబడుల ఆకర్షణకు ఆసక్తి వ్యక్తమవుతుంది.

ఐఐసి స్టార్ రేటింగ్స్‌లో కేఎల్‌హెచ్, కేఎల్ క్యాంపస్‌లు

న్యూఢిల్లీ: విద్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మినిస్ట్రీ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఎంఐసీ) 2023–24కి సంబంధించి ప్రకటించిన తాజా ఐఐసీ (ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్) పనితీరు రేటింగ్స్‌లో కేఎల్‌హెచ్ మరియు కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్శిటీ క్యాంపస్‌లు మరోసారి అద్భుతమైన ప్రదర్శనలను కనబరిచాయి. హైదరాబాద్‌లోని కేఎల్‌హెచ్ అజీజ్‌నగర్ క్యాంపస్ 3.5–స్టార్ రేటింగ్‌ను సాధించింది, ఇది ఆవిష్కరణ, వ్యవస్థాపకతను పెంపొందించడంలో దాని నిరంతర నిబద్ధతను నొక్కి చెబుతుంది. సృజనాత్మక, వినూత్న ప్రయత్నాల కోసం శక్తివంతమైన పర్యావరణ వ్యవస్థను కొనసాగిస్తూ, కేఎల్‌హెచ్ అత్యధిక రేటింగ్‌లలో ఈ ఘనత వరుసగా రెండవ సంవత్సరం సాధించింది. కేఎల్‌హెచ్ ఇంక్యుబేషన్ సెంటర్, ఫ్యాకల్టీ సభ్యులతో కలిసి, విద్యార్థులలో వ్యవస్థాపక ఆలోచనా స్ఫూర్తిని పెంపొందిస్తుంది, ఆలోచన నుండి స్టార్టప్ వరకు ఆవిష్కరణలకు మార్గనిర్దేశం చేస్తుంది.

యాక్సిస్ మ్యుచువల్ ఇండెక్స్ ఫండ్ ఆవిష్కరణ

ముంబై: భారత్‌లో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఫండ్ హౌస్‌లలో ఒకటైన యాక్సిస్ మ్యుచువల్ ఫండ్ సంస్థ, నిఫ్టీ500 మొమెంటం 50 టీఆర్ఐని ట్రాక్ చేసే యాక్సిస్ నిఫ్టీ500 మొమెంటం 50 ఇండెక్స్ ఫండ్ పేరిట ఓపెన్ ఎండెడ్ ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో) 2025 జనవరి 24న ప్రారంభమై ఫిబ్రవరి 7 వరకు అందుబాటులో ఉంటుంది. నిఫ్టీ500 మొమెంటం 50 టీఆర్ఐ ఈ ఫండ్‌కి ప్రామాణికంగా ఉంటుంది. మరింత సరళతరంగా, తక్కువ వ్యయాలతో కూడుకున్న సాధనం ద్వారా, వృద్ధి గతిలో ఉన్న స్టాక్స్ అందించే ప్రయోజనాలను పొందేందుకు, దేశీయంగా పెట్టుబడులకు సంబంధించి ప్యాసివ్ వ్యూహాలపై భారతీయ ఇన్వెస్టర్లలో పెరుగుతున్న ఆసక్తిని ఈ కొత్త ఫండ్ ప్రతిబింబిస్తుంది. ఖర్చులు తీసివేయడానికి ముందు, ట్రాకింగ్ ఎర్రర్‌కి లోబడి, నిఫ్టీ500 మొమెంటం 50టీఆర్ఐకి అనుగుణమైన రాబడులను అందించాలనేది ఈ స్కీము లక్ష్యం. అయితే, స్కీము పెట్టుబడి లక్ష్యం నెరవేరుతుందనే నిర్దిష్ట హామీ ఉండదు.

ఇకపై ఐఫోన్‌పై ట్రూకాలర్

బెంగళూరు: ప్రముఖ ప్రపంచవ్యాప్త కమ్యూనికేషన్స్ ప్లాట్ఫార్మ్, ట్రూకాలర్, ఇప్పుడు ఐఫోన్ కోసం అతిపెద్ద అప్డేట్‌ను అందించింది. ఈ కొత్త అప్డేట్ ప్రతిచోట ట్రూకాలర్ స్పామ్, స్కామ్ బ్లాకింగ్ సామర్థ్యాలను ఐఫోన్ యూజర్స్‌కు అందిస్తుంది. ఇది ఇప్పుడు తన ఆండ్రాయిడ్ ప్రత్యర్థితో సమానంగా అన్ని రకాల కాల్స్‌ను గుర్తించే సామర్థ్యం కలిగి ఉంది. ఇది గోప్యత–పరిరక్షణ విధానంలో లైవ్ కాలర్ ఐడీని అందించుటకు ట్రూకాలర్ వంటి యాప్స్ కోసం అభివృద్ధి చేయబడిన ఆపిల్ లైవ్ కాలర్ ఐడీ లుక్ అప్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా సాధ్యపడింది. ఈ ఏపీఐ స్టేట్–ఆఫ్–ది–ఆర్ట్ హెూమోమార్ఫిక్ ఎన్‌క్రిప్షన్ ఉపయోగిస్తుంది. ట్రూకాలర్ కాలర్ ఐడీ కోసం స్కేల్‌లో వినియోగించడం ప్రపంచములోనే ఇది మొట్టమొదటిది. ఒక శక్తివంతమైన ట్రూకాలర్ అనుభవం ఇప్పుడు ఐఫోన్‌పై ట్రూకాలర్ 15 సంవత్సరాలుగా అవాంఛనీయ కమ్యూనికేషన్ ఫిల్టర్ చేసే వ్యాపారంలో ఉంది.

దుబాయ్‌లో ఔట్ డోర్ సాహసాలు

ముంబయి: దుబాయ్ ఆకర్షణ నగర గోడలకు మించి విస్తరించి ఉంది, పర్వతాలు, మడ అడవులు, ఎడారి, స్థానిక వన్యప్రాణులు, తీరప్రాంతం అతి సమీపంలో ఇక్కడ ఉంటాయి. అద్భుతమైన ఔట్ డోర్ సాహసాల భారీ శ్రేణిని ఇక్కడ కనుగొనవచ్చు. ముందుగా దుబాయ్ ఎడారి అంతులేని అవకాశాలకు నిలయం. దుబాయ్ ఎడారి నిజమైన ఈక్వెస్ట్రియన్ అనుభవాన్ని అందిస్తుంది. ఇక్కడ రైడర్లు దిబ్బల మధ్య ప్రయాణించవచ్చు. దుబాయ్ డౌన్‌టౌన్ నుండి కేవలం 90 నిమిషాల డ్రైవ్ దూరంలో ఉన్న హట్టా – గంభీరమైన హజార్ పర్వతాల మధ్య ఉంది. 700 కిలోమీటర్లు విస్తరించి, యుఎఇని ఒమన్ నుండి వేరు చేస్తుంది. ప్రకృతి ప్రేమికులకు ఒక ప్రసిద్ధ గమ్యస్థానం ఎమిరేట్. 67 జాతులకు చెందిన 20,000 కంటే ఎక్కువ నీటి పక్షులు ఇక్కడ ఉన్నాయి. ప్రశాంతమైన అల్ ఖుద్రా సరస్సుల వద్ద నగరం నుండి చాలా దూరం వెళ్లకుండా క్యాంపింగ్ ఆనందాలను అనుభవించవచ్చు.

క్రెడిట్ లైఫ్ ఇన్సూరెన్స్ అందించనున్న పీఎన్‌బీ మెట్‌లైఫ్, ట్రూహెూమ్ ఫైనాన్స్

హైదరాబాద్: ట్రూహెూమ్ ఫైనాన్స్ హెూమ్ లోన్ కస్టమర్లకుగ్రూప్ క్రెడిట్ లైఫ్ ఇన్సూరెన్స్ అందించేందుకు ట్రూహెూమ్ ఫైనాన్స్ (గతంలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)తో పీఎన్‌బీ మెట్‌లైఫ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (పీఎన్‌బీ మెట్‌లైఫ్) భాగస్వామ్యం ఏర్పరుచుకుంటోంది. ఈ సందర్భంగా పీఎన్‌బీ మెట్‌లైఫ్ సంస్థ ఎండీ అండ్ సీఈఓ సమీర్ బన్సల్ మాట్లాడుతూ, ఈ భాగస్వామ్యం జీవితంలోని ప్రతి దశలోనూ భారతీయులకు విశ్వసనీయ భాగస్వామిగా ఉండాలనే పీఎన్‌బీ మెట్‌లైఫ్ నిబద్ధతను బలోపేతం చేస్తుందని, కస్టమర్లు తమ సొంతింటి కలను సురక్షితంగా ఉంచుకోవడానికి అలాగే, దేశవ్యాప్తంగా ఆర్థిక సమ్మేళనాన్ని పెంపొందించడానికి సహాయపడుతుందన్నారు. ఇండియా అంతటా కుటుంబాలకు సమగ్ర ఆర్థిక రక్షణ కల్పించాలనే తమ ప్రయాణంలో ట్రూ హెూమ్ ఫైనాన్స్‌తో తమ భాగస్వామ్యం ఒక సముచితమైన ముందుడుగు అన్నారు.

హోమ్ 2025 పోకడలు మారనున్నాయా?

ముంబయి: కృత్రిమ మేధస్సు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్, స్థిరత్వంలో పురోగతులు వచ్చిన నేపథ్యంలో గృహావసరాలకు సంబంధించి 2025లో సరికొత్త పోకడలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా పెరుగుతున్న పర్యావరణ ఆందోళనలు, ఆరోగ్యం, పరిశుభ్రతపై పెరిగిన అవగాహనపై ఆధారపడిన ఎయిర్ ప్యూరిఫైయర్, స్మార్ట్ క్లీనింగ్ పరికరాల మార్కెట్లు ఈ పరిణామంలో ముందంజలో ఉన్నాయి. ఎయిర్ ప్యూరిఫైయర్‌ల నుంచి వాక్యూమ్ క్లీనర్‌ల వరకు, డైసన్ ఇంజనీర్ సచిన్ చివాటే పేర్కొన్న విధంగా, ఈ వినూత్న సాధనాలు 2025లో అవసరమైనవిగా మారనున్నాయి. ఇందులో భాగంగా డైసన్ ప్యూరిఫైయర్ కూల్ ఫార్మాల్డిహైడ్ వంటి ఫార్మాల్డిహైడ్–నాశనం చేసే ప్యూరిఫైయర్‌తో జత చేయబడిన డైసన్ వాష్‌జి 1 వంటి సెల్ఫ్– క్లీనింగ్‌ను వాక్యూమ్‌ను ఊహించుకోవచ్చు. అలాగే, డైసన్ ప్యూరిఫైయర్ బిగ్‌క్వైట్ పూర్తి శక్తితో 56 డెసిబెల్స్ శబ్దాన్ని మాత్రమే ఉత్పత్తి చేస్తుంది. కనుక, ఈ ప్యూరిఫైయర్ నిశ్శబ్దంగా పని చేయడంలో కొత్త ప్రమాణాన్ని నెలకొల్పుతుంది. అదే విధంగా, హెపా ఫిల్టర్లు గాలి శుద్ధీకరణకు మూలస్తంభంగా ఉన్నప్పటికీ, పలు–దశల వడపోతలో పురోగతి ప్రధాన స్రవంతిలోకి వస్తుంది. ఇది బ్యాక్టీరియా, వైరస్‌లతో సహా విస్తృత శ్రేణి కాలుష్య కారకాలను లక్ష్యంగా చేసుకునేందుకు వీలు కల్పిస్తుంది.

5 బజాజ్ వాటర్ హీటర్‌లతో విద్యుత్తు ఆదా

బెంగళూరు: బజాజ్ ఎనర్జీ–ఎఫిషియెంట్ వాటర్ హీటర్ల శ్రేణి విద్యుత్ బిల్లులను నియంత్రించబోతున్నది. బజాజ్ వాటర్ హీటర్‌లు స్థిరమైన సౌకర్యాన్ని అందిస్తాయి. అదే సమయంలో మీకు విద్యుత్తును ఆదా చేయడంలో సహాయపడతాయి. పెంటకిల్ డిజి దాని డిజిటల్ ఉష్ణోగ్రత నియంత్రణతో వెలుపల మాత్రమే కాకుండా, ఇది లోపల కూడా స్మార్ట్‌గా ఉండేలా తయారు చేశారు. దీని ముఖ్య లక్షణాలు డ్యూరా ఏస్‌ట్యాంక్, సముద్ర–గ్రేడ్ గ్లాస్–లైన్ కోటింగ్‌తో దృఢంగా, తుప్పుకు వ్యతిరేకంగా బలంగా నిలబడి, ఏళ్ల తరబడి విశ్వసనీయమైన పనితీరును నిర్ధారిస్తుంది. డ్యూరా కోట్ నాన్–స్టిక్ హీటింగ్ ఎలిమెంట్ నీటిని సమర్థవంతంగా వేడి చేస్తుంది. అలాగే, బజాజ్ కాంటెంపో అనేది స్టైలిష్, సమర్థవంతమైన వాటర్ హీటర్. ఇది శాశ్వత పనితీరుతో, భద్రత కోసం ఫీచర్లతో నిండి ఉంది. లోపల, ఇది మెరైన్–గ్రేడ్ గ్లాస్–లైన్ కోటింగ్‌తో కూడిన డ్యూరా ఏస్ ట్యాంక్‌ను కలిగి ఉంది. తుప్పు నుంచి అద్భుతమైన రక్షణను అందిస్తుంది. ఇంకా బజాజ్ ఎండ్యూర్ సిరీస్ గ్రాసియో స్టోరేజ్ వాటర్ హీటర్, బజాజ్ షీల్డ్ ఇమ్మోర్టో స్టోరేజ్ వాటర్ హీటర్‌లు ఉత్తమ నాణ్యతను అందించనున్నాయి.

జీఆర్ఎంఐ–ఎంఈపీఎస్‌సీ మధ్య కీలక ఒప్పందం

ముంబయి: గ్లోబల్ రిస్క్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (జీఆర్ఎంఐ), మేనేజ్‌మెంట్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ ప్రొఫెషనల్ స్కిల్స్ కౌన్సిల్ (ఎంఈపీఎస్‌సీ) 2025 జనవరి 13న ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసాయి. ఈ భాగస్వామ్యం భారతదేశంలో రిస్క్ మేనేజ్‌మెంట్ విద్య , నైపుణ్యాభివృద్ధికి మద్దతుగా రూపొందింది. ఈ ఒప్పందంపై ఎంఈపీఎస్‌సీ కల్నల్ అనిల్ కుమార్ పోఖ్రియాల్, జీఆర్ఎంఐ డీన్, సీఈఓ సుభాషిస్ నాథ్ సంతకాలు చేశారు. ఈ భాగస్వామ్యం భారతదేశంలో నైపుణ్య ఆధారిత ప్రొఫెషనల్ విద్యను కొత్త ఎత్తుకు తీసుకెళ్లడం లక్ష్యంగా పెట్టుకుంది. జీఆర్ఎంఐ–ఎంఈపీఎస్‌సీ భాగస్వామ్యం ప్రొఫెషనల్ విద్యకు కొత్త నిర్వచనం ఇచ్చే దిశగా ఒక అడుగుగా భావిస్తున్నారు.

సంపాదకీయం

నితీశ్ పార్టీలో గందరగోళం

కేంద్రంలో మోదీ నాయకత్వంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రెండు కొయ్యకాళ్ల ఆధారంగా నిలబడి ఉంది. 12 మంది లోక్‌సభ ఎంపీలు ఉన్న బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నాయకత్వంలోని జె.డి.(యు) బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తోంది. 16 లోక్‌సభ స్థానాలు ఉన్న తెలుగు దేశం పార్టీ (టి.డి.పి.) కూడా బీజేపీకి మద్దతిస్తోంది. కానీ నితీశ్ పార్టీలో లుకలుకలు ప్రారంభం అయినట్టు కనిపిస్తోంది. మణిపూర్‌లో నితీశ్ కుమార్ నాయకత్వంలోని జె.డి.(యు)కు ఒకే ఒక శాసనసభ్యుడు ఉన్నారు. మణిపూర్ లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి జె.డి.(యు) మద్దతిస్తోంది. ఆ ఒక్క శాసనసభ్యుడు అబ్దుల్ నసీర్ ఇక మీదట ప్రతిపక్షంలో కూర్చుంటారని మణిపూర్ జె.డి.(యు) అధ్యక్షుడు బీరేన్ సింగ్ ప్రకటించారు. బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నట్టు అబ్దుల్ నసీర్ ఏ ప్రకటనా చేయలేదు. బీరేన్ సింగ్ జె.డి.(యు) కేంద్ర నాయకత్వాన్ని సంప్రదించకుండానే బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించినట్టు ప్రకటించారని అందువల్ల ఆయనను జె.డి.(యు) నుంచి బర్తరఫ్ చేశారు. జె.డి.(యు) కు చెందిన ఒకే ఒక శాసనసభ్యుడు మద్దతు ఉపసంహరించినందువల్ల బీజేపీ ప్రభుత్వానికి నష్టం ఏమీ లేదు. కానీ జె.డి.(యు)లో కనిపించిన అనైక్యత అంతిమంగా బీజేపీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ.లో కల్లోలానికి దారి తీయవచ్చు. అయితే నసీర్ ప్రతిపక్షంలో ఏమీ కూర్చోరని జె.డి.(యు) నాయకత్వం అంటోంది. 60 మంది సభ్యులున్న మణిపూర్ శాసనసభలో బీజేపీకి 37 మంది సభ్యులు ఉన్నారు. నాగా పీపుల్స్ ఫ్రంట్ కు చెందిన అయిదుగురు కూడా బీజేపీ ప్రభుత్వాన్ని సమర్థిస్తున్నారు. మరో ముగ్గురు ఇండిపెండెంట్ సభ్యుల మద్దతు కూడా ఉంది. జె.డి.(యు) సభ్యుడు మద్దతు ఉపసంహరించినందువల్ల బీజేపీకి ఏ చింతా లేదు కానీ జె.డి.(యు)లో విభేదాలు బయట పడ్డాయి. పైగా కొద్ది నెలల్లో బిహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం బిహార్ లో నితీశ్ కుమార్ నాయకత్వంలో బీజేపీ కూడా భాగస్వామి. వచ్చే శాసనసభ ఎన్నికలలో ఇప్పటికి అందుబాటులో ఉన్న సూచనల ప్రకారం ఈ రెండు పార్టీలూ కలిసే పోటీ చేసే అవకాశం ఉంది. మణిపూర్ లో బీజేపీ సర్కారుకు మద్దతు ఉపసం హరిస్తున్నట్టు నితీశ్ ఇప్పటిదాకా అధికారికంగా ప్రకటించలేదు. 2022లో జరిగిన ఎన్నికలలో జె.డి.(యు) ఆరు స్థానాలు సాధించింది. కానీ ఎన్నికలు జరిగిన కొద్ది నెలలకే అయిదుగురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరిపోయారు. మణిపూర్‌లో మెయితీలకు, కుకీలకు మధ్య నిరంతరం జాతి కలహాలు కొనసాగుతున్నందువల్ల కోన్రాడ్ సంగ్మ నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్.పి.పి.) గత నవంబర్ లో బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించింది. అంతకు ముందు కుకీ పీపుల్స్ అలయన్స్ 2023 ఆగస్టులో బీజేపీకి మద్దతు వెనక్కు తీసుకుంది. ఆ పార్టీ కూడా హింసాకాండ కొనసాగుతున్నందుకే మద్దతు ఉపసంహరించింది.

ప్రస్తుతానికి మణిపూర్ లో బీజేపీ ప్రభుత్వానికి ప్రమాదంలేని మాట నిజమే. ఒకే ఒక సభ్యుడున్న జె.డి.(యు) అధికారికంగానే మద్దతు వెనక్కు తీసుకున్నా పోయేదేమీ లేదు. గత లోకసభ ఎన్నికలలో కావలసిన 273 స్థానాలకు బదులు బీజేపీకి దక్కింది 240 మాత్రమే. అప్పుడు ఎన్.డి.ఎ.లోని ఇతర మిత్రపక్షాలైన తెలుగు దేశం, జె.డి.(యు) మద్దతుతో మాత్రమే మోదీ ప్రభుత్వం నడుస్తోంది. మణిపూర్ పరిణామాల ప్రభావం ఏమీ లేకపోయినా జె.డి.(యు) అధినేత నితీశ్ కుమార్ ఎప్పుడు ఎలాంటి వైఖరి అనుసరిస్తారో తెలియదు. ఆయన మనసులో ఏముంటుందో, ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో ఎవరికీ అంతుపట్టదని ఆయన సన్నిహితులే అంటారు. గత ఏడాది ఆరంభంలో కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినప్పటి నుంచి మోదీనిగానీ, బీజేపీని కానీ నితీశ్ ఒక్క మాట కూడా అనని మాట నిజమే. అయితే ఆయనలో అసంతృప్తి మాత్రం స్పష్టంగానే కనిపిస్తోంది. బిహార్ కు ప్రత్యేక ప్రతిపత్తి మాట అటు కేంద్రమూ ఎత్తలేదు. నితీశ్ కూడా ప్రస్తావించడం లేదు. నితీశ్ కుమార్ బిహార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఇంతకు ముందు ఆయన లాలూ ప్రసాద్ యాదవ్ నాయకత్వంలోని ఆర్.జె.డి.తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు కూడా ఆర్.జె.డి.కన్నా నితీశ్ పార్టీకి ఉన్న ఎమ్మెల్యేలు తక్కువే. ఇప్పుడు కూడా నితీశ్ పార్టీకి 45 మంది ఎమ్మెల్యేలు ఉంటే బీజేపీకి 78 మంది ఉన్నారు. బిహార్ లో ప్రత్యేక పరిస్థితి కారణంగా భాగస్వామ్య పక్షం ఏదైనప్పటికీ, దానికి జె.డి.(యు) కన్నా ఎక్కువ మంది శాసనసభ్యులు ఉన్నప్పటికీ నితీశే ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. అన్నింటికీ మించి నితీశ్ కుమార్ కేవలం బిహార్ కే పరిమితం అయిన నాయకుడు కాదు. ఆయన ప్రభావం జాతీయ రాజకీయాల మీద కూడా ఉంటుంది. ఆయనకు పల్టూరాం అన్న ముద్దు పేరు ఉన్నప్పటికీ ఆయన నాయకత్వం లేకుండా బీజేపీ కానీ, ఆర్.జె.డి. కానీ ప్రభుత్వం ఏర్పాటుచేసే స్థితిలో లేవు. ప్రస్తుతం నితీశ్ బీజేపీ పక్షాన ఉన్నప్పటికీ అదే నిత్యం అని అనుకోవడానికి అవకాశం లేదు. బిహార్ లో సీట్ల పంపిణీ చాలా కీలకం కానుంది. తన అధికారాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి తన పార్టీకి మరిన్ని సీట్లు కావాలని నితీశ్ కోరవచ్చు. ఇంకో వేపు ఇప్పటిదాకా సొంతంగా బిహార్ లో ఎప్పుడూ అధికారంలోకి రాని బీజేపీ ఇప్పుడు నితీశ్ బుజాల మీదకు ఎక్కి అధికారం అనుభవిస్తున్నా సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి తగిన బలం సమకూర్చుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. ఇది బీజేపీ, జె.డి.(యు) మధ్య పొరపొచ్చాలకు దారి తీసినా ఆశ్చర్య పడక్కర్లేదు. అన్నింటికన్నా మించి సైద్ధాంతికంగా నితీశ్ కుమార్ కు బీజేపీకి అసలే పొసగదు. నితీశ్ సోషలిస్టు పార్టీ కుదురు నుంచి వచ్చిన వారు. ఆయన ఇంతవరకు మతతత్వ విధానాలను అనుసరించిన దాఖలాలు లేవు. మతతత్వ బీజేపీతో కలిసి ముఖ్యమంత్రిగా కొనసాగిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడూ ఆయన అదే పనిచేస్తున్నారు. మోదీ ప్రధానమంత్రి అభ్యర్థిగా ఉంటారని బీజేపీ నాయకత్వం 2013లో ప్రకటించినప్పుడు నితీశ్ అగ్గి మీద గుగ్గిలం అయ్యారు. కానీ ఆ తరవాత సర్దుకు పోవడం అలవరచుకున్నారు. గత సంవత్సరారంభంలో సార్వత్రిక ఎన్నికలు జరగడానికి కొద్ది నెలల ముందు దాకా ఆయన ప్రతిపక్షంతోనే ఉన్నారు. "ఇండియా" ఐక్య సంఘటన ఏర్పడడానికి ఆయనే ప్రధాన కారకుడు. కానీ "ఇండియా" ఐక్య సంఘటనలో ఆయనకు ఎలాంటి పదవి ఇవ్వనందువల్ల మళ్లీ బీజేపీ పంచన చేరారు. ఆయనకు సైద్ధాంతిక బలిమి ఎంత ఉన్నా అధికారంలో కొనసాగడం అంతకన్నా ఎక్కువ ప్రధానం. ఏమైనా ఎన్.డి.ఎ.లో అంతా సవ్యంగా ఉన్నట్టు కనిపించడం లేదు.

దిల్లీ ఓటర్ల జాబితాలో అక్రమాలు

డాక్టర్ జ్ఞాన్ పాఠక్

దిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు తయారుచేసిన ఓటర్లజాబితాలో తీవ్ర అక్రమాలు జరిగినట్లుగా తెలుస్తోంది. అంతకంటే మిక్కిలి పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల సంఖ్యలో తీవ్ర అవకతవకలు జరిగినట్లుగా విశ్లేషకులు అంచనావేస్తున్నారు. 2020తో పోల్చి చూసుకుంటే 2025 విధాన సభ ఎన్నికలకు ఓటర్లలో ఐదింటికి ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో ఎక్కువ తేడాలు ఉన్నాయి. జనాభా సంఖ్యసైతం చాలా ఎక్కువగా ఉన్నట్లు ఓటర్ల జాబితాలో చూపించారు. దీనివల్ల ఎన్నికల ఫలితాలు తేడా వచ్చేఅవకాశం ఉంది. 2024 జనవరిలో ఒక 1,47,18,119 మంది ఓటర్లుండగా 2025 నాటికి ఈ సంఖ్య 1,56,14,000కు ఒకేసారి పెరిగిపోయింది. 2020 జనవరిలో సైతం దిల్లీలో మొత్తం ఓట్ల సంఖ్య 1,47,86,382 ఉన్నది. 2020

నాటికంటే 2024జనవరికి ఓటర్ల సంఖ్య ఎందుకు తగ్గిపోయింది? 2025లో ఒకేసారి ఓటర్ల సంఖ్య 9లక్షలకుపైగా ఎందుకు పెరిగింది? ఒకేసారి ఇంతమంది ఓటర్లు పెరిగినట్లు ఓటర్ల జాబితాలో చూపించడం అవకతవకలకు పాల్పడినట్లుగా అంచనా వేస్తున్నారు. నియోజకవర్గం వారిగా ఓటర్ల సంఖ్యలో మార్పురావడం ఎంతో ఆశ్చర్యకరంగాఉందని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. లక్షలాదిమంది ఓటర్లు సంఖ్య ఒకేసారి పెరగడంపై ఎన్నికల కమిషన్ జవాబు చెప్పవలసిఉంది. దిల్లీ ముఖ్యమంత్రి అతిశి మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాలను సమీక్షించిందని ఆ తరువాత ఓటర్ల తొలగింపుతో, కలిపేందుకు అనేక దరఖాస్తులు చేరాయని అన్నారు. ఇందులో అవకతవకలు ఏమీ లేవని ఆమె వివరించారు. ప్రభుత్వం వైపునుంచి ఎలాంటి కుట్రలులేవని ముఖ్యమంత్రి అన్నారు. 10శాతం మంది కొత్త ఓటర్లు చేరగా 5.77శాతం మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించినట్లు ఆమె చెప్పారు.

ఓటర్ల తొలగింపునకు 6,167 దరఖాస్తులు రాగా వాటిలో 84 మంది 4,283 దరఖాస్తులను చేశారు. ఈ అక్రమం బైటపడటంతో ఎన్నికల కమిషన్ 84 మందికి నోటీసులుఇచ్చి, విచారణకు పిలిచింది. వీరంతా విచారణకు హాజరయ్యారు. తాము దరఖాస్తు చేయలేదని వారు చెప్పినట్లుగా ముఖ్యమంత్రి వివరించారు. ఇదిజరిగిన వారం రోజుల తర్వాత ఆప్ అధినేత కేజ్రీవాల్ సీఈసీకి ఒక లేఖ రాశారు. బీజేపీ కేంద్ర మంత్రులు, నాయకులు తమ ఇళ్ల చిరునామాలు ఇచ్చి నకిలీ ఓటర్లను రిజిస్టర్ చేయించారని అందువల్ల బీజేపీ నాయకులపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని ఆ లేఖలో కేజ్రీవాల్ కోరారు. అయితే ఈ ఆరోపణ నిరాధారమైందని బీజేపీ నాయకులు వాదించారు. పైగా ఆప్ నాయకులే అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ రెండు పార్టీల నాయకుల ఆరోపణలను సీఈసీ తిరస్కరించింది. 2020 జనవరి తో పోలిస్తే, 2025 జనవరి నాటికి 14అసెంబ్లీలలో ఓటర్ల సంఖ్య తగ్గిపోయింది. ఇది ఎలా జరిగింది? ఆశ్చర్యంగాఉంది. ఇతర నియోజకవర్గాలలో గణనీయంగా ఓటర్ల సంఖ్య పెరిగింది. ఆరోపణలు, ప్రత్యారోపణలు ఉన్నప్పటికీ వివిధ నియోజకవర్గాలలో ఓటర్ల జాబితాలలో హెచ్చుతగ్గులు ఉన్నాయి.

ఏడు లోక్‌సభ నియోజకవర్గాలలో, 10అసెంబ్లీ నియోజక వర్గాలున్నాయి. చాందినీచౌక్ లోక్‌సభ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 16,09,730 నుంచి 16,81,116 ఓట్లకు (71,386 అధికం) పెరిగాయి. ఈశాన్య దిల్లీలో 23,81,442 నుంచి 25,54,496కు పెరిగాయి. (1,73,054) అధికం. తూర్పు దిల్లీలో 20,62,423 నుంచి 21,60,506కు పెరిగాయి, (98వేలు అధికం). న్యూదిల్లీలో 14,81,338 నుంచి 15,61,974కు పెరిగాయి(80,636అధికం). వాయవ్య దిల్లీలో 24,72,910 నుంచి 26,84,169కు పెరిగాయి. (2,11,259) అధికం. పడమర దిల్లీలో 24,88,831 నుంచి 26,24,291కి పెరిగాయి. (1,35,460) అధికం. దక్షిణ దిల్లీలో 22,21,445 నుంచి23,47,448కి పెరిగాయి. (1,26,003 కోట్లు అధికం). ఏడాదికాలంలోనే అత్యంత అధికంగా ఓటర్ల సంఖ్య పెరగడంపై ఎన్నికల కమిషన్ తప్పనిసరిగా వివరించవలసి ఉంటుంది. జనాభా సంఖ్యలో తీవ్ర మార్పు రాజకీయ పార్టీలకు కొత్త సవాళ్లు విసురుతాయి. ఎన్నికల్లో గెలుపుపై ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. కొన్ని నియోజకవర్గాలలో ఆరోపణలు వాస్తవమే కావచ్చు. వీటిపై కచ్చితమైన విచారణ జరిపితేనే వాస్తవాలు తెలుస్తాయి. ఫిబ్రవరి 5వ తేదీన దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున ఈలోపు విచారణ జరిపించడం అంత తేలికకాదు.

కృష్ణా జలాల పంపిణీ యధాతథం

బొల్లిముంత సాంబశివరావు

కృష్ణానదీ జలాల పరిష్కారానికి బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 2 ఈ నెల 16న జరిపిన సమావేశంలో తెలంగాణ అధికారులు విభజన చట్టం సెక్షన్ 89, 1956 చట్టంలోని సెక్షన్ 3 పైన ఒకేసారి విచారణ జరపాలని కోరగా, ఏపీ అధికారులు మాత్రం సెక్షన్ 89 పై జరగాలని కోరారు. రెండు వాదనల విన్న తర్వాత ముందుగా సెక్షన్ 3 పై వాదనలు వింటామనిచెప్పి సమావేశాన్ని ఏప్రిల్ 19కి వాయిదా వేసింది. రెండు రాష్ట్రాల జల వివాదాల నేపధ్యంలో 21-1-2025న హైద్రాబాద్‌లో కృష్ణానది యాజమాన్య బోర్డు రెండు రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశం జరిపింది. తెలంగాణ నీటిపారుదల అధికారులు 71శాతం తెలంగాణకు, 29శాతం ఏపీ కి కేటాయింపులు చేయాలని కోరగా, ఏపీ నీటిపారుదల అధికారులు కృష్ణా ట్రిబ్యునల్ 1 కేటాయించిన విధంగా ఏపీకి 66శాతం, తెలంగాణకి 34శాతం కేటాయింపులు చేయాలని కోరారు. రెండు వాదనల తర్వాత నదీ జలాల కేటాయింపు ట్రిబ్యునల్ 2 త్రిసభ్య కమిటీలో నిర్ణయించుకోవాల్సి ఉందని, అప్పటిదాకా ప్రస్తుతం అమల్లో ఉన్న 66:34 నిష్పత్తి ప్రకారం కేటాయింపులు జరుగుతాయని మేనేజ్‌మెంట్ బోర్డు పేర్కొంది. కృష్ణా నదీ జలాల పంపకంలో మోదీ ప్రభుత్వం రాష్ట్రాల మధ్య నిత్య తగవులుగా మార్చింది. కేంద్ర మంత్రివర్గం తెలుగు రాష్ట్రాల కృష్ణా నది నీటి పంపకాల వివాదాల పరిష్కార బాధ్యతను ట్రిబ్యునల్ 2 కు మోదీ ప్రభుత్వం అప్పగించటం అందులో భాగమే.

భారతదేశంలోని గంగ,బ్రహ్మపుత్ర, గోదావరి నదుల తర్వాత కృష్ణానది పెద్ద నది. ఇది మహారాష్ట్ర, కర్నాటక నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుగా ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ మధ్య నీటి పంపకాల విభేదాలు ఏర్పడ్డాయి. రాష్ట్రాల మధ్య నీటి పంపకం కోసం ఆ నాటి కేంద్ర ప్రభుత్వం 1969 ఏప్రిల్ లో ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేసింది. దీనికి ఆర్ ఎస్ బచావత్ అధ్యక్షులు కాగా, డి.ఎం బండారి, డి.ఎం సేన్ లు సభ్యులుగా ఉన్నారు. ఇదే బచావత్ ట్రిబ్యునల్‌గా ప్రచారం పొందింది. కృష్ణా నదీ నీటి లభ్యతపై సమగ్ర పరిశీలన చేసి, దాని అనుబంధ రాష్ట్రాలను దృష్టిలో పెట్టుకుని 1973మేలో ప్రభుత్వానికి బచావత్ ట్రిబ్యునల్ నివేదిక అందించింది. కేంద్ర ప్రభుత్వం మాత్రం 1976లో దాన్ని ప్రకటించింది. అదనంగా వచ్చే నీటిని కూడా దృష్టిలో పెట్టుకుని మహారాష్ట్రకు 585, కర్నాటకకు 734, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు 811 టిఎంసిలను బచావత్ ట్రిబ్యునల్ కేటాయించింది. నదిలో మిగులు జలాలను 330 టీఎంసీల అంచనా వేసి, అందులో 25శాతం మహారాష్ట్ర కు, 50శాతం కర్నాటకకు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు 25శాతం పేర్కొంది. మిగుల జలాల పంపిణీ విషయంలో రాష్ట్రాలమధ్య ఏకాభిప్రాయం లేకపోతే పార్లమెంట్ జోక్యం చేసుకుని నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. 1976 నాటికి మిగులు జలాల తీర్పును కేంద్రం ఆమోదించకపోవటంతో తాత్కాలికంగా ఆంధ్రప్రదేశ్‌కు మిగులు జలాలపై హక్కు కల్పించారు.

బచావత్ ట్రిబ్యునల్ నీటి పంపిణీ గడువు ముగియటంతో దాన్ని పొడిగించకుండా అది ఉండగానే, జస్టిస్ బ్రిజేష్ కుమార్ అధ్యక్షులుగా, జస్టిస్ ఎస్ పి శ్రీవాస్తవ, జస్టిస్ డికె సేత్ సభ్యులుగా 2004 ఏప్రిల్‌లో కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేశారు. శ్రీవాస్తవ మరణించగా ఆయన స్థానంలో బిపి దాస్‌ను నియమించింది. దీని పేరు కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్ 2. దీన్నే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అని పిలిచారు. ఈ ట్రిబ్యునల్ 2007 జూలైలో పని ప్రారంభించి, రెండు రాష్ట్రాల వాదనలు తర్వాత గత కేటాయింపులను కొనసాగిస్తూనే మిగుల జలాల కేటాయింపులు కూడా చేసింది. కర్నాటక ఆల్మట్టి ఎత్తు ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యతిరేకించి సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది.

ఆంధ్రప్రదేశ్- తెలంగాణ రాష్ట్రాల జల వివాదం: 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత రెండు రాష్ట్రాల మధ్య నదీ జలాల సమస్య ముందుకు వచ్చింది. నీటి కేటాయింపులలో అన్యాయం జరిగిందనే వాదనను తెలంగాణ ప్రభుత్వం ముందుకు తెచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత ఉమ్మడి రాష్ట్రానికి ముందు నుంచి ఉన్న 811 టీఎంసీల నీటిలో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు పంపిణీ చేశారు. ఇంతకు ముందు ట్రిబ్యునల్ తీర్పుల్లో తెలంగాణ లేదు కాబట్టి, దాని వాదన వినేందుకు కొత్త ట్రిబ్యునల్ కావాలని తెలంగాణ కోరుతున్నది. దాని కోసం 2014లో కేంద్రానికి లేఖ రాసింది.కొత్త ట్రిబ్యునల్ గురించి మాట్లాడ కుండా కేంద్రం మాత్రం పాత ట్రిబ్యునల్ ను రెండు సంవత్సరాలను పొడిగించింది. తిరిగి కేటాయింపులు కొత్తగా చేయాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేసింది . దీనికి కర్నాటక, మహారాష్ట్ర ఒప్పుకోలేదు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య నీటి తగవులు పరిష్కరం కావటం ఇష్టంలేని మోదీ ప్రభుత్వం, వివాదం సుదీర్ఘ కాలం కొనసాగేలా రెండు రాష్ట్రాలకు సంబంధించి కృష్ణా

> **కృష్ణా నదీ జలాల పంపకంలో మోదీ ప్రభుత్వం రాష్ట్రాల మధ్య నిత్య తగవులుగా మార్చింది. కేంద్ర మంత్రివర్గం తెలుగు రాష్ట్రాల కృష్ణా నది నీటి పంపకాల వివాదాల పరిష్కార బాధ్యతను ట్రిబ్యునల్ 2 కు మోదీ ప్రభుత్వం అప్పగించటం అందులో భాగమే.**

రివర్ మేనేజ్ మెంట్ బోర్డును ఏర్పాటు చేసింది. ఇది మోదీ ప్రభుత్వ మోస పూరిత నిర్ణయం. కృష్ణా నది జలాలు నాలుగు రాష్ట్రాలకు సంబంధించిన సమస్య. వివాదాలు కూడా ఆ పరిధి లోనే ఉన్నాయి. మోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్డులో నాలుగు రాష్ట్రాలు ఉండాలి. మహారాష్ట్ర, కర్నాటకను మేనేజ్ మెంట్ బోర్డు నుంచి మినహా యించటమంటే, వాటిని వివాదం నుంచి తప్పించటమే. తెలంగాణ, ఏపీ లు వివాదంలో కూరుకు పోయేటట్లు చేయటమే. ఆచరణలో అదే జరిగింది. రెండు రాష్ట్రాల మధ్య నీటి తగవులు ప్రారంభమైనాయి. ఇది మోదీ ప్రభుత్వం సృష్టించినదే. మోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కృష్ణా డెవలప్‌మెంట్ బోర్డును వ్యతిరేకించక పోవటం రెండు రాష్ట్రాలు చేసిన తప్పిదం. కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డు ఏర్పడినా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవటంలో పూర్తిగా విఫలమైంది. అప్పుడప్పుడు సమావేశమై అవసరాలకు రెండు రాష్ట్రాలకు ఎంత నీరు విడుదల చేయాలనే నిర్ణయాలు తప్ప సమస్యల పరిష్కారం వైపు బోర్డు వెళ్లలేదు. బోర్డు ఏర్పాటు వలన రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు ఎక్కువ అయ్యాయి. అనేక సార్లు రెండు రాష్ట్రాల ప్రజల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డును పక్కన పెట్టి రెండు రాష్ట్రాలు నీటి పధకాలను ప్రకటించటం ప్రారంభించాయి.

కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటుచేసి నీటి పంపకం చేయాలని, పాత పంపకాలను పక్కన పెట్టి 50:50శాతం నీటి కేటాయింపులు చేయాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నది. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దీన్ని వ్యతిరేకించింది. మోదీ ప్రభుత్వం కూడా తెలంగాణ ప్రతిపాదనకు అమోదం తెలపలేదు. ఈ నేపధ్యంలో నరేంద్రమోదీ అధ్యక్షతన 6-10-23 జరిగిన మంత్రివర్గ సమావేశంలో తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ పరిష్కార బాధ్యతను ట్రిబ్యునల్-2 కు అప్పగించారు. విభజన చట్టంలోని సెక్షన్ 5 (1) (నియమిత తేదీ నుంచి 10 సంవత్సరాలకు మించని కాలానికి నిర్ణయం) కింద తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న కృష్ణా జలాల వివాదాల పరిష్కార ట్రిబ్యునల్‌కు విభజన సెక్షన్‌లోని 89కి లోబడి ఈ బాధ్యత అప్పగించినట్లు మంత్రి వర్గం పేర్కొంది. ఈ ట్రిబ్యునల్ చట్టపరమైన అభిప్రాయాల సేకరణతో పాటు, అంతర్ రాష్ట్ర నదీ జలాల చట్టం 1956 సెక్షన్(3) కి లోబడి పరిష్కారం చేస్తుందని చెప్పింది. గోదావరి, కృష్ణా నదుల నీటిని రెండు రాష్ట్రాల ప్రయోజనాలకు అనుగుణంగా ఏర్పడిన విభేదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. కృష్ణా వాటర్ డిస్ట్రిబ్యూటర్ ట్రిబ్యునల్‌ను నాలుగు రాష్ట్రాలకు వర్తింప చేయాలని ప్రజలు సమిష్టిగా డిమాండ్ చేయాలి.

సెల్: 9885983526

రాయల్ నేవీ తిరుగుబాటు

ఆర్వీ రామారావ్

దాదాపు 150 మంది బ్రిటిష్ అధీనంలోని భారత నౌకాదళ సిబ్బంది మద్రాసులోని హెచ్.ఎం.ఐ.ఎస్. నౌకా స్థావరంలో 1946 ఫిబ్రవరి 19న తిరుగుబాటు చేశారు. తిరుగుబాటు చేసినవారు నినాదాలు చేస్తూ, బ్రిటిష్ అధికారుల మీద దాడిచేస్తూ వీధుల్లో తిరిగారు. ఈ తిరుగుబాటులో సైనికులు, పోలీసులు, పౌరులు కూడా పాల్గొన్నారు. మొదట ఈ తిరుగుబాటు ఛాయలు బొంబాయిలో కనిపించాయి. నెమ్మదిగా కరాచీ నుంచి కలకత్తా దాకా పాకింది. క్రమంగా ఈ తిరుగుబాటులో 10వేల మంది పాల్గొన్నారు. 56 నౌకల మీద ఉన్నవారు తిరుగుబాటు చేశారు. అయితే ఈ తిరుగుబాటు విప్లవంగా పరిణమించ లేదు. ఈ తిరుగుబాటును అణచడానికి బలగాలను, పై అధికారులను బ్రిటిష్ ప్రభుత్వం రంగంలోకి దింపింది.

నౌకాదళ నావికులు బ్రిటిష్ అధికారులకు లొంగి పోవడంతో ఈ తిరుగుబాటు ముగిసింది. ఈ తిరుగుబాటును సమర్థించింది కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే. ఇది కమ్యూనిస్టుల కుట్ర అని బ్రిటిష్ అధికారులు ముద్రవేశారు. కాంగ్రెస్, ముస్లిం లీగ్ ఈ తిరుగుబాటుకు మద్దతు ఇవ్వకపోగా తిరుగుబాటు ఉపసంహరించుకోవాలని నావికులను ఒత్తిడి చేశారు. స్వాతంత్ర్యం అతి త్వరలో రానున్న తరుణంలో ఇలాంటి సాయుధ తిరుగుబాటు జరిగితే అహింసాయుత పోరాటానికి విఘాతం కలుగుతుందని, సజావుగా అధికార మార్పిడికి అంతరాయం కలుగుతుందని కాంగ్రెస్, ముస్లిం లీగ్ భావించాయి. ఒక వేళ నౌకాదళం సాయుధ తిరుగుబాటు సఫలమైనా ఆ తరవాతి పరిణామాలు విపరీతంగా ఉంటాయని ఈ రెండు పార్టీలు అభిప్రాయపడ్డాయి. పని పరిస్థితులు సవ్యంగా లేనందువల్ల నౌకాదళంలో పనిచేసేవారు 1946 ఫిబ్రవరి 18న సమ్మె ప్రారంభించారు. జీవన పరిస్థితులు, ఆహారం వీరి ప్రధాన సమస్యలుగా ఉండేవి. 19వ తేదీ సాయంత్రం కల్లా కేంద్ర సమ్మె కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమ్మెకు జనం మద్దతు కూడా దొరికింది. అయితే రాజకీయ పార్టీల, నాయకత్వం మద్దతు మాత్రం సమకూరలేదు.

బొంబాయిలో ఒక రోజు సమ్మె జరిగింది. కానీ ఈ సమ్మెకు నిరసనగా సామాన్య ప్రజల నుంచి మద్దతు లభించింది. తిరుగుబాటుకు ఇతర వర్గాల దన్ను ఉండేది. వైమానిక దళంలోనివారు, స్థానిక పోలీసులు కూడా ఇందులో భాగస్వాములయ్యారు. నావికులు తమను తాము భారత జాతీయ నౌకాదళం అని పిలుచుకున్నారు. బ్రిటిష్ అధికారులకు ఎడమ చేత వందనం చేశారు. కొన్ని చోట్ల బ్రిటిష్ అధికారుల ఆదేశాలను ధిక్కరించారు. మద్రాసు, పుణే జైళ్లల్లో అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడ్డాయి. కలకత్తా నుంచి కరాచీ దాకా భారత సైన్యంలోనూ తిరుగుబాటు ఛాయలు

The Naval Uprising - February 1946 - The forgotten Mutiny

కనిపించాయి. అల్లర్లు కూడా జరిగాయి. తిరుగుబాటు చేసిన వారు త్రివిధ దళాల పతాకాలు ఎగురవేశారు. కమ్యూనిస్టు పార్టీ పతాకమైన అరుణ పతాకాన్ని కూడా ఆవిష్కరించారు. నౌకాదళ కేంద్ర కమిటీ అధ్యక్షుడు ఎం.ఎస్.ఖాన్ కు, కాంగ్రెస్ నాయకుడు వల్లభ భాయి పటేల్ మధ్య జరిగిన చర్చల పర్యవసానంగా సమ్మె విరమించారు. పటేల్ తో జరిగిన చర్చల్లో ఆందోళనలో పాల్గొన్న వారినెవరినీ శిక్షించ కూడదన్న ఒప్పందమూ కుదిరింది. కానీ నౌకాదళంలో పని చేస్తున్న వారిని అరెస్టుచేసి దుర్భరమైన పరిస్థితులున్న శిబిరాల్లో బంధించారు. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి పటేల్ బొంబాయి సందర్శించారు. ఆందోళన విరమించాలని ప్రకటన జారీ చేశారు. దీనికి మద్దతుగా ముస్లిం లీగ్ తరఫున మహమ్మద్ అలీ జిన్నా కూడా ఒక ప్రకటన విడుదల చేశారు. 476 మంది నావికులపై కోర్ట్ మార్షల్ జరిపి వారిని బర్తరఫ్ చేశారు. బర్తరఫ్ అయిన వారెవరినీ మళ్లీ ఉద్యోగాల్లో నియమించలేదు. స్వాతంత్ర్యం తరవాత, దేశ విభజన తరవాత కూడా వీరిని క్షమించలేదు.

ఆప్‌కు ఓటమి తప్పదు: మోదీ

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఆప్‌కు ఓటమి తప్పదు అని ప్రధాని మోదీ అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలోనే బీజేపీ ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో ఆమ్ ఆద్మీ పార్టీపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అధికార పార్టీ రోజుకో హామీ ఇస్తోంది. ఆ పార్టీ గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైంది. దీనిపై ఆ పార్టీని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆప్ మోసాలకు శీష్ మహల్ ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో కార్యకర్తల వల్లే బీజేపీకి విజయం దక్కుతుంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో 50 శాతం ఓట్లు బీజేపీకి పడేలా కార్యకర్తలు ప్రచారం నిర్వహించాలి అని మోదీ సూచించారు. ఢిల్లీ ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతుంటే కేజ్రీవాల్ తన కోసం 'శీష్ మహల్' (అద్దాల మేడ) నిర్మించుకున్నారని కొద్ది రోజులుగా బీజేపీ ఆరోపిస్తోంది. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఆప్, బీజేపీ మధ్య మాటల యుద్ధం జరుగుతుండడంతో ఢిల్లీ రాజకీయ వాతావరణం వేడెక్కింది.

కేజ్రీవాల్ కోసం పంజాబ్ ప్రభుత్వ యంత్రాంగం

బీజేపీ నేత పర్వేశ్ వర్మ ఆరోపణ



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయాలు వేడెక్కాయి. అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)పై బీజేపీ మండిపడింది. దేశ రాజధానిలో చైనీస్ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు పంజాబ్ ప్రభుత్వ యంత్రాంగాన్ని అరవింద్ కేజ్రీవాల్ దుర్వినియోగం చేస్తున్నారని ఆ పార్టీ అభ్యర్థి పర్వేశ్ వర్మ ఆరోపించారు. పంజాబ్ రిజిస్ట్రేషన్ నంబర్ ఉన్న వేలాది వాహనాలు ఢిల్లీలో తిరుగుతున్నాయని తెలిపారు. పంజాబ్ ప్రభుత్వానికి చెందిన వాహనాలు వాటర్ డిస్పెన్సర్లు, కుర్చీలు, ఇతర సామగ్రిని ఢిల్లీకి రవాణా చేస్తున్నాయని అన్నారు. పంజాబ్ ప్రభుత్వ టీచర్లు, ఉద్యోగులు ఆప్ కార్యకర్తల వేషంలో ఢిల్లీలో ఉన్నారని ఆరోపించారు. అమృత్‌సర్‌కు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేశారని చెప్పారు. న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి తనతో తలపడుతున్న అరవింద్ కేజ్రీవాల్ ఓటమి పట్ల భయపడుతున్నారని పర్వేశ్ వర్మ విమర్శించారు. అందుకే పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వ యంత్రాగాన్ని ఆయన వాడుకుంటున్నారని, మురికివాడల్లో చైనీస్ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. హుడావుడిగా ఏర్పాటు చేసిన చైనా సీసీటీవీ కెమెరాలు భద్రతకు ముప్పుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో పంజాబ్ ప్రభుత్వ వనరుల దుర్వినియోగాన్ని అరికట్టాలని ఎన్నికల కమిషన్(ఈసీ)ను ఆయన డిమాండ్ చేశారు.

మిస్టరీ మరణాలతో నిషేధాజ్ఞలు

రాజౌరి: రాజౌరీ జిల్లాలోని బుధాల్ గ్రామంలో నెలన్నర వ్యవధిలోనే మూడు కుటుంబాల్లో ఏకంగా 17 మంది అనుమానాస్పద రీతిలో ప్రాణాలు కోల్పోయారు.. ఈ అంతుచిక్కని మరణాలతో అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మంగళవారం ఈ గ్రామానికే చెందిన ఐజాజ్ అహ్మద్ అనే 24 ఏళ్ల వ్యక్తి ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రిలో చేర్చారు. ఈ మరణాల వెనుక ఉన్న మిస్టరీ ఏంటో తెలుసుకొనేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. ఇందులో భాగంగా అధికారులు ఆ గ్రామాన్ని కంటైన్‌మెంట్ జోన్‌గా ప్రకటించారు. ఇకపై గ్రామంలోకి ఎటువంటి ప్రభుత్వ, ప్రైవేటు సమావేశాలు జరపకూడదని నిషేధాజ్ఞలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రాతపూర్వక ఆదేశాలు జారీ చేసే అధికారం మేజిస్ట్రేట్‌లకు ఉందని అధికారులు పేర్కొన్నారు. అంతుచిక్కని ప్రమాదాలు లేదా వైరస్‌ను నివారించేందుకు ఈ ఆదేశాలు కొంతమేర సహాయపడతాయని అన్నారు. అదనపు జిల్లా మేజిస్ట్రేట్ (రాజౌరీ) రాజీవ్ కుమార్ ఖజురియా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం... గ్రామాన్ని మూడు కంటైన్‌మెంట్ జోన్‌లుగా విభజించారు. అయితే బాధిత కుటుంబాలు, వారి సన్నిహితులు ప్రభుత్వ అధికారులు అందించే ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, వారి ఇళ్లలో ఉన్న ఇతర పదార్థాలు వినియోగించకూడదని హెచ్చరికలు జారీ చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా బాధిత కుటుంబాల ఇళ్లలో ఉన్న తినదగిన పదార్థాలు అన్నింటినీ స్వాధీనం చేసుకొని పరీక్షించాలని ప్రభుత్వం ఆదేశించింది.

దోషి వాదన విన్నాకే పిటిషన్‌పై నిర్ణయం: హైకోర్టు

కోల్‌కతా: దోషి సంజయ్ రాయ్, సీబీఐ, మృతురాలి కుటుంబ సభ్యుల వాదనలు విన్న తర్వాతే ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను పరిగణలోకి తీసుకుంటామని హైకోర్టు తెలిపింది. ఈ కేసుపై సోమవారం విచారణ జరుపుతామని తెలిపింది. కాగా, ఈ కేసులో నిందితుడికి సిల్దా కోర్టు విధించిన శిక్ష సరిపోదని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయడాన్ని సీబీఐ వ్యతిరేకించింది. కేసును విచారించిన సంస్థగా శిక్ష విషయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు తమకు మాత్రమే ఉందని... ఇందులో జోక్యం చేసుకొనే అధికారం ప్రభుత్వానికి లేదని పేర్కొంది. గతఏడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీకర్ ఆసుపత్రిలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన కేసుపై ఇటీవల విచారణ జరిపిన కోల్‌కతాలోని సిల్దా కోర్టు ... నిందితుడు సంజయ్‌రాయ్‌కు జీవితఖైదు విధించింది. బాధిత కుటుంబానికి రూ.17 లక్షల పరిహారం చెల్లించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఘటన అరుదైన కేసు కేటగిరీలోకి రాదని వ్యాఖ్యానించింది. మరణశిక్ష విధించకపోవడానికి ఇదే కారణమని వివరించింది. దీనిపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ... ఈ తీర్పుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దోషికి మరణశిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ బెంగాల్ సర్కారు కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది.

నేరస్తుల రక్షణే బీజేపీ విధానం

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శ

న్యూఢిల్లీ: ప్రభుత్వం చేపట్టిన 'బేటీ బచావో, బేటీ పఢావో' కార్యక్రమం 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బుధవారం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిది కపట నాటకమని దుయ్యబట్టింది. అధికార పార్టీ 'కూతుళ్లను రక్షించండానికి' బదులుగా 'నేరస్థులను రక్షించండి' విధానాన్ని ఎందుకు అవలంబించిందని ప్రశ్నించింది. 'బేటీ బచావో బేటీ పఢావో' (బీబీబీపీ)ని ప్రధాని మోదీ జనవరి 22, 2015న హర్యానాలోని పానిపట్‌లో ప్రారంభించారు. జీవిత చక్ర కొనసాగింపులో తగ్గుతున్న బాలల లింగ నిష్పత్తి (సీఎస్ఆర్), మహిళా సాధికారతకు సంబంధించిన సమస్యలను బీబీబీపీ ప్రస్తావిస్తుంది. 'ఎక్స్' లో హిందీలో ఒక పోస్ట్‌లో, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే... 'పదేళ్ల బేటీ బచావో... మోదీ జీకి మా మూడు ప్రశ్నలు... బీజేపీ 'కూతుళ్లను రక్షించండి' బదులుగా 'నేరస్తులను రక్షించండి' విధానాన్ని ఎందుకు స్వీకరించింది? మణిపూర్ మహిళలకు న్యాయం ఎప్పుడు లభిస్తుంది. హత్రాస్ దళిత కుమార్తె అయినా, ఉన్నావ్ కుమార్తె అయినా, లేదా మన ఛాంపియన్ మహిళా రెజ్లర్ అయినా, బీజేపీ ఎప్పుడూ నేరస్తులను ఎందుకు కాపాడుతోంది? దేశంలో ప్రతి గంటకు మహిళలపై 43 నేరాలు ఎందుకు నమోదవుతున్నాయి' అని ప్రశ్నించారు. 'మన దేశంలోని అత్యంత అణగారిన వర్గాలయిన దళిత-గిరిజన తరగతికి చెందిన మహిళలు, పిల్లలపై ప్రతిరోజూ 22 నేరాలు నమోదవుతున్నాయి. ఎర్రకోట నుంచి తన ప్రసంగాలలో మోదీ జీ మహిళల భద్రత గురించి చాలాసార్లు మాట్లాడారు. కానీ ఆయన మాటలకు, చర్యలకు మధ్య ఎందుకు తేడా ఉంది' అని ఖర్గే ప్రశ్నించారు. 2019 వరకు 'బేటీ బచావో, బేటీ పఢావో' పథకానికి కేటాయించిన మొత్తంలో దాదాపు 80 శాతం మీడియా ప్రకటనలకే ఖర్చు చేయడానికి కారణం ఏమిటని ఆయన నిలదీశారు. 'పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ వాస్తవాన్ని బహిర్గతం చేసినప్పుడు ఈ పథకానికి ఉపయోగించిన నిధులను 2018-19, 2022-23 మధ్య భారీగా 63 శాతం తగ్గించారు.

తరువాత దానిని 'మిషన్ శక్తి' కింద 'సంబల్' అనే పథకంతో విలీనం చేయడం ద్వారా మోదీ ప్రభుత్వం 'బేటీ బచావో, బేటీ పఢావో' పథకానికి ఖర్చు చేసిన వివరాలను అందించడం ఆపివేసింది' అని ఆయన అన్నారు. 2023-24లో 'సంబల్' కోసం కేటాయించిన నిధులు, ఉపయోగించిన నిధులలో కూడా 30 శాతం తగ్గింపు జరిగిందని ఆయన ఆరోపించారు. ఈ వివరాల 'తారుమారు' ద్వారా ప్రభుత్వం ఏమి దాచాలనుకుంటుందని నిలదీశారు. ప్రతి ట్రక్కు వెనుక 'బేటీ బచావో' అని అతికించడం లేదా ప్రతి గోడపై పెయింట్ వేయడం వల్ల మహిళలపై నేరాలు ఆగిపోతాయా, వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తాయా, వారికి మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు కల్పిస్తాయా లేదా దారుణాల తర్వాత మహిళలకు న్యాయం చేస్తాయా అని ఖర్గే ప్రశ్నించారు. 'మహిళలపై దాడులు చాలు' అని బీజేపీకి చెందిన బోలు ప్రకటన 10 సంవత్సరాల తర్వాత దాని పూర్తి కపటత్వాన్ని చూపిస్తుంది' అని ఆయన అన్నారు.

మధ్యతరగతి నలిగిపోయింది

- ఆర్థిక వ్యవస్థలో స్పష్టమైన మందగమనం
- కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్

న్యూఢిల్లీ : మధ్యతరగతి నలిగిపోతోందని, దేశంలో భారీ నిరుద్యోగ సంక్షోభం ఉందని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ బుధవారం ఆరోపించారు. తన 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ఖాతాలో, సీనియర్ ప్రతిపక్ష నాయకుడు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నుంచి ఒక కథనాన్ని పోస్ట్ చేశారు. ఇది ఈసారి రూపాయి బలహీనత భిన్నంగా ఉందని, పరిమిత ఉద్యోగ సృష్టి, వేతన పెరుగుదల మందగించడం వల్ల కలిగే పరిణామాలు అప్పుల కోసం ఎక్కువగా ఆశ్రయించడంలో కనిపిస్తాయని పేర్కొంది. భారత ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న ఆందోళనలను ఈ వ్యాసం నిర్ధారిస్తుందని రమేష్ అన్నారు. 'నిరాశపరిచే క్యూ2 జీడీపీ వృద్ధి సంఖ్యలు చిన్నవిషయం కాదు. కానీ ఆర్థిక వ్యవస్థలో మందగమనం అని స్పష్టమవుతోంది' అని కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు. 'ప్రభుత్వం ఈ భారాన్ని ఆర్‌బీఐ వడ్డీ రేటు విధానం, విదేశీ మారక మార్కెట్ జోక్యాలపైకి నెట్టడానికి చేస్తున్న ప్రయత్నాలు బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం. మహమ్మారి తర్వాత వృద్ధిలో పెరుగుదల, సేవా ఎగుమతుల పెరుగుదల, దాని ప్రతికూల ప్రభావాలు కారణమయ్యాయి. కానీ ఇది దీర్ఘకాలిక వృద్ధికి శక్తినిచ్చేంత విస్తృత ఆధారితమైనది కాదు' అని అన్నారు. 'మధ్యతరగతి తగ్గిపోతోంది. ఆటోమోటివ్ పరిశ్రమలో ఈ మార్పు స్పష్టమైన నిదర్శనం. తక్కువ ధర కలిగిన చిన్న కార్ల మార్కెట్లు (రూ.10 లక్షల లోపు విభాగం) గతంలో అన్ని కార్ల అమ్మకాలలో 73 శాతం వాటాను కలిగి ఉండేవి. కానీ ఇప్పుడు అమ్ముడైన కార్లలో 46 శాతం మాత్రమే ఉన్నాయి. మార్కెట్ ప్రీమియం భాగం నుంచి మాత్రమే వృద్ధి వస్తోంది. ఇది అధిక అసమానతను ప్రతిబింబిస్తుంది' అని ఆయన వివరించారు. 'మేక్ ఇన్ ఇండియా, పీఎల్ఐ వైఫల్యం, దేశంలో భారీ నిరుద్యోగ సంక్షోభం, దశాబ్ద కాలంగా వేతనాల స్తబ్దత గృహ రుణభారాన్ని పెంచడంలో, పేలవమైన స్థూల-ఆర్థిక ఫలితాలు, మందగమన పెట్టుబడులలో ప్రతిబింబించడం ప్రారంభించాయి' అని ఆయన తెలిపారు. కాగా, నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రపంచ కారకాలే కారణమని పేర్కొంది. అయితే తన మూడవ పదవీకాలంలో భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని ప్రధాన మంత్రి చెప్పుకొచ్చారు. గత వారం అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఎఫ్‌డీ) భారతదేశంలో ఆర్థిక వృద్ధి ఊహించిన దానికంటే ఎక్కువగా మందగించిందని, 2026 వరకు 6.5 శాతం వద్ద ఉంటుందని అంచనా వేసింది. పారిశ్రామిక కార్యకలాపాలలో ఊహించిన దానికంటే పదునైన క్షీణత ఈ మందగమనానికి దారితీసిందని ఐఎంఎఫ్ తన ప్రపంచ ఆర్థిక పరిస్థితికి సంబంధించిన తాజా నవీకరణలో తెలిపింది. దాని ప్రకారం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉంది. 2023లో భారతదేశ వృద్ధి రేటు 8.2 శాతంగా ఉంది. ఇది 2024లో 6.5 శాతానికి పడిపోయింది.

'రిపబ్లిక్‌డే' ముఖ్య అతిథి ఇండోనేసియా అధ్యక్షుడు

న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో హాజరవ్వనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. జనవరి 26న కర్తవ్యపథ్‌లో నిర్వహించే 76వ గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఇండోనేసియాకు చెందిన 160 మంది సభ్యుల కవాతు బృందం, 190 మంది సభ్యుల బ్యాండ్ బృందం భారత సైనికులతో కలిసి కవాతు నిర్వహించనుందని భారత రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

పరేడ్‌లో సాయుధ దళాలు, పారామిలిటరీ బలగాలు, సహాయక పౌర బలగాలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ బృందాలు పాల్గొంటాయి. స్వదేశీ వాయిద్యాలతో కళాకారులు దేశభక్తి గీతాలు ఆలపించనున్నట్లు అధికారులు తెలిపారు. 1950 నుంచి భారత్ మిత్రదేశాల నేతలను గణతంత్ర వేడుకలకు ఆహ్వానించడం సంప్రదాయంగా వస్తోంది. 1952, 53, 66ల్లో మాత్రమే విదేశీ అతిథులు లేకుండా రిపబ్లిక్‌డే వేడుకలు జరిగాయి. 2007లో పుతిన్(రష్యా), 2008లో నికోలస్ సర్కోజీ(ఫ్రాన్స్), 2015లో బరాక్ ఒబామా (అమెరికా), 2016లో ఫ్రాన్సోయిస్ హోలన్ (ఫ్రాన్స్) అతిథులుగా హాజరయ్యారు. 2021లో నాటి బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించినప్పటికీ కోవిడ్ కేసులు పెరగడంతో ఆయన పర్యటన రద్దైంది. 2018లో ఆసియాన్ దేశాల అధినేతలను గణతంత్ర దినోత్సవానికి ఆహ్వానించారు. 2023లో ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ సిసి ముఖ్య అతిథిగా హాజరుకాగా... 2024 గణతంత్ర వేడుకలకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానియేల్ మెక్రాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

మరో ఐదేళ్లు జాతీయ ఆరోగ్య మిషన్

ఆరు శాతం పెరిగిన జూట్ ఎంఎస్‌పీ

కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)ను మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే 2025-26 సీజన్‌లో రా జూట్ (ముడి జనపనార) ఎంఎస్‌పీని ఆరు శాతం పెంచింది. అంటే క్వింటా ధర రూ.315 పెరిగి రూ.5,650కు చేరింది. ప్రధాని మోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాలపై కేంద్ర కేబినెట్ కమిటీ బుధవారం భేటీ అయింది. కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్ నిర్ణయాలను సమావేశం అనంతరం విలేకరులకు కేంద్రమంత్రి పీయుష్ గోయల్ వెల్లడించారు. కోవిడ్ సమయంలో ఎన్‌హెచ్‌ఎం ఎంతో ఉపయుక్తంగా ఉందని, దీని ద్వారానే 220 కోట్లకుపైగా టీకాలు ఇవ్వబడ్డాయని చెప్పారు. 12 లక్షల మంది హెల్త్ వర్కర్లతో ముడిపడి ఉన్న ఎన్‌హెచ్‌ఎం పథకాన్ని మరో ఐదేళ్లు పొడిగిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అలాగే 2025-26 మార్కెటింగ్ సీజన్ కోసం ముడి జనపనారా (రా జూట్) ఎంఎస్‌పీని పెంచిందని అన్నారు. తద్వారా సాగుదారులు 66.8శాతం మేర లబ్ధి పొందగలరని చెప్పారు. గతేడాదితో పోల్చితే క్వింటా ధర ఆరు శాతం పెరిగిందన్నారు. కేబినెట్ తాజా నిర్ణయాలతో 1.70లక్షల మంది రైతులు లబ్ధి పొందుతారని, జూట్ సాగుతో ముడిపడ్డ 40లక్షల కుటుంబాలకు ప్రయోజనం ఉంటుందన్నారు. జూట్ మిల్లుల్లో నాలుగు లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని తెలిపారు. కాగా, గతేడాది 1.7లక్షల మంది రైతుల నుంచి జూట్ సేకరించారు. 2014-15లో జూట్ క్వింటాకు రూ.2,400 ఉండగా... అది 2025-26లో రూ.5,650కి పెరిగింది. దీంతో క్వింటాకు మద్దతు ధర 2.35 రెట్లు పెరిగినట్లైంది. పంట ఉత్పత్తి వ్యయం కంటే 66 శాతం ఎక్కువగా రిటర్న్ వస్తాయని కేంద్రం చెబుతోంది. వాస్తవానికి జూట్ సాగుదారుల్లో పశ్చిమ బెంగాల్ రైతులే అధికం కాగా అసోం, బీహార్‌లోనూ జనపనారా ఉత్పత్తి చేస్తారు. జూట్ మద్దతు ధరకు కేంద్ర నోడల్ ఏజెన్సీగా జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జేసీఐ) కొనసాగుతుంది. తద్వారా రైతులకు నష్టం వస్తే కేంద్రమే రీయింబర్స్ చేస్తుంది.

యూపీఎస్సీ సివిల్స్ నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నోటిఫికేషన్ బుధవారం విడుదలైంది. అఖిల భారత సర్వీసుల్లో దాదాపు 979 పోస్టుల భర్తీ కోసం సివిల్ సర్వీసెస్- 2025 పరీక్షకు బుధవారం నుంచి ఫిబ్రవరి 11వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ప్రిలిమినరీ పరీక్ష మే 25న జరగనుంది. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)లో మరో 150 పోస్టులకు విడిగా నోటిఫికేషన్ యూపీఎస్సీ విడుదల చేసింది. ఈ పరీక్షకు ఫిబ్రవరి 11వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన విద్యాసంస్థల నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత కలిగి ఉండాలి. అభ్యర్థుల వయసు 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి. ఆయా వర్గాలకు రిజర్వేషన్ల ఆధారంగా మినహాయింపు ఉంది. దరఖాస్తు రుసుం ఓబీసీ, ఇతర అభ్యర్థులు రూ.100 (మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు మినహాయింపు) చెల్లించాలి.

ప్రిలిమినరీ పరీక్ష: ఇందులో 400 మార్కులకు రెండు పేపర్లు ఉంటాయి. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ రూపంలో ఇస్తారు. ప్రశ్నల్లో నెగెటివ్ మార్కులు కూడా ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులను మెయిన్స్ రాసేందుకు అనుమతిస్తారు. మెయిన్స్ పరీక్ష డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. మెయిన్స్‌లో సత్తా చాటిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. తెలుగు రాష్ట్రాల్లో విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం, హైదరాబాద్, వరంగల్ కేంద్రాల్లో ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహిస్తారు.

ఆటో డ్రైవర్‌ను హత్తుకున్న సైఫ్

ముంబై: తనను కాపాడిన ఆటో డ్రైవర్ భజన్ సింగ్‌ను బాలీవుడ్ స్టార్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ స్వయంగా కలిశాడు. ఐదు నిమిషాల పాటు అతడితో మాట్లాడాడు. అతడిని కౌగిలించుకుని ధన్యవాదాలు తెలియజేశాడు. మంగళవారం డిశ్చార్జ్ అవుతున్న సమయంలో లీలావతి ఆస్పత్రిలోనే ఆటో డ్రైవర్ సైఫ్ కలిశాడు. కాగా, సకాలంలో స్పందించిన భజన్ సింగ్‌పై సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓ సంస్థ భజన్ సింగ్‌కు శాలువా కప్పి రూ.11 వేల నగదు బహుమతి అందించి సత్కరించింది. హాస్పిటల్‌లో దిగిన తర్వాతే అతడికి తన ఆటో ఎక్కింది సైఫ్ అనే సంగతి తెలిసిందే. దాంతో ఆటో ఛార్జీ కూడా తీసుకోకుండా భజన్ సింగ్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇదిలా ఉండగా, ముంబై లోని బాంద్రాలో సైఫ్ అలీ ఖాన్‌పై అతడి ఇంట్లోనే దుండగుడు దాడికి తెగబడగా తీవ్రంగా గాయపడిన సైఫ్.. ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో కొన్ని రోజుల పాటు చికిత్స తీసుకున్నాడు. అతడి ఆరోగ్యం కుదుటపడడంతో మంగళవారం డిశ్చార్జ్ అయ్యాడు. క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు.

మాది మధ్యతరగతి మ్యానిఫెస్టో: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండడంతో రాజకీయ పార్టీలు ఓటర్లపై హామీల జల్లు కురిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆమ్ ఆద్మీ పార్టీ 'మధ్యతరగతి మ్యానిఫెస్టో'ను బుధవారం ఆ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విడుదల చేశారు. 'భారతదేశంలో మధ్యతరగతి ప్రజలు పన్నుల భారంతో నలిగిపోతున్నారు. ప్రతిఫలంగా తక్కువ ప్రయోజనాలు మాత్రమే పొందుతున్నారు' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఢిల్లీలో వృద్ధులకు నాణ్యమైన వైద్యం, సంక్షేమాన్ని అందించాలనే లక్ష్యంగానే తాము సంజీవని పథకాన్ని ప్రారంభించామని కేజ్రీవాల్ గుర్తుచేశారు. పన్ను చెల్లింపుదారుల సొమ్మును తిరిగి వారి సంక్షేమానికి వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రజల సొమ్మును వారి ప్రయోజనాలకు వినియోగిస్తే దేశం అభివృద్ధి చెందుతుంది అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. విద్యకు బడ్జెట్‌లో రెండు శాతం నుంచి 10 శాతానికి పెంచడం. ప్రైవేటు పాఠశాలలో ఫీజుల నియంత్రణ. మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేలా ఉన్నత విద్యకు రాయితీలు. ఆరోగ్య బడ్జెట్ 10 శాతానికి పెంచడం. ఆరోగ్య బీమాపై పన్ను ఎత్తివేయడం. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.7 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంపు. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తొలగింపు. సీనియర్ సిటిజన్స్ కోసం మరింత మెరుగైన పింఛను పథకాలు ప్రవేశపెట్టడం. రైల్వేలో సీనియర్ సిటిజన్లకు 50 శాతం రాయితీ కల్పించడం వంటికి మ్యానిఫెస్టోలో పొందుపరిచారు.

ఆరోగ్య శాఖలో రూ.382 కోట్ల అవినీతి

ఆప్ సర్కారుపై కాంగ్రెస్ విమర్శలు

న్యూఢిల్లీ: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) సర్కారుపై కాంగ్రెస్ విమర్శల దాడి పెంచింది. ఆరోగ్యశాఖలో ఆప్ సర్కారు రూ.382 కోట్ల అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ ఆరోపించారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) లీకైన నివేదికలోని వ్యత్యాసాలను ఎత్తిచూపుతూ ఆప్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని పేర్కొన్నారు. అవినీతిపై పోరాటం చేస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్... అదే అవినీతిలో కూరుకుపోయారని దుయ్యబట్టారు. ఢిల్లీ మద్యం పాలసీ కారణంగా ప్రభుత్వానికి రూ.2,026 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కాగ్ నివేదిక పేర్కొందని తెలిపారు. ఆప్ నేతలు తమ అక్రమాలు ఎక్కడ బయటపడతాయో అని అసెంబ్లీలో నివేదికలు ప్రవేశపెట్టకుండా నిలిపివేస్తున్నారని ఆరోపించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో కేంద్రం మంజూరు చేసిన నిధులలో 56 శాతం నిధులను ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి వినియోగించుకోవడంలో ఆప్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఆసుపత్రుల్లో రోగుల కోసం పడకలు పెంచడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఆసుపత్రుల్లో పడకలు, ఇతర సౌకర్యాలను కాగ్ తనిఖీ చేసిందనీ, సిబ్బంది కొరత ఉన్నట్లు గుర్తించిందని చెప్పారు. పాఠశాలలు, కళాశాలల కోసం కేటాయించిన 14 ప్లాట్లను ప్రభుత్వం అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. గత పదేళ్లలో దేశరాజధానిలో కేవలం మూడు ఆసుపత్రులు మాత్రమే నిర్మించారని తెలిపారు. అవి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో శంకుస్థాపన చేసినవేనన్నారు. ఇందిరాగాంధీ ఆస్పత్రి నిర్మాణానికి టెండర్ కంటే రూ.314 కోట్లు అధికంగా ఖర్చు చేశారని, బురారీ ఆస్పత్రికి రూ.41 కోట్లు, మౌలానా ఆజాద్ దంత వైద్యశాలకు రూ.26 కోట్లు అదనంగా ఖర్చు చేశారని మాకెన్ విమర్శించారు.

అంతరిక్షం నుంచి కుంభమేళా చిత్రాలు

ఇస్రో విడుదల

ప్రయాగ్‌రాజ్: కుంభమేళతో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కళకళలాడుతోంది. జనవరి 13న మొదలై ఫిబ్రవరి 26 వరకు జరగనున్న ఈ కార్యక్రమంలో 40 కోట్ల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించనున్నారని అంచనా. ఈ కుంభమేళాకు సంబంధించిన స్పేస్ వ్యూ చిత్రాలను ఇస్రో విడుదల చేసింది. అక్కడ మౌలిక సదుపాయాల కల్పన ఎలా జరిగిందో హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సేకరించిన చిత్రాల్లో వెల్లడైంది. తాత్కాలికంగా నిర్మించిన టెంట్ హౌస్‌లు, తేలియాడే వంతెనల ఏర్పాటుతో కొద్దినెలలకూ... ఇప్పటికీ మధ్య తేడా స్పష్టంగా కనిపిస్తోంది. ప్రయాగ్‌రాజ్‌లో ఏర్పాటు చేసిన శివాలయ పార్క్ ఆ దృశ్యాల్లో కనిపించింది. 2024 ఏప్రిల్ 6వ తేదీ ఫొటోలో ఆ ప్రాంతమంతా ఖాళీగా కనిపించగా... 2024 డిసెంబర్ 22, 2025 జనవరి 10 చిత్రాల్లో వివిధ మౌలిక సదుపాయాలతో పాటు అక్కడి శివాలయ పార్క్ కూడా దర్శనమిచ్చింది. భారతదేశం మ్యాప్‌లా అది కనిపించింది. ఇదిలా ఉంటే... 45 రోజుల పాటు సాగే ఈ మేళా ద్వారా రాష్ట్ర ఆర్థికవ్యవస్థకు రూ.2 లక్షల కోట్ల మేర ఆదాయం సమకూరనుందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. 12 లక్షల మందికి తాత్కాలిక ఉపాధి కూడా లభిస్తుందని తెలిపాయి. 10,000 ఎకరాల్లో కుంభమేళాకు ఏర్పాట్లు జరిగాయని, ఏ సమయంలోనైనా 50 లక్షల మంది నుంచి కోటి మంది పుణ్యస్నానాలు చేసేలా సౌకర్యాలు కల్పించామని సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇప్పటికే వెల్లడించారు.

కర్నాటకలో ట్రక్కు బోల్తా

11మంది మృతి, 15మందికి గాయాలు

బెంగళూరు: కర్నాటకలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 11 మంది మరణించగా, మరో 15 మంది గాయపడ్డారు. కూరగాయలు, పండ్లతో వెళ్తున్న లారీ లోయలో బోల్తా పడింది. ఉత్తర కన్నడ జిల్లా అరబైల్ ఘాట్‌లోని కాగేరి పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం వేకువజామున ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పండ్లు, కూరగాయలతో హావేరి జిల్లా సవనూరు నుంచి కుంటలోని సంతకు వెళ్తున్న లారీలో 40 మందికి పైగా వ్యాపారులు ఉన్నారు. బుధవారం ఉదయం 5.30 గంటల సమయంలో వెనుక నుంచి వస్తున్న వాహనానికి దారి ఇచ్చేందుకు లారీని ఎడమవైపునకు తిప్పాడు డ్రైవర్. దీంతో లారీ అదుపుతప్పి 50మీటర్ల లోతైన లోయలో జారిపోయింది. అందులో ఉన్నవారిలో 10 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన 16 మందిని యల్లాపూర్ తాలూకా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో అనేకమందికి తీవ్ర గాయాలయ్యాయని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.మృతులను ఫయాజ్ ఇమామ్ జమఖండి (45), వసీం (35), ఇజాజ్ ముస్తాకా ముల్లా (20), సాదిక్ భాషా (30), గులామ్ షేష్ జవాలి (40), ఇంతియాజ్ ములకేరి (36), అల్ఫాజ్ జాఫర్, మందక్కి (25), జిలానీ అబ్దుల్ (25), అస్లాం బెన్ని (24)గా పోలీసులు గుర్తించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

తెలంగాణ విద్యుత్ ఇంజనీర్ల డైరీ ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ విద్యుత్ ఇంజనీర్ల సంఘం నూతన సంవత్సర 2025 డైరీ, క్యాలెండర్ని బుధవారం ప్రజా భవన్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నెహ్రూ, ప్రధాన కార్యదర్శి భాస్కర్ తోపాటు రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్తు ఇంజనీర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. పనుల 1999 - 2004 మధ్యకాలంలో నియమాకమైన ఇంజనీర్లు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా జిపిఎఫ్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కేటీపీఎస్ పాల్వంచలో 8 మెగావాట్ల ధర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మించాలని, రామగుండంలో జీన్కో ఆధ్వర్యంలో 800 మెగావాట్ల ధర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాలరాజు, మోహన్‌రావు, డి.శ్రీనివాస్, పాండ్యా, మధుకృష్ణ, వెంకటరమణ పాల్గొన్నారు.

పరిపాలన, అకడమిక్ స్ట్రక్చర్ విధివిధానాలు రూపొందించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కు సంబంధించి పరిపాలన, అకడమిక్ స్ట్రక్చర్ తదితర అంశాలపై విధివిధానాలను రూపొందించాలని ఆమె విద్యాశాఖ కార్యదర్శిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. తెలంగాణ విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల సంస్థ, ఇంజినీరింగ్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను కోరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమై హైకోర్టు భవనాలు, తెలంగాణ భవన్, ఉస్మానియా ఆస్పత్రి, ప్రాంతీయ రింగ్‌రోడ్డు (ఉత్తరం), ఇందిరా మహిళా శక్తి భవనాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తదితర అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఉస్మానియా జనరల్ ఆసుపత్రి భవనాల నిర్మాణం, అకడమిక్ బ్లాక్‌లు, రెసిడెన్షియల్ జోన్‌ల ఏర్పాటు ప్రణాళికలపై సీఎస్ చర్చించారు. 16 ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైందని, మరో ఆరు భవనాల నిర్మాణాలు వారం రోజుల్లో ప్రారంభమవుతాయని ఆమె తెలిపారు. ఈ భవనాలన్నీ సెప్టెంబర్ చివరి నాటికి పూర్తవుతాయని సి.ఎస్ తెలిపారు. తెలంగాణ భవన్ నిర్మాణం, ప్రాంతీయ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ స్థితిగతులపై చర్చించారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస్ రాజు, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదరర్శి క్రిస్టినా జోంగ్తు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

మేకగూడా గ్రామానికి బస్సు సౌకర్యం

ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్

విశాలాంధ్ర - కొత్తూరు: నందిగామ మండలం, మేకగూడ గ్రామానికి గత కొన్నేళ్ళుగా బస్సు సౌకర్యం నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో మాజీ వార్డు సభ్యుడు సూఖ్యా నాయక్ షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఆయా గ్రామాలతో పాటు బుధవారం మేకగూడ గ్రామానికి బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు బస్సును గ్రామంలోకి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మేకగూడ, సంఘీగూడ గ్రామాల్లో బస్సులో ప్రయాణించారు. మాజీ వార్డు సభ్యుడు సూఖ్యా నాయక్ చొరవతో దూసుకల్ మీదుగా జేపి దర్గా, ఇనుముల్ నర్వ, మేకగూడ, సంగిగూడ గ్రామాలకు బస్సు రవాణ సౌకర్యానికి ఎమ్మెల్యే శంకర్ కృషి చేసినందుకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు జంగ నరసింహ యాదవ్, మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, నాయకులు పర్వతాలు, మల్లేష్, కొమ్ము కృష్ణ, కుమార స్వామి గౌడ్, ఖాదర్, బురాన్, హబీబ్, జాఫర్, ఏఎంసి డైరెక్టర్ నరసింహ, మాజీ డిప్యూటీ సర్పంచ్ నరసింహ, సత్తయ్య, శీను, యాదయ్య, నారాయణ, పి కృష్ణ, ఎం నరసింహ, స్థానికులు పాల్గొన్నారు.

ఢిల్లీలో ఇంటింటికీ ప్రచారం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఢిల్లీ ఎన్నికలలో భాగంగా కల్కాజి విధానసభ క్షేత్ర్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నేషనల్ ప్రెసిడెంట్ అల్కాలంబ విజయాన్ని ఆకాంక్షిస్తూ తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచర కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆల్కాలాంబకి చేతి గుర్తుపైన ఓటు వేయాలని నియోజకవర్గం గ్రేటర్ కమ్యూనిటీలో ప్రచారం నిర్వహించటం జరిగింది. ఢిల్లీ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. ప్రజల నుండి ఎక్కువ స్పందన అల్కా లాంబ ఉన్నది కర్ణాటక రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ వచ్చిన విధంగా ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇంచార్జి కోఆర్డినేటర్ నీలం పద్మ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రెసిడెంట్ రాజనోళ్ల లక్ష్మి, స్టేట్ ఉపాధ్యక్షులు మంగన్న, సుగుణ నిర్మలరెడ్డి, అంజలి యాదవ్, నాయిని రజిత, సంతోష, దుబ్బ రూప, క్వాలిటీ రఫియా బేగం, ఎస్కే జాను పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ మండలి క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025 క్యాలెండర్ను బుధవారం మెంబర్ సెక్రెటరీ జి.రవి ఆవిష్కరించారు. టీజీపిసిబి ఎంప్లాయిస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ వాత్సవ్, ప్రధాన కార్యదర్శి కృపానంద్, చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ బి.రఘు, ఉన్నతాధికారులు సత్యనారాయణ రావు, హనుమంత్ రెడ్డి, వినయ్ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మంత్రి దామోదర రాజనర్సింహ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని, అర్హత ఉన్న ప్రతి పేద వానికి సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జీ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.బుధవారం మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలం కొత్త కప్పెట గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇందిరమ్మ పేరుతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. గతంలో మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అధికారం లోకి రాగానే వాగ్దానాలు నెరవేరుస్తూ పోతున్నామని అన్నారు.మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు అర్.టి.సి.బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, గృహలక్ష్మి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీల కతీతంగా అన్ని వర్గాలకు అర్హత ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్‌లు అందచేస్తామన్నారు. గత 5 సంవత్సరాలుగా పెన్షన్‌లు,10 సంవత్సరంల నుండి ఇండ్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం అర్హత ఉన్న నిరు పేదలకు ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి త్వరలో భూమి పూజ చేస్తామని అన్నారు. ఉపాధి హామీలో 2023-24 సంవత్సరంలో 20 దినాలు పనిచేసిన జాబ్ కార్డ్ కలిగిన భూమి లేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సంవత్సరంకు రూ.12వేలు అంద చేస్తామని అన్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు సమర్పించని వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు గతంలో ఇచ్చిన దరఖాస్తులు, కొత్తగా వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అర్హత కలిగిన అందరికీ మంజూరు చేస్తామని అన్నారు. తొలుత గ్రామ సభకు హాజరైన దరఖాస్తుదారులతో మంత్రి మాట్లాడి వారు ఏ పథకాలకు అవసరం ఉంది ఏ ఏ పథకాలకు దరఖాస్తు చేసుకున్నారు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన ప్రకారం ఆరు గ్యారంటీ లు అమలు చేస్తున్నట్లు, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహిళలకు అర్.టి.సి బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ 10 లక్షలకు పెంచి ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రులలో చికిత్స, 500 రూ.లకు సిలిండర్ అమలు చేసినట్లు తెలిపారు. స్థానిక సంస్థల కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, అర్.డి.ఓ నవీన్, నియోజక వర్గ ప్రత్యేక అధికారి డి.ఎఫ్.ఓ సత్య నారాయణ, మండల ప్రత్యేక అధికారి వేణు గోపాల్, డి.అర్.డి.ఓ.నర్సింహులు, గృహ నిర్మాణ పి.డి.వైద్యం భాస్కర్, మండల, గ్రామ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా చెత్త సేకరణ నిర్వహణ : మంత్రి సీతక్క

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఐటీసీ సంస్థ సహకారంతో బుధవారం ప్రారంభమైన ఎస్‌డబ్ల్యుఎం (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) మిషన్ ప్రారంభోత్సవం పీర్జాదిగూడ నగరపాలక సంస్థ మేయర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు దనసరీ అనసూయ (సీతక్క) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా మరియు పట్టణీకరణను దృష్టిలో ఉంచుకుని చెత్త నిర్వహణలో ఆధునిక పద్ధతులు అనుసరించాలి అని సూచించారు. ఇంటింటి నుండి వ్యర్థాలను సమర్థవంతంగా సేకరించి, పునర్వినియోగం చేయగలిగే విధంగా వర్గీకరించడం అత్యవసరమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వర్యులు, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి, మాజీ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రరెడ్డి, పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్, బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ త్రిలేశ్వర్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మేడిపల్లి ప్రెస్‌క్లబ్ డైరీని ఆవిష్కరించిన మంత్రి సీతక్క

తెలంగాణ రాష్ట్రములోని జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. బుధవారం ఉదయం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని దేవి కన్వెన్షన్ హాల్ లో జరిగిన మేడిపల్లి మండల ప్రెస్ క్లబ్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రములో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇండ్లకు ప్రజాపాలన వచ్చాకా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. సమాజంలో నాలుగో స్థంభమైన మీడియాకు మా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కల్వూరి ఎల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శు గడ్డమీది బాల్ రాజు గౌడ్, డీ.వెంకట్ రాంరెడ్డి బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్లు తోటకూర అజయ్ యాదవ్, అమర్ సింగ్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్ర రెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చిర్ర శ్రీధర్ రెడ్డి, కార్పొరేటర్లు, క్లబ్ కార్యవర్గ సభ్యులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందించే రైతుభరోసా, ఇందరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అయిన సంక్షేమ పథకాల అమలు ప్రక్రియలో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతల పల్లి మండలంలో కోల్తూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు కంగారు పడవద్దని, ఇప్పుడు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి తహసీల్దార్ నర్సింహారెడ్డి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు : ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని అర్హులైన అందరికీ ప్రభుత్వ ఫలాలు అందుతాయని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ పట్టణం లోని వార్డు నెంబర్ 07, పద్మావతి కాలనీలోని మహిళా సంఘం కమ్యూనిటీ హాల్ దగ్గర జరిగిన ప్రజాపాలన వార్డు సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రజల నుంచి దరఖాస్తులను ఆయన స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన అర్హులైన వారిని గుర్తించేందుకు పట్టణాల్లో ప్రజాపాలన వార్డు సభలు, గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రేషన్ కార్డుకు సంబంధించి గతంలో దరఖాస్తు చేయని వారి నుంచి గ్రామసభ ద్వారా దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకం గా అమలు చేయనున్న ఈ నాలుగు పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి అపోహలు, అనవసర ఆందోళన అవసరం లేదని ఆయన తెలియజేశారు. జాబితాలో లేనివారు వార్డు సభల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని , వీలుపడని వారు ఈనెల 26 తర్వాత ఎప్పుడైనా మండల కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాలకు వెళ్లి సంబంధిత పత్రాలను జత చేస్తూ దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. అలాగే 19, 20, 13,28, వార్డుల్లో నిర్వహించిన వార్డు సభలో పాల్గొన ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంలో కేవలం మన మహబూబ్ నగర్ నియోజకవర్గంలో 1500 డబుల్ బెడ్రూం ఇండ్లు మాత్రమే వచ్చాయని, కానీ ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు పథకం కింద ప్రతి సంవత్సరం 3500 ఇందిరమ్మ ఇండ్లు వస్తాయన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కౌన్సిలర్ అనంత రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు అర్షద్ అలి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు కిషన్ నాయక్, వాజిద్, శివ శంకర్ , కౌన్సిలర్లు , మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ ఘన్సీరాం తదితరులు పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయాలకు ఢిల్లీ ప్రజలు బుద్ధిచెప్పాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఢిల్లీలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలకు బిజెపి 2వ సారి ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేస్తూ కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యా అందిస్తానని ప్రకటించింది. మొదట ప్రకటించిన మ్యానిఫెస్టోలో కూడా అనేక ఉచితాలు ప్రకటించటం జరిగింది. ఉచితాలపై బిజెపి కేంద్ర పార్టీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అనేక సందర్భాల్లో తమ వ్యతిరేకతను ప్రకటించటం జరిగింది. ఉచితాల మూలంగా దేశ ఆర్థిక వ్యవస్థ నష్టపోతుందని వాపోయారు. జాతీయ బిజెపి పార్టీ వేరు ఢిల్లీ బిజెపి పార్టీ వేరా..? అనే ప్రశ్నకు బిజెపి సమాధానం చెప్పాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.యస్.బోస్ డిమాండ్ చేశారు. తమ పార్టీ ఉచితాలు ప్రకటిస్తే సబబు, ఇతర పార్టీలు ప్రకటిస్తే తప్పు అని చెప్పటం బిజెపి ద్వంద విధానానికి, మోసపూరిత రాజకీయాలకు ప్రతీక అని అన్నారు. బిజెపి జాతీయ పార్టీగా ఉండి అధికారం చెలాయిస్తూ కేజీ టు పీజీ ఉచిత విద్యా ఢిల్లీ ప్రజలకు మాత్రమే ఇస్తామని ప్రకటించటం ఆ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని, నీతిమాలిన రాజకీయాలకు ప్రధాన కేంద్రంగా బిజెపి పనిచేస్తుందని, అవినీతిని అంతం చేస్తామని, నల్లధనాన్ని రూపుమాపుతానని ప్రగల్భాలు పలికి ఆచరణలో దేశ ప్రజలను మోసం చేసిందని, మోస పూరిత ప్రకటనలకు, నీతిమాలిన రాజకీయాల కు ఆలవాలమైన బిజెపికి ఢిల్లీ ప్రజలు బుద్ధి చెప్పాలిలని, ఢిల్లీకి పూర్తి రాష్ట్ర ప్రతిపత్తిని కల్గించటానికి నిరకరించిన బిజెపిని ఢిల్లీ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసిన వైద్య ఆరోగ్య అధికారి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి. రఘునాథస్వామి పలు ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్శనలో భాగంగా, భగత్‌సింగ్ నగర్ (చెంగిచెర్ల)లోని బస్తీ దవాఖాన, మెడిపల్లిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, నారాపల్లిలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లను పరిశీలించారు. ఈ సందర్శనలో, గర్భిణీ స్త్రీల పరీక్షలు, ప్రసవాలు, ల్యాబ్ సేవలు, రోగ నిర్ధారణ, ఫార్మసీ స్టాక్‌లు, టీకాలు, మందుల నిల్వలను సమీక్షించారు. అదనంగా, ఆపరేషన్ థియేటర్లు, లేబర్ రూమ్‌ల పనితనం అవసరాలను పరిశీలించారు. డాక్టర్ రఘునాథస్వామి అన్ని వైద్య అధికారులకు సమయపాలన కచ్చితంగా పాటించాల్సిందిగా ఆదేశించారు. అలాగే, మందుల నిల్వలను పర్యవేక్షించి, జిల్లా డ్రగ్స్ స్టోర్ నుండి అవసరమైన మందులను సేకరించాల్సిందిగా ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తరపున ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ద్వారా అందించే అన్ని ప్రయోజనాలు ప్రజలకు చేరేలా చూడాలని, ఏదైనా నిర్లక్ష్యం కనబడితే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదు : మేయర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కల్తీ, అపరిశుభ్ర ఆహార పదార్థాలు తయారీ చేసి ప్రజల ఆరోగ్యం, ప్రాణాలతో చెలగాటమాడితే సహించబోమని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హెచ్చరించారు. బుధవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కూకట్ పల్లి జోన్ పరిధిలోని కుతుబుల్లాపూర్ సర్కిల్ సూరారం ప్రాంతంలో గల పలు పిండి వంటల, స్వీట్స్ తయారి కేంద్రాలను ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల సందర్భంగా మేయర్ ఆయా షాప్‌లో తయారు చేసి అమ్మకానికి ఉన్న నాణ్యతలేని సరుకులను, అపరిశుభ్ర వాతావరణములో తయారు చేస్తున్న పిండి వంటకాలు, ఆహార పదార్థాల తయారీలో కనీస నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడాన్ని గుర్తించారు. పిండి, పప్పులు, తదితర సరుకుల పై తయారు తేదీ, ఎక్స్పైరీ తేదీ లేకపోవడాన్ని గమనించి, నిల్వలకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘనల పై ప్రశ్నించారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, కాలపరిమితి ముగిసిన సరుకులు నిల్వ చేయడం వంటి అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం మా ప్రాధాన్యతని అన్నారు. నాణ్యతలేని ఆహార పదార్థాలు కొని తింటూ పిల్లలు, పెద్దలు ఫుడ్ పాయిజనింగ్ కు, అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు బయటి ఫుడ్ తినేటప్పుడు ఆలోచించాలని సూచించారు. నాణ్యతలేని సరుకుల అమ్మకంపై జిహెచ్ఎంసి కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన ఆహార పదార్థాల అమ్మకాన్ని నిరోధించేందుకు ఈ తనిఖీలు కొనసాగుతాయని మేయర్ తెలిపారు. ఇలాంటి వస్తువులు వినియోగించుకునే సందర్భంలో ప్రజలు ఆలోచించాలన్నారు ముఖ్యంగా చిన్న పిల్లలు వ్యాధులు ప్రభలె అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఈ విషయంలో తల్లి దండ్రులు ఆలోచన చేయాలన్నారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్ హెల్త్ పంకజ, జిహెచ్ఎంసి ఫుడ్ సహాయ కంట్రోల్ ముత్యం రాజు ఫుడ్ సేఫ్టీ అధికారి లక్ష్మి కాంతం చీఫ్ సి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వేకీల్ పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాగం నాగేందర్ యాదవ్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: ఆంధ్రప్రదేశ్ తిరుమల- తిరుపతి దేవస్థానం శ్రీశ్రీశ్రీ తిరుమల వేంకటేశ్వర స్వామి వారిని తన కుమారులు రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్, రాగం అభిషేక్ యాదవ్‌తో కలిసి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు కార్పొరేటర్‌ని ఆలయ ప్రాంగణంలో శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు కలకాలం సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండేలా దీవెనలు అందించాలని, అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని ఏడుకొండల వెంకటేశ్వరున్ని వేడుకున్నట్లు తెలిపారు.

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా



విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని, సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ ఆగంపాండు ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలో 16 వ డివిజన్ కార్పొరేటర్ ఆగంపాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో అధికారులు గ్రామసభ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు పలు సంక్షేమ పథకాల దరఖాస్తులను కార్పొరేటర్ ఆగంరాజు ముదిరాజ్ అధికారులతో కలిసి పరిశీలించి, వాటిని అధికారులకు అందజేశారు. కార్పొరేటర్ ఆగంపాండు మాట్లాడుతూ అర్హులైన ప్రజలందరికి ప్రభుత్వం సంక్షేమ ఫలాలు తప్పక అందుతాయని, ప్రజలందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఏదైనా సందేహం ఉంటే తనను సంప్రదించాలని సూచించారు. అధికారులు,సిబ్బంది మాజీ వార్డు సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Form No-3 (see Regulation-15 (1) (a)
BEFORE THE DEBT RECOVERY TRIBUNAL AT BANGALORE
O. A. No. 435 / 2021 DRT-2

Bank of Baroda, Sindhanur Branch, Gangavathi Road, Sindhanur-584 128, by its Manager Mr. Avinash Mannal ...**APPLICANT**

-V/s-

1. Mrs. Veera Venkata Lakshmi, W/o Late Sathyanarayana, Aged 47 years, # No 8-2-460/42, Road No 4, Banjara Hills, Hyderabad, Andra Pradesh-500 082 ... **DEFENDANTS**

SUMMONS/NOTICE to DEFENDANT/S No 01 ISSUED UNDER RULE 23 (VIII) OF THE DEBTS RECOVERY TRIBUNAL (PROCEDURE) RULES 1993 BY WAY OF PAPER PUBLICATION:

WHEREAS the applicant has instituted an application U/S 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 against you for the recovery of sum of **Rs.46,18,560-00 (Rs Forty six lakhs eighteen thousand and five hundred and sixty only)** mentioned therein together with current and future interest and other reliefs. The above defendant therefore, hereby directed before the Tribunal in person or through an advocate or through authorized agent in support of the defense to show cause ***within 30 days*** from the date of publication or on **28.03.2025 at 10.30 AM** as to why relief's prayed for should not be granted.

Take notice that, in case of default the application will be heard and determined in your absence.

Given under my hand and the seal of this Tribunal on this 5th day of November 2024.

BY THE ORDER OF THE TRIBUNAL
Sd/- **REGISTRAR**
DEBT RECOVERY TRIBUNAL

త్వరలో స్థానిక ఎన్నికలు : మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : త్వరలోనే స్థానిక ఎన్నికలో నిర్వహిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. విదేశీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి వచ్చాక బీసీ కమిషన్ రిపోర్ట్ ఆమోదం అవుతుందని ఇప్పటికే రిపోర్ట్ దాదాపుగా పూర్తి అయిందని తెలిపారు. వీలైనంత త్వరగా సర్పంచ్ ఎన్నికల నిర్వహిస్తామని పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి సీతక్క విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామసభలో కావాలనే బీఆరెస్ రాదంతం చేస్తుందని పేర్కొన్నారు. మంగళవారం మొత్తం 3410 గ్రామాల్లో గ్రామసభలు జరిగగా కేవలం 142 గ్రామాల్లోని ఆందోళనలు జరిగాయని స్వయంగా బీఆరెస్ పత్రికలోనే వ్రాసారని స్పష్టం చేశారు. అంటే

కేవలం నాలుగు శాతం గ్రామాల్లోనే కొంత గొడవ జరిగిందని, అది కూడా టీఆర్ఎస్ వాళ్ళు ఉద్దేశ పూర్వకంగా చేశారని ఆరోపించారు. పదేళ్ల తర్వాత గ్రామ సభలు కాబట్టి ప్రజలు సంతోషంగా ఉన్నారని, గ్రామ సభల్లోనే అర్హులని గుర్తిస్తున్నామని చెప్పారు. గతంలో ఎంఎల్ఏ లు చెప్పిన వాళ్ళకే పథకాలు వచ్చేవని, ఫామ్ హౌస్ లో, ఎమ్మెల్యేలు ఇండ్లలో కూర్చొని లబ్దిదారులను ఎంపిక చేశారని వివరించారు. మా ప్రజా ప్రభుత్వంలో గ్రామ సభల్లోనే ప్రజల సమక్షంలో లబ్దిదారుల ఎంపిక జరుగుతుందని, ప్రజాస్వామ్యబద్ధంగా లబ్దిదారులను గుర్తిస్తుంటే కావాలని టిఆర్ఎస్ రాద్ధాంతం చేస్తుందని మండిపడ్డారు. బీఆరెస్ హయాంలో ఓట్లప్పుడే పథకాలు అరకొరగా ఇచ్చేవారని, కానీ ప్రజా అవసరాలు, ఆర్థిక వనరుల ను బట్టి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. పదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని అందుకే ఉద్దేశ పూర్వకంగా బీఆరెస్ గొడవలు చేస్తుందని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్ మాటలు నమ్మి కొందరు ఆర్థిక సామాజిక రాజకీయ కుల సమగ్ర ఇంటింటి సర్వేలో పాల్గొనలేదని, ఇప్పుడు వాళ్ళకి పథకాలు రావనే ఆందోళన ఉందన్నారు. ఎ ఒక్క అర్హుడు నష్టపోకుండా ప్రజాపాలన దరఖాస్తులు తీసుకున్నామని, గ్రామ సభల్లో కూడా దరఖాస్తులు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బిఆర్ఎస్ చేత కాని వల్లే సమస్యలు వస్తున్నాయని, పది సంవత్సరాల్లో అన్ని సాఫీగా చేస్తే ఇన్ని సమస్యలు ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. వందల ఎకరాలు ఉన్న భూస్వాములకు రైతుబంధు ఇచ్చారు కానీ రెక్కల కష్టాన్ని నమ్ముకున్నా కూలీలకు ఎలాంటి సహాయం చేయలేదన్నారు. అయితే ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇతర పథకాలు ఇస్తామన్నారు. టిఆర్ఎస్ పాలనకు ముందు కాంగ్రెస్ హయాంలో తెలంగాణ ప్రాంతం అభివృద్ధి చెందలేదా అని నిలదీశారు. ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు చేసి, ప్రైవేట్ కంపెనీలను ప్రోత్సహించి తెలంగాణ ప్రాంత

ఇష్టానుసారంగా విద్యుత్ అంతరాయంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వసంతపురి సెక్షన్‌లో అనధికార అనధికార కోతులను విధిస్తన్న ఏ.ఈ పై చర్యలు తీసుకోవాలని మల్కాజ్గిరి సర్కిల్ పరిధిలోని వసంతపురి సెక్షన్ పరిధిలోని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఏయ్ సొంత ప్రయోజనాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారికంగా చెట్ల కటింగ్ చేసే సమయంలో చేయాల్సి ఉండగా ఆ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి చెట్లు కటింగ్ చేయకపోవడం, అప్రకటిత కోతలు విధిస్తూ చెట్లు కడిగిన చేయడం ఇక్కడ పరిపాటిగా మారుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపార్ట్మెంట్ అసోసియేషన్లు ఇతర ప్రజాప్రతినిధులు చెప్పారంటూ వ్యక్తిగతంగా విద్యుత్ అంతరాయం కలిగిస్తూ ప్రజలకు ఇబ్బందులు గురిచేస్తున్న పరిస్థితి వసంతపురి సబ్ స్టేషన్‌లో నెలకొంటుందని పలువురు పేర్కొంటున్నారు. బుధవారం గంటకు పైగా అనధికార విద్యుత్ కోత విధించి వాణి నగర్ లోని ఐశ్వర్య అపార్ట్మెంట్ వద్ద చెట్లు నరికే కార్యక్రమం శ్రీకారం చుట్టారు. అప్రకటిత విద్యుత్తు కోతపై దీని కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదని ఆయన పేర్కొనడం గమనార్హం. 11 కె.వి మెయిన్ లైన్ నిలిపివేయడానికి ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోలేదు. ఇటీవలనే ఈ ప్రాంతంలో విద్యుత్ అధికారులు ట్రీ కటింగ్ కూడా చేశారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇలాంటి అధికారులపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అలకనంద కాదు... అలక దందా ఆసుపత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నిబంధనలకు విరుద్ధంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లకు పాల్పడిన సరూర్ నగర్ డాక్టర్స్ కాలనీ లోని అలకనంద మల్టీ స్పెషలిటీ ఆసుపత్రి వైద్యులు, యాజమాన్యం పై క్రిమినల్ కేసు నమోదు చేసి రిమాండ్ చేయాలని, ప్రజల ప్రాణాలను సొమ్ము చేసుకుంటున్న ఆస్పత్రులపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని విడనాడాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో అలకనంద ఆసుపత్రి వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ లు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్న ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలకనంద మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ యాజమాన్యం 9 పడకలకు మాత్రమే అనుమతి పొంది, 30 పడకలను అక్రమంగా నిర్వహిస్తున్నా రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎందుకు చర్యలు చేపట్టలేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నిన్న బాధిత పేషెంట్ లకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేస్తే కానీ స్పందించని అధికారుల వైఖరి చూస్తుంటే ఏ స్థాయిలో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో పరోక్షంగా కుమ్మక్కు అవుతున్నారో అర్థం చేసుకోవాలని వారు అన్నారు. ఇతర రాష్ట్రాలు తమిళనాడు, కర్నాటక నుండి లైసెన్స్ లేని జూనియర్ వైద్యులతో ఈ సర్జరీలు చేస్తున్నారని, ప్రజల ప్రాణాలతో దందా చేస్తున్న ఇలాంటి ఆసుపత్రులపై ఉక్కు పాదం మోపాలని డిమాండ్ చేశారు. అలకనంద ఆసుపత్రి వైద్యులు, యాజమాన్యంను కఠిన సెక్షన్‌లు విధించి, రిమాండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాలకృష్ణ, ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి మధు, పి.శివ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి వీరేశ్, వెంకటేష్, సందీప్, హరి కృష్ణ, గణేశ్, భాను, ప్రకాష్, పాండు, భగత్ సింగ్, సైదులు, శ్రవణ్, కళ్యాణ్, అనీల్ కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ కు వినతిపత్రం అందజేశారు. జిహెచ్ఎంసి నిబంధనలు ఉల్లంఘించి యథేచ్ఛగా నడుస్తున్న ఆస్పత్రులపై చర్యలు తీసుకునేలా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడాలని వారు విజ్ఞప్తి చేశారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తాం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : అర్హులైన ప్రజలందరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజా ప్రభుత్వం ప్రజాపాలన వార్డు సభలలో భాగంగా 11వ డివిజన్, రాజీవ్‌గాంధీ నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.ఎం.సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకొని వారి ద్వారా పలు దరఖాస్తులను అందుకొని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలెవ్వరూ అధైర్యపడొద్దని మనం ప్రజా ప్రభుత్వంలో ఉన్నామని, ఏ సమస్య ఉన్న మీకు మేమున్నాం ఇప్పటివరకు రాని వారికి ఇందిరమ్మ ఇల్లులు, రేషన్ కార్డులు అర్హులైన అందరికీ వస్తాయని, వచ్చేంతవరకు మళ్లీ మళ్లీ ఇదే ప్రక్రియ జరుగుతూనే ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లీడర్ నగేష్ చారి, 11వ డివిజన్ అధ్యక్షులు ఏలూరి సత్య నాని, 12వ డివిజన్ అధ్యక్షులు కృష్ణమరాజు, 14వ డివిజన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, పంగా శ్రీనివాస్‌రావు, వర్మ రాజు, ఎర్రోళ్ల విష్ణు, సాయిరాజ్, శ్రీనివాస్ గౌడ్, విజయ్‌కుమార్, ఫరీద్, షకీల్, అలీ, సురేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

ఘనంగా రెబల్ స్టార్ కృష్ణంరాజు ప్రతిభా పురస్కారాలు

విశాలాంధ్ర - బషీర్ బాగ్: మాజీ కేంద్ర మంత్రి కృష్ణంరాజు జయంతిని పురస్కరించుకొని ఎఫ్టీపీసీ ఇండియా, తెలుగు సినిమా వేదిక సంస్థలు సినిమా, విద్య, వైద్య సామాజిక రంగాలకు చెందిన పలువురిని రెబల్ స్టార్ కృష్ణంరాజు ప్రతిభా పురస్కారాలను బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. సందర్భంగా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య జంగా, విజయ్ వర్మ పాకలపాటిలు మాట్లాడుతూ విద్యా, వైద్య సామాజిక రంగాలను ప్రోత్సహించిన కృష్ణంరాజు ఆశయాలు రాబోయే తరాలు గుర్తించుకొనేలా ఈ అవార్డుల కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది నిర్వహించిన కార్యక్రమంలో దుబాయ్‌కు చెందిన ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు జితేంద్ర మైథలానేని ప్రత్యేకంగా సత్కరించామని తెలిపారు. ప్రభుత్వ విప్ రామచంద్రులు నాయక్, ఘజల్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ, నటుడు గౌతమ్. రాజు,శివ కృష్ణ, కృష్ణుడు, హెచ్ఆర్ఓ వరల్డ్ చైర్మన్ నేమ్సింగ్ ప్రేమి, విచ్చేసి పలురంగాల వారికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. బాలీవుడ్ నటీమణులు ధని బోస్, మోక్ష, అనీషా ముఖర్జీ, నేహాషాలకు ప్రత్యేక పురస్కారాన్ని అందజేశారు. ఎఫ్ టీపీసీ ఇండియాకు అమెరికన్ క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికేషన్ రావడంపట్ల సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు.

అర్హులందరికీ లబ్ధి జరిగేలా కృషి చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో బి.ఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ, ఇళ్లు తెల్ల రేషన్ కార్డుల పంపిణీ పారదర్శకంగా జరిగే విధంగా, అర్హులందరికీ లబ్ధి చేకూరేలా, పక్కా ప్రణాళికతో అధికారులను నిలదీయాలని, అదేవిధంగా దరఖాస్తు చేసుకున్న కొంతమంది పేదల పేర్లు జాబితాలో పొందుపర్చలేదని, కేవలం 5 శాతం లబ్దిదారులకే అంటే నూటికి అయిదు మంది చొప్పున లబ్ధిదారులను ప్రభుత్వం గుర్తించడాన్ని గట్టిగా ప్రశ్నించాలని, ప్రజలతో కలిసి అధికారులను ప్రశ్నించాలని కార్యకర్తలు నాయకులకు సూచించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు అధికారులను తప్పుదోవ పట్టించి జాబితాను తారుమారు చేసే ప్రయత్నం చేస్తున్నారని, అధికారులు పారదర్శకంగా పని చేయాలని, లేకుంటే ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి అధికారులపై చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి బూతులో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి జాబితాలో లేనివారి పేర్లను ఎందుకు తొలగించారో ప్రజల సమక్షంలోనే అధికారులను నిలదీయాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే సూచించారు ఈ కార్యక్రమంలో మరో కార్పొరేటర్లు స్థానిక టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయశాంతి రెడ్డి రావుల అంజయ్య, కరంచంద్, జగదీష్ గౌడ్, బద్దం పరశురామ్ రెడ్డి, మురుగేశ్, అమీనుద్దీన్, లక్ష్మణ్ యాదవ్, వసాగోని శ్రీనివాస్ గౌడ్, సిద్ది రాములు, డోలి రమేష్, చిన్న యాదవ్, డిల్లి పరమేశ్, శోభన్ బాబు, శేఖర్ గౌడ్, తుపాకుల జనార్దన్, సంతోష్ నాయుడు, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, సురేష్ ఉన్నారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విశాలాంధ్ర,షాద్ నగర్,రూరల్: రోడ్డు భద్రతా నియమాలను పాటించడం వలన ప్రమాదాలను నివారించవచ్చని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. విద్యార్థులు, పోలీసులు, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా వేలాదిమంది విద్యార్థిని విద్యార్థులతో భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. షాద్ నగర్ పట్టణ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, సీఐ విజయ్ కుమార్, ఎంవిఐ వాసు, ఎంఈఓ మనోహర్ తదితరుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల హై స్కూల్ నుండి ర్యాలీని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించి పాదయాత్రగా వేలాదిమంది విద్యార్థులతో చౌరస్తాకు చేరుకున్నారు. విద్యార్థులతో చౌరస్తాలో ప్రదర్శన నిర్వహించి రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ వాహనంలో ప్రయాణించేటప్పుడు కచ్చితంగా గుర్తుపెట్టుకోవాల్సిన అంశాలలో హెల్మెట్, సీటు బెల్ట్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకుండా జాగ్రత్తలతో పాటు ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని అన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించడం సురక్షితమన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, విశ్వం, లక్ష్మణ్ కుమార్, చెన్నయ్య, బాలరాజు గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, అగ్గనూర్ బస్వం, రఘునాయక్, భార్గవ రెడ్డి, జమ్రుద్ ఖాన్, మహబూబ్, ముబారక్ ఖాన్, శ్రీను నాయక్, సయ్యద్ ఖదీర్, ఆశన్న గౌడ్, అశోక్, విద్యార్థులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన, గ్రామ సభలో ఎమ్మెల్యే

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు,రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులను అర్హులైన ప్రతి ఒక్క లబ్దిదారుడికి అందజేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందని తెలిపారు. గ్రామ సభ అనంతరం గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామ సభకు విచ్చేసిన ఎమ్మెల్యే వీళ్ళపల్లి శంకర్ ను అధికారులను, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్ శ్రీకాంత్ రెడ్డి, బాలరాజ్ గౌడ్ తహసిల్దార్ పార్థిసారధి, ఎంపీడీఓ, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొంపల్లిలో కొనసాగుతున్న గ్రామ సభలు

విశాలాంధ్ర-దుండిగల్ : మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు రెండవ రోజు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా కొంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సన్న శ్రీశైలం యాదవ్ ఆధ్యక్షతన బుధవారం 7,8,9,10,11,12 వార్డు నందు వార్డు సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ శ్రీహరి ప్రభుత్వ మార్గదర్శకాలను వార్డు సభ్యులకు వివరించి, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా దరఖాస్తు దారుల జాబితాన్ని చదివి వినిపించారు. జాబితాలో లేని వారి నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్‌లు సూర్యకల, ఆదిరెడ్డి రాజిరెడ్డి, రజినీ కృష్ణ వేణి, శిరీష, ప్రజలు మున్సిపాల్ అధికారులు పాల్గొన్నారు.

గీతవృత్తిదారులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గీత వృత్తిదారులకు అధికారంలోకి వచ్చే ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఎక్స్‌గ్రేషియాను రూ.5 లక్షల నుండి 10 లక్షలకు, వృత్తిపెన్షన్‌గా రూ. 4000, కార్పోరేషన్‌కు రూ. 500 కోట్ల నిధులు కేటాయించడం, మెడికల్ బోర్డు విధానాన్ని రద్దు చేయడం, తదితర హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ రాష్ట్ర కేంద్రంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిల్ గౌడ్ మాట్లాడుతూ గీత వృత్తి రక్షణకు, అభివృద్ధికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సంఘం సెంట్రల్ కోఆర్డినేటింగ్ సెక్రటరి బొమ్మగాని నాగభూషణం మాట్లాడుతూ ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినందుకు హర్షినీయమైనప్పటికీ అందులో గీత వృత్తిదారులకు శిక్షణా ఉపాధి కల్పన కోసం కోర్సులను ప్రవేశపెట్టాలని కోరారు. ఉపాధ్యక్షులు కెవిఎల్ బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఎల్ నాయకులు బత్తిని రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: కొండాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తగూడా విలేజ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం 2025 కార్యక్రమంలో భాగంగా జరిగిన అవగహన ర్యాలీని గౌరవ కొండాపూర్ ఆర్టీ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఏంఈఓ వెంకటయ్య, మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్ ముదిరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. గాంధీ మాట్లాడుతూ రహదారి భద్రతా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషకరమైన విషయం అని, ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రతపై అవగహన కలిగి ఉండాలని, రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మిమ్మల్ని చైతన్యం చేయడానికే ఈ రోడ్డు భద్రత మాసోత్సవం అవగహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. నాయకులు ఉట్ల కృష్ణ, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, చాంద్ పాషా, ఉట్ల దశరథ్, శ్రీనివాస్ చౌదరి, తిరుపతి, నర్సింహ సాగర్, సత్యం గౌడ్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధి పనులకు ఆటంకం

విశాలాంధ్ర-దుండిగల్: మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతోనే అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుందని స్థానిక కౌన్సిలర్ జక్కుల కృష్ణ యాదవ్ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ గ్రామం 3వ వార్డు కౌన్సిలర్ జక్కుల కృష్ణ యాదవ్ అభివృద్ధి పనుల నిలిపివేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జక్కుల కృష్ణ యాదవ్ మాట్లాడుతూ గత సంవత్సరం 3 వార్డ్‌లో ఎలక్ట్రికల్ ట్రాన్స్ఫార్మర్, పోల్స్ సిఫ్టింగ్ కొరకు రూ.15 లక్ష్యలు, పెద్ద చెరువు నాలా నిర్మాణానికి రూ.15 లక్ష్యలు, హెచ్‌డిపిపి వాటర్ పైప్‌లైన్ కై రూ.5 లక్ష్యలు, 2022-2023లో ముదిరాజ్ భవన నిర్మాణానికి రూ. 30 లక్ష్యలు అదే విధంగా 2023-24 లో ముస్లిం మైనార్టీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి 40 లక్ష్యలు సుమారు 1.50 లక్ష్యల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి, కౌన్సిల్‌లో తీర్మానం పొందితే ఇప్పటి వరకు టెండర్లు పిలువలేదన్నారు. మున్సిపల్ అధికారులు లోకల్ బాడీ పదవీకాలం ముగుస్తుండడంతో 40 లక్ష్యల రూపాయలతో మున్సిపల్ ఆమోదం పొందిన ముస్లిం మైనారిటీ కమ్యూనిటీ భవన నిర్మాణం పనుల శంకుస్థాపన కార్యక్రమానికి కమిషనర్ సత్యనారాయణను ఆహ్వానించగా, రావడం కుదరదని ఆయన చెప్పడంతో స్వయంగా జక్కుల కృష్ణ యాదవ్ ఆయన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశానని వెల్లడించారు. 3వ వార్డులోనే సుమారు 1.50 లక్షల పనులు అభివృద్ధి పనులు నిలిచిపోవడం బాధాకరమన్నారు. మైనార్టీలకు కమ్యూనిటీ భవనం లేదని, భవన నిర్మాణానికి అధికారుల ఆమోదంతో నే కౌన్సిలర్ జక్కుల కృష్ణ యాదవ్ శంకుస్థాపన చేసారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరిమిడి జ్ఞానం తో పత్రికలలో తప్పుడు స్టేట్మెంట్ లు ఇచ్చి అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అర్హులైవరూ ఆందోళన పడొద్దు...

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇందిరమ్మ సభ కార్యక్రమంలో భాగంగా హాఫీజ్ పెట్ వార్డ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులతో కలిసి హాఫీజ్ పెట్ డివిజన్ కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు జరిగే వార్డు సభల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా తదితర పథకాలు అందేలా ప్రతిఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలింగ్ యాదగిరి గౌడ్, కనకమామిడి నరందేర్ గౌడ్, సత్తార్, సయ్యద్ తహెర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమ నిర్మాణాలకు అడ్డా ఆదిభట్ల...

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీ అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారింది. ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులే కంచే చేను మేసిన విధంగా అక్రమ నిర్మాణదారుల వద్ద వసూళ్లకు పాల్పడుతూ అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ టిసిఎస్ ఎదురుగా శ్రీ మిత్ర వెంచర్‌లో పదుల సంఖ్యలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. ఆదిలోనే అడ్డుకోవాల్సిన మున్సిపల్ అధికారులు నిర్మాణాలు పూర్తయ్యే వరకు మిన్నుకుండి నిర్మాణం చివరి దశలో ఉండగా అక్రమ నిర్మాణం అంటూ నోటీసులతో భయభ్రాంతులకు గురి చేస్తూ నిర్మాణ పనులను అధికారుల అవసరం మేరకు నిలుపుదల చేస్తున్నారు. అప్పుడు చేసేదేమీ లేక నిర్మాణదారులు అధికారులతో బేరాలు కుదుర్చుకొని యధావిధిగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం అక్రమ నిర్మాణాలను సహించేది లేదంటూ ప్రతేక సంస్థలను ఏర్పాటు చేసి చర్యలకు ఉపక్రమిస్తుంటే రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీలో మాత్రం సపరేటుగా పాలన కొనసాగుతుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాల అవినీతిపై స్థానికులు జిల్లా కలెక్టర్, సిడిఎంఏ, అధికారులకు ఫిర్యాదు చేసి, చర్యలు తీసుకోవాలని ఆధారాలతో సహా వినతి పత్రాలు అందజేయడం జరిగింది. ఐనా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడాలకు కొమ్ముకాస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

విశాలాంధ్ర - అమనగల్లు : ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి, మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్ సూచించారు. బుధవారం ఆమనగల్ మున్సిపాలిటీ ఆరో వార్డులో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను వారు కౌన్సిలర్ దివ్య శ్రీకాంత్ సింగ్తో కలిసి ప్రారంభించారు. అనంతరం ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీలో సీసీ రోడ్లు వేగవంతంగా జరుగుతున్నాయని దశల వారీగా అన్ని వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని వారు హామీ ఇచ్చారు. మాజీ జడ్పీటీసీ కండే హరిప్రసాద్, కౌన్సిలర్ విజయ్ కృష్ణ, శ్రీశైలం యాదవ్, చెన్నకేశవులు, కో ఆప్షన్ మెంబర్ శ్రీధర్, బూత్ అధ్యక్షులు గుజ్జరి శ్రీను, ఉపాధ్యక్షులు కామోజీ సాయికుమార్ బిజెపి నాయకులు రామ్ రెడ్డి, శ్రీశైలం యాదవ్లా, శీను, గజ్జి బాలకృష్ణ, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

మేం తలుచుకుంటే కాంగ్రెస్ నాయకులు తిరగలేరు : కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలపై కాంగ్రెస్ గూండాలు చేస్తున్న దాడులపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు. "60 లక్షల మంది సైనికులు ఉన్న కుటుంబం బిఆర్ఎస్ పార్టీ. బిఆర్ఎస్ కార్యకర్తలు తలుచుకుంటే తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు తిరిగే పరిస్థితి ఉండదు. ఖబర్దార్ కాంగ్రెస్ నాయకులు జాగ్రత్తగా ఉండండి" అంటూ కాంగ్రెస్ నాయకులకు హెచ్చరిక జారీ చేశారు. తమ పార్టీ కార్యాలయాలపైకి, ఇళ్లపైకి వస్తామంటే భయపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఇంకోసారి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి చూసినా పార్టీ కార్యకర్తలు ఊరుకోబోరని తేల్చిచెప్పారు. రౌడీ మూకలను వేసుకొని పార్టీ కార్యాలయాలపై దాడి చేసే దరిద్రపు సంస్కృతి తమది కాదని, మాటలతో, విజ్ఞతతో, నిబద్ధతతో ప్రజల కోసం పోరాటం చేసే సంస్కృతి తమదని స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ పార్టీ ఒకటేనని స్పష్టం చేశారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహా స్వామి వారి జన్మనక్షత్రం సందర్భంగా బుధవారం ఉదయం జరిగిన గిరి ప్రదక్షిణలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం యాదాద్రి - భోనగిరి జిల్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ మూసి మురికిమయం కావడానికి కారకులు ఎవరో ప్రజలు గుర్తించాలని, పారిశ్రామిక వ్యర్థాలు మూసిలో కలుస్తుంటే 60 ఏళ్ల రాష్ట్రాన్ని పరిపాలించిన కాంగ్రెస్ ఏం చేసింది? అని ప్రశ్నించారు. మూసి నదిని ప్రక్షాళించడానికి కేసీఆర్ సంకల్పించారని, అందులో భాగంగానే ఎస్టీపీలను ఏర్పాటు చేయడమే కాకుండా గోదావరి నదితో అనుసంధానం చేయాలనుకున్నారని పేర్కొన్నారు. హైదరాబాదుకు దగ్గరలో ఉన్న కొండపోచమ్మ సాగర్ ను వదిలేసి దూరంగా ఉన్న మల్లన్న సాగర్ నుంచి మూసి - గోదావరి అనుసంధానం చేస్తామని ప్రభుత్వం అనడం సరికాదని స్పష్టం చేశారు. మూసిని ఏటీఎంగా మార్చుకొని... వచ్చే డబ్బును ఢిల్లీకి పంపించడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రణాళిక వేశారు" అని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి కేసిఆర్ ఎంతగానో కృషి చేశారని, ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధి, సంక్షేమం కోసం కేసీఆర్ రూ 42 వేల కోట్లను ఖర్చు చేశారని తెలిపారు.

ఇళ్ల కోసం రోడ్డెక్కిన పేదలు

గుంతకల్లులో సీపీఐ అధ్వర్యాన భారీ ర్యాలీ, ధర్నా

అధికారులకు అర్జీల అందజేత

విశాలాంధ్ర-గుంతకల్లు: అనంతపురం జిల్లా గుంతకల్లులో ఇళ్ల కోసం పేదలు రోడ్డెక్కారు. రెంటు సెంట్ల ఇంటి స్థలం కేటాయించడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు అర్జీలు అందజేశారు. సీపీఐ పిలుపు మేరకు బుధవారం గుంతకల్లు పట్టణంలో వందలాదిమంది పేదలు స్థానిక రైల్వే మైదానం, బీరప్ప గుడి నుండి వేర్వేరు ర్యాలీలు చేపట్టి...చివరకు అందరూ కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఇళ్ల స్థలాల కోసం మునిసిపల్ కమిషనర్‌కు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేవరగుడి జగదీశ్ మాట్లాడుతూ 2014-2019 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన పట్టా స్థలాలు పేదలకు అందించాలని, లేదా వారి పేర్లు ఆన్‌లైన్‌లో తొలగించాలన్నారు. 2019-2024 మధ్య జగనన్న లేఅవుట్ లో పేదలకు ఇచ్చిన ఒక సెంటు స్థలాన్ని రెండు సెంట్లకు పెంచాలని, గృహనిర్మాణ శాఖ నుండి బదలాయించిన 39 కోట్ల 90 లక్షల 40 వేల960 రూపాయలు ఎవరి ఖాతాల్లో జమచేశారో తక్షణమే తెలపాలని డిమాండ్ చేశారు. పభుత్వం మంచి ఉద్దేశంతో పేద ప్రజలకు ఉచితంగా ఇళ్ల స్థలాలను కేటాయించినప్పటికీ, అవినీతి అధికారుల వల్ల సక్రమంగా అమలు జరగడంలేదని, పేదలకు ఇళ్ల స్థలాలు అందడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. 2014-2019మధ్యలో ఇచ్చి న ఇంటి పట్టాలు జగన్ ప్రభుత్వం రద్దు చేస్తే... అధికారులు ఆన్‌లైన్ నుంచి వారి పేర్లు తొలగించకపోవడం పేదలకు శాపంగా మారిందన్నారు. ప్రస్తుతం వారు పెట్టుకున్న అర్జీ వెబ్‌సైట్‌లో నమోదు కావడంలేదని.. దీనిపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. 2019-2024మద్యలో జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా కేవలం ఒక సెంటు చొప్పున 32 లక్షల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలే ఇవ్వడం వల్ల పేదలు ఇళ్ల నిర్మాణం చేసుకోలేకపోయారన్నారు. కనీసం ఇప్పుడయినా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన విధంగా పేదలకు వెంటనే ఇంటి స్థలాలు ఇవ్వాలని జగదీశ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్ర స్వామి, పట్టణ కార్యదర్శి ఎస్.గోపీనాథ్, మండల కార్యదర్శి రాము రాయల్, సహాయ కార్యదర్శి రామాంజనేయులు ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి దేవేంద్ర, నూర్ తదితరులు పాల్గొన్నారు.

వీసీల నియామకం గవర్నర్ల చేతికా?

యూజీసీ నిబంధనలు వ్యతిరేకించండి

ముఖ్యమంత్రికి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్డీఏ భాగస్వామిగా ఉన్న చంద్రబాబు ప్రభుత్వం యూజీసీ-2025 తీసుకొచ్చిన ముసాయిదా నిబంధనల్ని వ్యతిరేకించడం ద్వారా విద్యావ్యవస్థ ప్రమాణాలు కాపాడాలని, అందుకోసం శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదింపచేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు బుధవారం ఆయన లేఖ రాశారు. లేఖ ప్రతిని విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌కు కూడా పంపారు. విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతుల నియామకానికి సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ముసాయిదా నిబంధనలు రూపొందించిందని, విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది నియామకం, పదోన్నతుల కోసం కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల నిర్వహణకు చర్యల విషయాల్లో యూజీసీ ముసాయిదా నిబంధనలు అనేక విమర్శలకు తావిస్తున్నాయని రామకృష్ణ తెలిపా రు. అర్హతలేకున్నా అందల మెక్కించేందుకు యూజీసీ ముసా యిదా నిబంధనలు ఆస్కారమిస్తు న్నాయని పేర్కొన్నారు. గతంలో ఉప కులపతుల నియామకానికి సంబం ధించి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సూచనలు చేసి గవర్నర్లకు పంపేవని, రాష్ట్ర ప్రభుత్వానికి గల ఈ అధికారాన్ని నేరుగా గవర్నర్‌కు ఇస్తూ యూజీసీ ప్రతిపాదనలు చేసిందని వివరించారు. ఫలితంగా ఎవరినైనా వీసీలుగా నియమించే ప్రమాదం ఉందని, ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న జేడీ(యూ) పార్టీ అధికార ప్రతినిధి శ్రీరాజీవ్ రంజన్ ప్రసాద్ సైతం యూజీసీ నిర్ణయాన్ని విమర్శించారని, సమాఖ్య స్ఫూర్తికి విఘాతంగా పరిణమించిన యూజీసీ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానాలు చేశాయని గుర్తుచేశారు. 2025 నాటి యూజీసీ నిబంధనల ముసాయిదాను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ కేరళ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించిందని వివరించారు. ప్రతిపాదిత నిబంధనలను సమీక్షించాలని, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యావేత్తలతో సంప్రదించిన తర్వాత కొత్త మార్గదర్శకాలు ప్రవేశపెట్టాలని ఆ తీర్మానంలో కేంద్రాన్ని కోరిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్డీఏలో కీలకభాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వం కూడా యూజీసీ ముసాయిదా నిబంధనలను వ్యతిరేకించాలని చంద్రబాబుకు రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

పరస్పర నిందలు మానండి

ఆధారాలుంటే ఈసీ వద్దకు వెళ్లండి: ప్రధాన పార్టీలకు డి.రాజా హితవు

న్యూఢిల్లీ: ఒకర్నొకరు నిందించుకోవడం మానుకోవాలని, ఆధారాలు ఉంటే ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని మూడు ప్రధాన పార్టీలకు సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా హితవు పలికారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ఆప్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకుల మధ్య మాటల యుద్ధాన్ని దుయ్యబట్టారు. ఎన్నికల వేళ దిగజారుడు రాజకీయాలు ఎందుకంటూ ప్రశ్నించారు. 'ఇది ఎన్నికల సమయం. అందుకే కొన్ని పార్టీలు (ఆప్, కాంగ్రెస్, బీజేపీని ఉద్దేశించి) విమర్శలు, ప్రతి విమర్శలు... ఆరోపణలు, ప్రతి ఆరోపణలతో దుమారం రేపుతున్నాయి. పరస్పరం నిందించుకోవడం పరిపాటిగా మారింది. ఏ పార్టీ వద్దనైనా కచ్చితమైన సమాచారం, ఆధారాలు ఉంటే నేరుగా భారత ఎన్నికల సంఘం లేదా పోలీసులను ఆశ్రయించాలి' అని రాజా సూచించారు. ఆప్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఒకర్నొకరు దూషించుకునే స్థాయికి దిగారని, ప్రజా తీర్పు కోసం వేచిచూద్దామని ఆయనన్నారు. ఇదిలావుంటే, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను 'చునావీ హిందూ' అంటూ బీజేపీ విమర్శిస్తుంటే... రావణుడి వారసులంటూ ఆప్ ప్రతిదాడికి దిగుతోంది. కాగా, ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న ఎన్నికలు జరగనున్నాయి. 8వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఢిల్లీలో ఆప్, బీజేపీ, కాంగ్రెస్ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. 15 ఏళ్లు ఢిల్లీని పాలించిన కాంగ్రెస్ గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఖాతా తెరవలేదు. 2020 అసెంబ్లీ ఎన్నికలను ఆప్ స్వీప్ చేసింది. 70కుగాను 62 స్థానాలు గెలుచుకుంది. బీజేపీ ఎనిమిది స్థానాలను దక్కించుకోగలిగింది.

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా సురేశ్‌కుమార్ బాధ్యతలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎస్.సురేశ్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేయగా ఐఅండ్ఐ ముఖ్య కార్యదర్శిగా ఉన్న సురేశ్ కుమార్‌ను ఆయా శాఖల ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేయడంతో రాష్ట్ర సచివాలయం రెండవ భవనంలో బాధ్యతలు చేపట్టారు. ఉన్నతాధి కారులు, సచివాలయ అధికారులు, ఉద్యోగు లు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇద్దరు మావోయిస్టుల మృతి

రాంచీ: జార్ఖండ్‌లో బుధవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. ఏరియా కామాండర్ సహా ఇద్దరు మావోయిస్టులు హతమయ్యారు. బొకారో జిల్లాలో అటవీ ప్రాంతంలో ఆరుగురు మావో యిస్టులు తిరుగుతున్నట్లు ఇంటెలిజెన్స్ సమాచారం ఉండటంతో అటవీ ప్రాంతానికి చేరుకున్న భద్రతా సిబ్బందిపై మావోయిస్టులు కాల్పులు జరపడంతో రెండు వర్గాల మధ్య భీకర పోరు సాగింది.

సెల్ఫీతోనే మావోయిస్టు చలపతి ఆనవాలు!

విశాలాంధ్ర-చింతూరు: దశాబ్దాలుగా భద్రతా బలగాలకు చిక్కకుండా ముప్పతిప్పలు పెట్టిన మావోయిస్టు అగ్రనేత, సెంట్రల్ కమిటీలో కీలక సభ్యుడు చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి చత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఈ ఎన్‌కౌంటర్‌లో 20 మందికి పైగా మావోయిస్టులు చనిపోవడం, ముఖ్యంగా రూ.కోటి రివార్డు ఉన్న అగ్రనేత చలపతి మరణించడంతో ఇది భద్రతా దళాల కీలక విజయమైంది. చలపతిని భద్రతా దళాలు ఎలా గుర్తించాయి? అందుకు ఉపకరించిన కీలక ఆధారం ఏమిటి? చలపతి తన భార్య అరుణ అలియాస్ చైతన్య వెంకట్ రవితో సెల్ఫీ తీసుకోవడమే ఆయన కొంపముంచిందని, అందుకు మూల్యంగా ఆయన ప్రాణాలు కోల్పోయారని తెలిసింది. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ (ఓవోబీఎస్‌జడ్‌సీ) డిప్యూటీ కమాండర్‌గా అరుణ ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 2016 మేలో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ ఎన్‌కౌంటర్ తర్వాత ఒక స్మార్ట్‌ఫోన్‌ను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. అందులో చలపతి తన భార్య అరుణతో తీసుకున్న సెల్ఫీ కనబడింది. ఈ సెల్ఫీనే భద్రతా దళాలు చలపతిని గుర్తించడానికి సాయపడింది. చిత్తూరు జిల్లాకు చెందిన చలపతి చత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో ప్రధానంగా తన కార్యకలాపాలు సాగుస్తూ వచ్చారు. అయితే

బస్తర్‌లో ఇటీవల తరచు ఎన్‌కౌంటర్లు జరుగుతుండటంతో సేఫర్ ఆపరేషనల్ జోన్‌గా ఒడిశా సరహద్దు సమీపానికి ఆయన వచ్చాడు. మిలిటరీ తరహా వ్యూహాలు, గెరిల్లా యుద్ధతంత్రంలో చలపతి అందెవేసిన చెయ్యి అని అధికారులు తెలిపారు. ఒడిశాలోని నయాగఢ్ జిల్లాలో 2008 ఫిబ్రవరిలో జరిగిన కీలక దాడి వెనుక చలపతి ప్రధాన సూత్రధారిగా ఉన్నాడు. ఈ దాడి ఘటనలో 13 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అనంతరమే చలపతిపై రూ.కోటి రివార్డు ప్రకటించారు.

ఎనిమిది మందుపాతరలు నిర్వీర్యం

మావోయిస్టుల ఏరివేత కోసం గాలింపు ముమ్మరంగా సాగుతోంది. మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని అడవులను భద్రతాబలగాలు జల్లెడపడుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ నెల 20న రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో మావోయిస్టు అగ్రనేత చలపతి తన బృందంతో సహా దొరికిపోయాడు. మొత్తం 14 మంది మావోయిస్టులను భద్రతాబలగాలు హతమార్చాయి. అయితే మావోయిస్టుల కోసం అడవులను జల్లెడ పడుతున్న భద్రతాబలగాలకు చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని గంగలూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల కొన్ని ప్రాంతాల్లో 8 మందుపాతరలు లభ్యమయ్యాయి. వాటిని బుధవారం నిర్వీర్యం చేశారు. అందుకు సంబంధించిన వీడియోలను బీజాపూర్ పోలీసులు మీడియాకు విడుదల చేశారు. భద్రతాబలగాలపై దాడి కోసం మావోయిస్టులు అడవుల్లో మందుపాతరలు పాతిపెడుతున్నారు. బీజాపూర్ పోలీసులు నిర్వీర్యం చేసిన మందుపాతరలు ఒక్కొక్కటి 5 కిలోల చొప్పున ఉన్నట్లు వెల్లడించారు. కొన్ని రోజుల క్రితం భద్రతాబలగాల కాన్వాయ్ లక్ష్యంగా మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో ఏడుగురు జవాన్‌లు, డ్రైవర్ మరణించారు.

విద్యార్థినులపై లైంగిక వేధింపులు... టీచర్‌కు దేహశుద్ధి

విశాలాంధ్ర-కోడుమూరు: విద్యాబుద్ధులు నేర్పాల్సిన కొందరు ఉపాధ్యాయులు వృత్తికే కళంకం తెస్తున్నారు. దైవంగా భావించే గురువులు కొందరు వికృత చేష్టలతో అభంశుభం తెలియని చిన్నారులను లైంగికంగా వేధిస్తూ పైశాచిక ఆనందం పొందు తున్నారు. ఈ కోవలోనే చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడుతున్న టీచర్‌కు గ్రామస్తులు దేహశుద్ధి, పాఠశాల గదిలో బంధించిన ఘటన బుధవారం వెలుగుచూసింది. వివరాలివి. కర్నూలు జిల్లా కోడుమూరు మండలం వెంకటగిరి ఎస్సీ కాలనీలో స్పెషల్ పాఠశాల ఉంది. గలగంట లక్ష్మన్న అనే ఉపాధ్యాయుడు గత కొంత కాలంగా విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. భయభ్రాంతులైన కొందరు చిన్నారులు... ఈ విషయాన్ని తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. కోపోద్రిక్తులైన వారు బుధవారం ఉదయం గ్రామస్తులతో కలిసి పెద్దఎత్తున పాఠశాల వద్దకు చేరుకున్నారు. విధులకు రాగానే లక్ష్మన్న అనే ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసి, పాఠశాల గదిలో బంధించారు. పోలీసులకు, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. మండల విద్యాధికారులు వసంతలక్ష్మిభాయ్, తైమూరు బాష, గూడూరు ఎస్ఐ తిమ్మయ్య, తదితర అధికారులు వెంటనే గ్రామానికి చేరుకొన్నారు. వారందరి సమక్షంలోనే పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టారు. గ్రామస్తులను వారించి, ఉపాధ్యాయుడుని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తబ్రేజ్ తెలిపారు.

చిత్ర పరిశ్రమపై ఐటీ గురి

డైరెక్టర్ సుకుమార్ ఇంట్లో సోదాలు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలుగు చిత్ర పరిశ్రమపై ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) గురి పెట్టింది. పుష్ప-2 రికార్డు వసూళ్ల క్రమంలో ఆ చిత్ర దర్శకుడు సుకుమార్ ఇల్లు, ఆఫీసులో బుధవారం తనిఖీలు చేపట్టింది. మైత్రీ మేకర్స్ నిర్మించిన పుష్ప-2 చిత్రం రూ.1850 కోట్లకు పైగా రాబట్టింది. అయితే వసూళ్లకు తగ్గట్లుగా ఐటీ చెల్లించదని దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఇదే క్రమంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్వాహకులు రవిశంకర్, నవీన్‌లను విచారించారు. పుష్ప-2 కోసం సుకుమార్ తీసుకున్న రెమ్యునరేషన్, ఆదాయ పన్ను తదితర పత్రాలను పరిశీలించారు. ఆదాయ వనరులపై ఆరా తీశారు. ఐటీ అధికారుల 55 బృందాలు మంగళవారం ఉదయం నుంచే హైదరాబాద్‌లో తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే ఎనిమిది చోట్ల దాడులు చేశాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కొండాపూర్, గచ్చిబౌలి సహా అనేక ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాయి. నిర్మాత, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు నివాసాలు, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఆఫీసుతో పాటు మైత్రీ మూవీ మేకర్స్, మ్యాంగో మీడియా సంస్థల్లో ఐటీ సోదాలు జరిగిన సంగతి తెలిసిందే. సినిమాలకు పెట్టుబడులు, ఆదాయాలపై అధికారులు ఆరా తీశారు.

చేనేత, జౌళిశాఖలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద ఏపీలో స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, టెక్స్ టైల్ డిజైనర్స్‌గా పనిచేయుటకు ఆసక్తి గత అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చేనేత , జౌళి శాఖ కమిషనర్ జి. రేఖారాణి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, టెక్స్ టైల్ డిజైనర్స్ విభాగాల్లో ఒక్కో విభాగంలో ఐదు చొప్పున మొత్తం 10 ఖాళీలు ఉన్నాయన్నారు. క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్‌గా దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు హ్యాండ్లూమ్ టెక్నాలజీ లేదా టెక్స్ టైల్ టెక్నాలజీలో డిగ్రీ లేదా డిప్లొమా కలిగి ఉండాలని, కనీసం రెండు సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. అలాగే కంప్యూటర్, రికార్డులు, ఖాతా పుస్తకాల నిర్వహణపై పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. టెక్స్ టైల్ డిజైనర్ పోస్ట్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు అవసరమైన డిజైన్లు అందించడానికి నిఫ్ట్ లేదా యన్ఐడీ లేదా ప్రఖ్యాత సంస్థ నుంచి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. చేనేత విభాగంలో టెక్స్ టైల్ డిజైనర్‌గా కనీసం రెండు సంవత్సరాలు, డిజైన్లు, ఉత్పత్తుల ఉన్నతి, అభివృద్ధిలో అనుభవం కలిగి ఉండాలన్నారు. దరఖాస్తుదారులు తమ ధృవపత్రాల కాపీలతో పాటు బయోడేటాను సమర్పించాలన్నారు. తాత్కాలిక ప్రాతిపదికన మూడు సంవత్సరాలు లేదా క్లస్టర్ అమలు కాలం ఏది ముందుగా అయితే అప్పటి వరకు నెలకు రూ.30 వేల పారితోషకం ఉంటుందని వివరించారు. అభ్యర్థులు 21 రోజుల లోపు కమిషనర్, జౌళి,చేనేత శాఖ, 4వ అంతస్థు, ఐహెచ్‌సీ కార్పొరేట్ బిల్డింగ్, ఆటో నగర్, మంగళగిరి, అమరావతి, గుంటూరు జిల్లా-522503 కి దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. క్లస్టర్ మార్గదర్శకాలు హ్యాండ్లూమ్స్.ఎన్ఐసీ. ఇన్ వెబ్ సైట్ లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అభ్యర్థులను అర్హత, అనుభవం, వయస్సు, నివాసం తదితర అంశాల ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు.

'మిమ్స్' డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: వైద్య సేవలలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఉత్తరాంధ్రలోని నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రి 2025 డైరీని బుధవారం ఆవిష్కరించింది. జాతీయ తెలుగు దినపత్రిక విశాలాంధ్ర... మిమ్స్ ఆసుపత్రి కోసం ప్రత్యేక డైరీని రూపొందించింది. కొత్త సంవత్సరం డైరీని మిమ్స్ వైస్ చైర్మన్ ప్రవీణ్ వర్మ ఆవిష్కరించారు. అనంతరం ట్రస్టు సభ్యులకు, అధికారులకు, సిబ్బందికి డైరీలు అందజేశారు. ప్రవీణ్ వర్మ మాట్లాడుతూ ముద్రణా రంగంలో అపార అనుభవం ఉన్న విశాలాంధ్ర సంస్థ తమ కోసం ప్రత్యేక డైరీ-2025ను ఎంతో అందంగా తయారు చేసిందని ప్రశంసించారు. కార్యక్రమంలో మిమ్స్ ఏవో గణేశ్, విశాలాంధ్ర విశాఖ ఎడిషన్ మేనేజర్ నరసింహులు, విజయనగరం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఎన్ సన్యాసిరావు, విజయనగరం టౌన్ ఇన్‌చార్జి మరుపల్లి ప్రతాప్, పట్టణ రిపోర్టర్లు వెంకటేశ్, సూర్యం పాల్గొన్నారు.

తిరుపతి తొక్కిసలాటపై న్యాయ విచారణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: తిరుపతి తొక్కిసలాట ఘటనపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణ మూర్తి నేతృత్వంలో జ్యుడిషియల్ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నివేదికను ఆరు నెలల్లో ప్రభుత్వానికి అందజేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ నెల 8న వైకుంఠ ద్వారదర్శన టోకెన్ల పంపిణీని తిరుపతిలోని పద్మావతి పార్క్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద తొక్కిసలాట జరిగింది. ఆరుగురు భక్తులు మృతి చెందగా, కొందరు గాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. న్యాయ విచారణకు ఆదేశిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ మేరకు న్యాయ విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వేద విద్యార్థులు, డ్రైవర్ మృతి

విశాలాంధ్ర-మంత్రాలయం: కర్నాటకలో కర్నూలు జిల్లా మంత్రాలయ శ్రీరాఘవేంద్ర స్వామి మఠం వేదపాఠశాల విద్యార్థుల వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. మంగళవారం రాత్రి మంత్రాలయం నుంచి వేదపాఠశాల విద్యార్థులు కర్నాటకలోని హంపి క్షేత్రానికి బయల్దేరారు. నరహరి తీర్థుల ఆరాధనకు 14 మంది విద్యార్థులతో వాహనం బయల్దేరింది. సింధనూరు సమీపంలో వాహనం బోల్తాపడింది. డ్రైవర్ శివ, అభిలాష, హైందవ, సుజేంద్ర అనే వేద విద్యార్థులు అక్కడికక్కడే మృతిచెందారు. ఎనిమిది మంది విద్యార్థులు గాయపడ్డారు. క్షతగాత్రులను సింధనూరు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విద్యార్థుల మృతి పట్ల శ్రీ మఠం పీఠాధిపతి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: సీఎం

కర్నాటకలో జరిగిన రోడ్డు ప్రమాదం వార్త దిగ్భ్రాంతిని, తీవ్ర ఆవేదనను కలిగించిందని సీఎం చంద్రబాబు అన్నారు. హంపికి వెళ్తూ పొరుగు రాష్ట్రంలో ప్రమాదానికి గురైన వారికి అవసరమైన వైద్య సాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామన్నారు. కాగా, వేద విద్యార్థుల మృతిపై మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ... మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

అంబేద్కర్ స్మృతివనం అభివృద్ధి చేయాలి

డీహెచ్‌పీఎస్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: భారతదేశ ప్రతిష్ఠను ప్రపంచంలో ఇనుమడింపజేసిన రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ 125 అడుగులు విగ్రహానికి సంబంధించిన అభివృద్ధి పనులు తగిన స్థాయిలో లేకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) పేర్కొంది. విజయవాడ నడిబోడ్డులో అద్భుత నిర్మాణంగా సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్న ఈ ప్రాజెక్టుపై నీలినీడలు అలుముకున్నాయి. విగ్రహం పరిసరాల అభివృద్ధి పనులు నిరూపయోగంగా ఉండటంతో అనేక విమర్శలు వెల్లువెత్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు అవుతున్నప్పటికీ ప్రాజెక్టు పనులు చేపట్టకపోవడంపై డీహెచ్‌పీఎస్ బుధవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలోని అన్నివర్గాల ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో కూడిన రాజ్యాంగాన్ని రూపొందించి నిస్వార్థ రాజకీయవేత్తగా అంబేద్కర్ ప్రశంసలు అందుకున్నారని సమితి నాయకులు గుర్తు చేశారు. సామాజిక న్యాయ మహాశిల్పంగా నిలిచారని, అటువంటి మహానేత 125 అడుగుల విగ్రహానికి తగు రీతిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారని తెలిపారు. స్మృతివనం పరిసరాల్లో తగిన సౌకర్యాలు లేనందున సందర్శకులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఇప్పటికే అనేక మార్లు దళిత సంఘాలు, ప్రజాసంఘాలు, అంబేద్కరిస్టులు, రాజకీయ పార్టీలు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ప్రకటన విడుదల చేసినవారిలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జె.వి.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప, నగర అధ్యక్షులు సంగుల పేరయ్య ఉన్నారు.

జగన్‌కు ఏబీ వెంకటేశ్వరరావు క్షమాపణలు

ఎమ్మెల్సీ తలశిల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏసీబీ కేసు ఎదుర్కొన్న రిటైర్డ్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ డిమాండ్ చేశారు. తప్పు చేసిన ఏబీవీ ... కుల దురహంకారంతో ప్రవర్తించడం సరికాదన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వాన్ని, జగన్‌ను ఉద్దేశించి ఏబీ వెంకటేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు ఆయన కుల జాఢ్యానికి నిదర్శనమని అన్నారు. చంద్రబాబు ఆదేశాలతోనే ఏబీ వెంకటేశ్వరరావు చౌకబారు చిల్లర వ్యాఖ్యలు చేశారని, ఇలాంటి వ్యక్తి కృష్ణాజిల్లాలో పుట్టినందుకు బాధపడుతున్నామని అన్నారు. ఏబీవీ ఉన్నత పోలీస్ ఉద్యోగం చేసిన ఐపీఎస్ అధికారిలా కాకుండా కులోన్మాదంతో మాట్లాడారని మండిపడ్డారు. కమ్మ కులం మొత్తం ఒకేతాటిపై నిలబడి జగన్‌ను ఓడించాలని ఏబీవీ సెలవిస్తున్నాడని, మరి కేవలం కమ్మ కులస్తులు ఓటేస్తేనే చంద్రబాబు సీఎం అయ్యారా... ఆ విషయాన్ని ఏబీవీ గుర్తుంచుకోవాలని హితవు పలికారు. మూడు ప్రధాన పార్టీలు ఏకమైనా వైసీపీ 40 శాతం ఓట్లు సాధించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో కులం, మతం, ప్రాంతం, వర్గం, రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేశారని వివరించారు. ఒక కులాన్ని వర్గ శత్రువుగా చూడొద్దని పవన్‌కల్యాణ్ చెబుతుంటారని, ఇప్పుడు ఏబీవీ వ్యాఖ్యలపై ఆయన స్పందించాలని, లేని పక్షంలో ఆయన కూడా కులవాదాన్ని సమర్థిస్తున్నారని భావించాల్సి ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో చిన్నచిన్న పోస్టులకే కేసులు పెట్టిన ప్రభుత్వం దీనిపై ఏం చర్యలు తీసుకుంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.